RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 02, సంచిక 42, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -10, శనివారం - 17 - మే - 2025 , వెల రూ.5/-

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది



- 'కొండా సురేఖకు నా అభినందనలు'
- ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్
- ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది.

## 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

- ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలి



- కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం
- రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు
- మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి

## రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే

- సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం
- మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి



- జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం

## ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ లైన్లు
# అన్నీ భూగర్భంలోనే

- వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025- 26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సీటీ లో మిగతా.. 2లో

## చంద్రబాబు బ్రాండ్‌తోనే
# ఏపీలో పెట్టుబడులు

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్న మంత్రి
- బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ
- 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో రెవెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటు



అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీకి వివిధ సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టడానికి సీఎం చంద్రబాబు బ్రాండే దోహపడిందన్నారు. మిగతా.. 2లో



## 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

కశ్మీర్‌లో భద్రతా బలగాల జాయింట్ ఆపరేషన్

కాశ్మీర్ లోయలో భద్రతా బలగాల సంయుక్త చర్యలు

గత 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

"క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం"

తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు.

ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు

వరంగల్: ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 4. 5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు.



"క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. మిగతా.. 2లో

## తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ..
# 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు

అన్నమయ్య భవన్‌లో నిన్న తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం




ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరు

అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన సమావేశం

తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన మిగతా.. 2లో



## గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. 80 మంది దుర్మరణం

గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 80 మంది పాలస్తీనియన్ల మృతి

ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆసుపత్రిలో 54 మృతదేహాలు నమోదు

దాడులతో గాజా యూరోపియన్ ఆసుపత్రి (క్యాన్సర్ ఆసుపత్రి) సేవలు బంద్



## త్వరలోనే పుతిన్‌తో ముఖాముఖి భేటీ: ట్రంప్

తుర్కియే వేదికగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు

"ఈ చర్చలకు పుతిన్ హాజరుకాకపోవడం నన్నేమీ ఆశ్చర్యపర్చలేదు

## ఇతరులు పాలసీలు చూసిన చోట
# ఆయన అవకాశాలు చూశారు

### అనంతపురం జిల్లాలో రెన్యూ పవర్ భారీ ప్రాజెక్టుకు భూమిపూజ

- రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ నిర్మాణం
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏపీని క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి






అనంతపురం : ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం, బేతపల్లి గ్రామంలో రెన్యూ పవర్ సంస్థ ఏర్పాటు చేయనున్న రూ. 22 వేల కోట్ల విలువైన భారీ హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రెన్యూ పవర్ ప్రాజెక్టుకు మనం వేస్తున్న పునాదిరాయి, భారతదేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి వంటిది. రూ. 22 వేల కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు కేవలం గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు ఊతమిస్తుంది" అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ కాదని, అదొక ఉద్యమమని, భవిష్యత్ తరాలకు ఇదొక వారధి అని ఆయన అభివర్ణించారు. "రెన్యూ పవర్ వారి మిగతా.. 2లో

## ఆపరేషన్ సిందూర్ ట్రైలరే,
# అసలు సినిమా ముందుంది

### పాక్‌కు రాజ్‌నాథ్ స్ట్రాంగ్ వార్నింగ్!



- ఆపరేషన్ సిందూర్ ట్రైలరేనన్న రాజ్‌నాథ్ సింగ్
- సమయం వచ్చినప్పుడు పూర్తి సినిమా చూపిస్తామని వ్యాఖ్య
- ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తే పాక్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- బ్రహ్మోస్ క్షిపణి దెబ్బకు పాక్ దిగివచ్చిందన్న రక్షణ మంత్రి
- 23 నిమిషాల్లోనే పాక్‌లో ఉగ్ర మూకలను దెబ్బతీశామని వెల్లడి

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగిసిపోలేదని, ప్రపంచం ఇప్పటివరకు చూసింది కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి సినిమా చూపిస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న తీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఉన్న భారత వైమానిక దళ స్థావరంలో శుక్రవారం ఎయిర్ వారియర్స్, భద్రతా దళాలను ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అందరూ ఇప్పటిదాకా చూసింది మిగతా.. 2లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం



# ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ లైన్లు అన్నీ భూగర్భంలోనే

మొదటి పేజి తరువాయి




విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సీటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

మొదటి పేజి తరువాయి



సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం" అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

# చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీలో పెట్టుబడులు

మొదటి పేజి తరువాయి




సీఎం చంద్రబాబు బ్రాండే దోహపడిందన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు శుక్రవారం నాడు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22 వేల కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో పదివేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఏపీ గడ్డపై ఉత్పత్తి అయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా... దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లపై గుంతలను పూడ్చలేకపోయిందని దుయ్యబట్టారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారన్నారు. అలాంటిది, ఇప్పుడు టీసీఎస్, టాటా ఎనర్జీతో పాటు పలు ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు.

## తిరుమలలో అత్యున్నత స్థాయి భద్రతకు కార్యాచరణ..

# 14 ప్రవేశ ద్వారాలలో నిఘాకు చర్యలు




తిరుపతి: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ షెమూషీ భాజ్‌పేయీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ... ఇటీవల పహల్గాం ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు, టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. అంతకు ముందు టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్ఓ, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. అలాగే ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు..



రాజన్న సిరిసిల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డ వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## మెగా డీఎస్సీ గడువు పొడిగింపుపై

# మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి: మెగా డీఎస్సీ ద్వారా ఏపీ ప్రభుత్వం 16, 347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ గురువారంతో ముగిసింది. జూన్ 6 నుంచి పరీక్షలు జరగనున్నాయి. అయితే, ప్రిపరేషన్‌కు 90 రోజుల గడువు ఇవ్వాలని చాలా మంది అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన చేసినప్పటి నుంచి ఇదే డిమాండ్ వినిపిస్తోంది. తాజాగా ఈ డిమాండ్‌పై ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

"డీఎస్సీ ఆపేందుకు వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కొందరు సమయం పెంచాలంటున్నారు. గతేడాది డిసెంబర్‌లోనే మేము సిలబస్ ప్రకటించడం జరిగింది. ఏకంగా ఏడు నెలలు గడువిచ్చాం" అని ఆయన గుర్తు చేశారు. దీంతో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలతో మెగా డీఎస్సీ గడువు పెంపునకు అవకాశం లేదని క్లారిటీ ఇచ్చుటినట్లైంది.

ఏపీ మెగా డీఎస్సీ 2025 పూర్తి షెడ్యూల్ ఇలా..

ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల స్వీకరణ తేదీలు: ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు,మాక్ టెస్టులు: మే 20 నుంచి, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ తేదీ: మే 30 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ఏపీ డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు: జూన్ 6 నుంచి జులై 6 వరకు, ప్రాథమిక కీ విడుదల: అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజే ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ: ఆ తర్వాత ఏడు రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్ కీ: అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల, మెరిట్ జాబితా: ఫైనల్ కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత విడుదల .

# ఆపరేషన్ సిందూర్ ట్రైలరే,అసలు సినిమా ముందుంది

మొదటి పేజి తరువాయి



అందరూ ఇప్పటిదాకా చూసింది ఒక ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినప్పుడు భారత సాయుధ దళాలు పూర్తి చిత్రాన్ని ప్రదర్శిస్తాయి" అని ఆయన స్పష్టం చేశారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో కలిసి వైమానిక స్థావరాన్ని సందర్శించిన రక్షణ మంత్రి, ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా నిర్వహించినందుకు దళాలను అభినందించారు. తమ గడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మోస్ క్షిపణి శక్తిని పాకిస్థాన్ గుర్తించక తప్పలేదని అన్నారు. "పదేపదే నేరాలు చేసేవారిని ఎలాగైతే నిఘాలో ఉంచుతారో, అలాగే పాకిస్థాన్‌ను కూడా మేము ప్రొబేషన్‌లో ఉంచాం. కాల్పుల విరమణ అంటే చర్యలు పూర్తిగా ఆగిపోయినట్టు కాదు. ఒకవేళ పాకిస్థాన్ తన పద్ధతులు మార్చుకోకుండా మళ్లీ దుస్సాహసాలకు పాల్పడితే, మన దళాలు గట్టి గుణపాఠం చెబుతాయి... మళ్లీ చెబుతున్నా!" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "మన దేశంలో 'పగటిపూట చుక్కలు చూపించడం' అనే ఒక సామెత ఉంది. మేడ్ ఇన్ ఇండియా బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు 'రాత్రి చీకటిలో పగటి వెలుగు' చూపించింది" అంటూ రాజ్‌నాథ్ సింగ్ గర్జించగా, దళాలు హర్షధ్వానాలతో మద్దతు తెలిపాయి. "పాకిస్థాన్‌లో పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని అణచివేయడానికి భారత వైమానిక దళానికి కేవలం 23 నిమిషాలు సరిపోయాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో మీరు చేసిన పని మా అందరికీ గర్వకారణం" అని ఆయన సైనికులను ఉద్దేశించి అన్నారు. దేశాన్ని భయభ్రాంతులకు గురిచేసే వారిని క్షమించే ధోరణికి బదులు, కఠినంగా శిక్షించే చర్యలకు ప్రాధాన్యతనిచ్చే భారతదేశ నూతన భద్రతా సిద్ధాంతాన్ని పునరుద్ఘాటిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించి, దానికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని ఆయన ప్రతినబూనారు. "ఆపరేషన్ 'సిందూర్' అంటే, అది కేవలం అలంకరణకు చిహ్నం కాదని, మీ పరాక్రమానికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని మీరు ప్రపంచానికి చాటిచెప్పారు" అని సైనికులతో అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కార్యక్రమంలో భాగంగా పాకిస్థాన్‌కు నిధులు సమకూర్చడాన్ని కూడా రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. "అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి అందుకున్న నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు చేస్తుంది" అని ఆయన ఆరోపించారు. బెయిలౌట్ ప్యాకేజీపైనే ఎక్కువగా ఆధారపడుతున్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇటీవల 1.023 బిలియన్ డాలర్ల రెండో విడత నిధులను విడుదల చేసిన విషయం గమనార్హం.

# ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు

మొదటి పేజి తరువాయి

"రెన్యూ పవర్ వారి పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం... సాహసోపేతమైన నిర్ణయానికి, స్థిరమైన ప్రగతికి చిహ్నం. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ రేపటి వెలుగుకు దారి చూపుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు... ఇది ఒక ఉద్యమం. ఈ రోజు మన కలలకు, భవిష్యత్ తరాలకు వారధి లాంటిది. భూమిపై సూర్యకాంతి, స్వచ్ఛమైన, అమూల్యమైన గాలి లభిస్తున్నపుడు భావితరం కోసం మరోగ్రహం కోసం ఎందుకు ఆలోచించాలి? శిలాజ ఇంధనాల నుండి భవిష్యత్ ఇంధనాల వినియోగం కోసం మేం ముందడుగు వేస్తున్నాం. భావితరాల కోసం ఒక ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని లోకేశ్ కొనియాడారు. "ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ భారతదేశ హరిత విప్లవానికి బ్లూప్రింట్‌గా మారింది" అని ప్రశంసించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే టాటా పవర్, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, వేదాంత సెరెంటికా, సెయిల్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్ వంటి క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు.

ప్రాజెక్టు వివరాలు – ఉపాధి అవకాశాలు

అనంతపురంలో రెన్యూ సంస్థ నెలకొల్పనున్న ఈ పునరుత్పాదక




ఇంధన కాంప్లెక్స్‌ను రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశలో రూ.7 వేల కోట్ల పెట్టుబడితో 587 మెగావాట్ల సౌర, 250 మెగావాట్ల పవన, 415 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తం మీద రూ.22 వేల కోట్ల పెట్టుబడితో 1800 మెగావాట్ల సౌర, 1 గిగావాట్ పవన, 2000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి యూనిట్లను వివిధ దశల్లో నెలకొల్పుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

తిరిగి వస్తున్న పరిశ్రమలు – ప్రభుత్వ లక్ష్యాలు

ఐదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగం పునరుజ్జీవనం పొందుతోందని మంత్రి లోకేష్ అన్నారు. "గత ప్రభుత్వ హయాంలో పారిపోయిన కంపెనీలన్నీ మళ్లీ ప్రజాప్రభుత్వంలో తిరిగి వస్తున్నాయి. చంద్రబాబు బ్రాండ్ వల్లే రెన్యూ వంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి," అని పేర్కొన్నారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. వచ్చే నెలలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే లక్ష్యంతోనే ఇటువంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నామని, ఇక్కడ తయారయ్యే విద్యుత్ రాష్ట్రంతో పాటు దేశ అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకువెళుతోందని, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి, సీఎం చంద్రబాబు విజన్ తోడైందని, ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఈ కాంప్లెక్స్ దేశంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. స్థానిక రైతులు సహకరించాలని ఆయన కోరారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాకతో స్థానిక రైతులకు ఎకరాకు రూ.35 వేల వరకు కౌలు లభిస్తుందని, వారి పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు..

# 80 మంది దుర్మరణం

గాజా: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. గురువారం జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 80 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గాయపడ్డారని పాలస్తీనా వైద్య వర్గాలు వెల్లడించాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో జరిగిన దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా 54 మంది మరణించినట్లు నాసర్ ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడుల కారణంగా గాజాలో క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించే ఏకైక ఆసుపత్రి అయిన గాజా యూరోపియన్ హాస్పిటల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని అక్కడి ఆరోగ్య అధికారులు తెలిపారు. ఆసుపత్రి మౌలిక వసతులు, మురుగునీటి లైన్లు దెబ్బతినడంతో పాటు, అంతర్గత విభాగాలు ధ్వంసమయ్యాయని, ఆసుపత్రికి దారితీసే రహదారులు నాశనమయ్యాయని వారు వివరించారు. గాజా నగరం మరియు ఉత్తర గాజాలోని ఇతర ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో 26 మంది మరణించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో హమాస్‌ను ఓడించే ప్రయత్నాలలో భాగంగా ఇజ్రాయెల్ సైన్యం పూర్తి శక్తితో గాజాలోకి ప్రవేశిస్తుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం హెచ్చరించిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. మార్చి 18న రెండు నెలల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ గాజాలో భారీ సైనిక చర్యలను తిరిగి ప్రారంభించింది. అప్పటి నుండి 2,876 మంది పాలస్తీనియన్లు మరణించగా, 7,800 మందికి పైగా గాయపడ్డారు. అక్టోబర్ 7, 2023న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి మొత్తం పాలస్తీనియన్ల మరణాల సంఖ్య 53,010కి చేరుకుందని గాజా ఆరోగ్య అధికారులు గురువారం తెలిపారు. పౌరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ "జనావాసాలను ఖాళీ చేయించి, ప్రదేశాలను కుదించే" విధానాన్ని అనుసరిస్తోందని గాజాలోని పౌర రక్షణ విభాగం ప్రతినిధి మహమూద్ బసల్ ఆరోపించారు. పాఠశాలలు, నిరాశ్రయుల శిబిరాలపై దాడులు జరుగుతాయనే భయంతో వేలాది మంది రాత్రుళ్లు వీధుల్లో గడిపారని, బాధితుల వద్దకు సహాయక బృందాలు చేరుకోకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నాయని, పౌర రక్షణ మౌలిక సదుపాయాలను క్రమపద్ధతిలో నాశనం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మార్చి 2 నుండి గాజాకు ఎలాంటి మానవతా సహాయం అందలేదని, గాజాలో అర మిలియన్ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

ఢిల్లీ: కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాయి. గత 48 గంటల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారులు శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది కుమార్, విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి, సీఆర్పీఎఫ్ ఐజీ మితేష్ జైన్ పాల్గొన్నారు. ఐజీపీ వీకే బిర్ది కుమార్ మాట్లాడుతూ, "కాశ్మీర్ లోయలో పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించుకున్నాయి. ఈ సమీక్ష అనంతరం ఆపరేషన్లపై మరింత దృష్టి సారించాం. ఈ సమన్వయం, పెరిగిన ఏకాగ్రతతో గత 48 గంటల్లో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించాం. షోపియాన్‌లోని కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ల గురించి వివరిస్తూ, ఈ రెండు ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. "మే 12న కెలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాద బృందం సంచరిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మే 13 ఉదయం, కొంత కదలికను గుర్తించిన మా బృందాలు ఉగ్రవాదులను హెచ్చరించగా, వారు కాల్పులతో ప్రతిస్పందించారు. మా దళాలు వారిని మట్టుబెట్టాయి" అని ఆయన వివరించారు. "ట్రాల్ ప్రాంతంలోని ఒక గ్రామంలో రెండో ఆపరేషన్ జరిగింది. మేము గ్రామాన్ని చుట్టుముడుతుండగా, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో స్థానాలు ఏర్పరచుకుని మాపై కాల్పులు జరిపారు. ఈ సమయంలో, గ్రామస్తులైన పౌరులను రక్షించడం మాకు పెద్ద సవాలుగా మారింది. ఆ తర్వాత ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం. హతమైన ఆరుగురు ఉగ్రవాదుల్లో షాహిద్ కుట్టే అనే వ్యక్తి ఒక జర్మన్ పర్యాటకుడిపై దాడితో సహా రెండు పెద్ద దాడుల్లో పాల్గొన్నాడు. నిధుల సమీకరణ కార్యకలాపాల్లో కూడా అతడి ప్రమేయం ఉంది" అని మేజర్ జనరల్ ధనంజయ జోషి తెలిపారు.

# త్వరలోనే పుతిన్‌తో ముఖాముఖి భేటీ: ట్రంప్

అబుదాబీ: రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు మొదలయ్యాయి. అయితే, వీటికి పుతిన్ గైర్హాజరయ్యారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తాను పుతిన్ తో ముఖాముఖి భేటీ కానున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా పర్యటన ముగించుకుని ట్రంప్ అమెరికా తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన.. రష్యా–ఉక్రెయిన్ శాంతి చర్చల అంశాన్ని ప్రస్తావించారు. "ఈ చర్చలకు పుతిన్ హాజరుకాకపోవడం నన్నేమీ ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే నేను లేకుండా ఆయన అక్కడకు వెళ్లరు. బహుశా మేమిద్దరం కలుసుకునే సమయం వచ్చినట్లు ఉంది. వీలైనంత త్వరలోనే పుతిన్‌తో నేను ముఖాముఖిగా సమావేశమవుతా" అని ట్రంప్ వెల్లడించారు. తన కుమార్తె టిఫనీ బిడ్డకు జన్మనిచ్చిందని, అందుకే తాను వెంటనే అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే రష్యా మాత్రం ఎలాంటి నిర్ణయమూ చెప్పలేదు. ఈ క్రమంలోనే తుర్కియే వేదికగా ఇరు దేశాలు శాంతి చర్చలు ప్రారంభించాయి. మూడేళ్ల యుద్ధంలో ఇరు దేశాల మధ్య నేరుగా చర్చలు జరగడం ఇదే తొలిసారి. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన బృందంతో హాజరయ్యారు. కానీ, పుతిన్ మాత్రం తన స్థానంలో కేవలం ప్రతినిధుల బృందాన్ని పంపించారు. దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. యుద్ధాన్ని ముగించడం రష్యాకు ఇష్టం లేదని ఆరోపించారు.

# 'సురేఖ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రేవంత్ కమీషన్ల సంగతేంటి?'

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రులు కమీషన్లు తీసుకోకుండా సంతకాలు చేయరు అని మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. దీంతో, ఆమె వ్యాఖ్యలపై తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ.. ఏయే మంత్రి ఎంత కమీషన్లు తీసుకున్నారో దర్యాప్తు చేపట్టాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మంత్రులు కమిషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరం. అంటే రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ఇదే డిమాండ్ చేస్తున్నాం. ఏయే శాఖ మంత్రి ఎంత తీసుకున్నారో దర్యాప్తునకు ఆదేశించాలి. మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలి అని వ్యాఖ్యలు చేశారు.

రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర..

ఇదే సమయంలో తిరంగా యాత్రపై మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో 26 మందిని ఉగ్రమూకలు హతమార్చారు. మానవత్వం లేకుండా పిల్లల ముందు తండ్రిని, భార్య ముందు భర్తను పేర్లు అడిగి హతమార్చారు. మానవ సమాజానికే సవాల్ గా మారిన ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. పాకిస్తాన్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను పేల్చివేశాం. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయడం జరిగింది. ఉగ్రవాద చర్యలతో మనదేశం బలవుతూనే ఉంది. జమ్ముకశ్మీర్‌లోనే 46 వేల మందిని ఉగ్రమూకలు బలితీసుకున్నాయి. మన సైనికులు నూతన చరిత్రను ప్రారంభించారు. గతంలో ఉగ్రమూకలు దాడి చేసినప్పుడు.. మరణించినవారి ఫోటో దగ్గర గులాబీ పువ్వు పెట్టడం వరకే పరిమితం అయ్యే వాళ్ళం. 2009లో 40 మందిని ఊచకోత కోశారు. భారత్‌పై దాడి చేస్తే ప్రతీకారం ఎలా ఉంటుందో చూపించాం. ఉగ్రవాదుల శిక్షణ కార్యక్రమాలు, ఉగ్రవాదుల నివాసాలను ధ్వంసం చేశాం. కరడుకట్టిన ఉగ్రవాదులను అంతం చేశాం. పాకిస్తాన్ పిల్ల చేష్టలతో దాడికి ఒడిగట్టింది.. భారత సైన్యం తిప్పికొట్టింది. ఆపరేషన్ సిందూర్ ఆగలేదు.. ఇంకా కొనసాగుతోంది. రక్షణ రంగంలో ప్రతి సైనికుడు రాణించారు. ఎస్–400, బ్రహ్మాస్త్రం పనితీరు దేశ ప్రజలు గమనించారు. భారత ఆర్మీకి అన్ని రకాలుగా సమకూర్చడం జరిగింది. ఆర్మీకి అవసరమైన వాటిలో 35 శాతం మనమే సమకూర్చుకున్నాం. మిథానీ, DRDAలో వసతులు మెరుగు పరుస్తున్నాం. ఆర్డినెన్సు ఫ్యాక్టరీలను మరింత సంసిద్ధం చేసుకున్నాం. పాకిస్తాన్‌ను ప్రపంచం ముందు దోషిగా నిలబెడతాం. భారత సైనికులు అనుసరించిన స్ట్రాటజీని ప్రపంచం మొత్తం చూసింది. రాజకీయాలకు అతీతంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అన్ని రాజకీయ పార్టీలను, ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానిస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. మంత్రులు కమిషన్లు తీసుకోకుండా ఏ పనిచేయరంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయట పెట్టినందుకు మంత్రి కొండా సురేఖకు నా హృదయపూర్వక అభినందనలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయింది. ఇది రహస్యమే కాదు. ఓపెన్ సీక్రెట్. అంతేకాదు, ఈ ప్రభుత్వంలో ఫైల్స్‌పై సంతకం చేసేందుకు మంత్రులు, వారి సహచర మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారు. ఇదే కమిషన్ల వ్యవహారంలో సచివాలయంలో పలువురు కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయం గుర్తుందా? అని ప్రశ్నించారు. ఆ ఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమిషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసింది. ఈ సందర్భంగా కొండా సురేఖని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. కమిషన్లు తీసుకుంటున్న మంత్రుల వివరాల్ని బయటపెట్టాలి. ప్రజల ముందు బహిర్గతం చేయాలని అన్నారు. ఇదే అంశంపై రాహుల్ గాంధీ,రేవంత్‌రెడ్డిలు వారి సొంత కేబినెట్ మంత్రి చేసిన ఆరోపణలపై మీరు దర్యాప్తుకు ఆదేశించగలరా?'అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## రికార్డు సృష్టించేలా విశాఖలో

# అంతర్జాతీయ యోగా డే

అమరావతి: రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలన్నారు. జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నెల రోజుల పాటు యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. విశాఖలో లక్షల మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేస్తారని, ఆర్‌కే బీచ్ నుంచి సముద్రతీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహించనున్నట్టు వెల్లడించారు. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలని సీఎం అన్నారు.

# పట్టలు కట్టని ఇసుక లారీలతో వాహన ప్రయాణికులకు అగచాట్లు

## తరచు ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనాలు





నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి /పామూరు): జాతీయ రహదారిపై ఇసుకతో టిప్పర్లు,లారీలు పట్టలు కట్టకుండా వెళుతుండడంతో వెనక నుంచి వెళ్లే ద్విచక్ర వాహనదారుల కళ్ళలో ఇసుకపడి తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా సందర్భాల్లో లారీ యజమానులకు ఈ సమస్యను వివరించిన వారి నుంచి సరైన స్పందన రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఇసుక రవాణా చేసే లారీ ల యజమానులు స్పందించి ఇసుక రవాణా చేసే సమయంలో ఇసుక పై భాగాన్ని పూర్తిగా పట్ట లతో కప్పి రవాణా కొనసాగించాలని ద్విచక్ర వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

# వనమహోత్సవం 2025-26 - నాలుగు లక్షల మొక్కల నాటింపు లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



ఖమ్మం, **(నేటి శుభోదయ):** వనమహోత్సవం 2025-26 లో భాగంగా ప్రకృతిని పరిరక్షించడమే లక్ష్యంగా నాలుగు లక్షల మొక్కలను నాటే లక్ష్యాన్ని సాధించేందుకు ముందస్తు చర్యలలో భాగంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడానికి హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక గార్డెన్ విభాగంలోని సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక గార్డెన్ విభాగానికి సంబంధించిన సూపర్వైజర్లతో మాట్లాడుతూ ప్రత్యేకించి, మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయి? అలాగే, బల్క్ ప్లాంటేషన్ (గుంపులుగా మొక్కల నాటింపు) చేయగలిగే ప్రాంతాలు ఎక్కడ వున్నాయి? అనే అంశాలపై చర్చించారు. మొక్కలు ఎక్కడైతే లేవు ఆ ప్రదేశాలు అంతే ఇంత ముందు వేసిన మొక్కలు చనిపోయిన ప్రదేశాలు గుర్తించి అక్కడ నాటడం మొక్కల కోసం తీసుకోవాల్సిన సంరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, అత్యంత అనువైన ప్రదేశాల ఎంపికకు ప్రాధాన్యం ఇస్తూ , ప్రతి డివిజన్ స్థాయిలో మొక్కల నాటింపును విజయవంతంగా నిర్వహించేందుకు రెడీగా ఉండాలని సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచడంతో పాటు, నగరాల హరితవనాల విస్తరణకు కూడా ఉపకారం చేకూరుతుంది. అని అన్నారు.

# డిఐసిఎస్ సి ప్రాజెక్ట్ ఖమ్మం జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక




ఖమ్మం,**(నేటి శుభోదయ):** దేశవ్యాప్తంగా 10 జిల్లాల్లో ప్రారంభమైన డిఐసిఎస్ సి ప్రాజెక్ట్‌లో ఖమ్మం జిల్లాను ముఖ్యంగా (పైలట్ గా) ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 137 మంది ఎస్ హెచ్ జి (స్వయం సహాయక సంఘాల) మహిళలు ఎంపికయ్యారు. ఎస్ ఈఆర్ పి , సిఎస్ సి కలిసి, ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు మోడల్ సిఎస్ సి కేంద్రాలు స్థాపించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలు రాజీవ్ యువ వికాసం, డిఐసిఎస్ సి ద్వారా మంజూరవుతాయి. ఈ కార్యక్రమంలో 70 మంది మహిళలు ఆర్ ఎస్ ఈటిఐ సంస్థలో వ్యాపార శిక్షణ పొందారు. డిఆర్డిఏ పిడి సన్యాసయ్య ప్రాజెక్ట్ నుంచి వచ్చిన సభ్యులు మహిళలతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఐడిఓసి కార్యాలయాన్ని సందర్శించి, డిఆర్ డిఓ కి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు అభినందనలు చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న మంచి కార్యక్రమాలకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐసిఎస్ సి రాష్ట్ర ఇంచార్జి హరికృష్ణ కుమార్, సిఎస్ సి జిల్లా కోఆర్డినేటర్ ఫయాజ్, జిల్లా మేనేజర్ సురేష్, ఆర్ ఎస్ ఈటిఐ సిబ్బంది, ఎస్ హెచ్ జి మహిళలు పాల్గొన్నారు.



# పోదలను తొలగించిన స్థానికులు



దమ్మపేట ప్రతినిధి **(నేటి శుభోదయ):** దమ్మపేట మండల పరిధిలో గల మందలపల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై ఇరువైపులా పొదలు పెరిగి రోడ్డు ప్రమాదాల నివారణకు స్వచ్ఛందంగా మందలపల్లి గ్రామానికి చెందిన అజీమ్ సోము అబ్బులు నాగరాజు కలిసి ఇరువైపుల పెరిగిన రాకాసి కంపలను జెసిబి తో తొలగించారు దీంతో స్థానికులు అభినందించారు

# వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మెచ్చ



దమ్మపేట ప్రతినిధి **(నేటి శుభోదయ):** దమ్మపేట మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాయుడు సుబ్బారావు కుమారుడు నాయుడు శ్రీనివాస్ - కావ్యాల వివాహం స్థానిక వినాయక ఫంక్షన్ హాల్ లో జరగక ఈ వేడుకకు అశ్వరావుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో దారా యుగంధర్, వలి పాషా, యార్లగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# నాలుగు ఆర్ఓబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి

## ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు శుభవార్త చెప్పిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు,**(నేటి శుభోదయ):** ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో నాలుగు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబి) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ జిల్లా వాసులకు శుభవార్త చెప్పారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. రైల్వే కి సంబంధించిన సమస్యలపై ఢిల్లీలో నిరంతరం తాను పర్యవేక్షిస్తున్నానని, ఫలితంగా మొదటి విడతగా నాలుగు ఆర్ఓబిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల, కొల్లేరు పర్యాటక కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా, జాతీయ రహదారిపై వాహనాల రద్దీని నియంత్రించడానికి వీలుగా భీమడోలు వద్ద, అప్‌ల్యాండ్ నుండి డెల్టాకు రాకపోకల అవకాశం కల్పించడానికి స్థానిక ప్రజల కోరిక మేరకు కైకరం వద్ద, అప్‌ల్యాండ్ నుండి జి.కొత్తపల్లి మీదుగా నరసాపురం సముద్ర తీరానికి అనుసంధానించే చేబ్రోలు వద్ద, నల్లజెర్ల నుండి జాతీయ రహదారికి లింక్ రోడ్లను కలుపుతూ హార్టికల్చర్ విశ్వవిద్యాలయానికి వెళ్లే మార్గంలో ఉంగుటూరు వద్ద ఒకటి చొప్పున మొత్తం నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, తాజాగా అనుమతి లభించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని అడిగిన వెంటనే తక్షణం స్పందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఆరేడు నెలల్లో ఆర్ఓబిల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం మంజూరైన నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వంపై ఒక రూపాయి భారం పడదని, తద్వారా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావడానికి అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. వీటిని నిర్మాణం పూర్తయితే రైల్వే ట్రాక్ ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నుంచి వాహనదారులకు, ప్రజలకు వెసులుబాటు లభిస్తుందని ఎంపీ వెల్లడించారు. రానున్న నాలుగేళ్లలో మరిన్ని ఆర్ఓబీల నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు.

# నేడు బిపి (రక్తపోటు) ఒక అవగాహన ప్రపంచ రక్తపోటు దినం



ఖమ్మం,**(నేటి శుభోదయ):** ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం మంది యువకులు బిపితో బాధ పడుతున్నారు.60 ఏళ్ళకు పైబడిన వారిలో 50 శాతం మందికి బిపి వుంది. 30 శాతం మందికి వారికి బిపి ఉందని తెలియదు. 40 శాతం బిపికి మందులు వాడటం లేదు.70 శాతం మందికి బిపి నియంత్రణలో ఉండటం లేదు. షుగర్ పేషెంట్లలో ఇద్దరిలో ఒకరికి బిపి వుంటుంది. ఇది బిపి గురించిన సంఖ్యా చరిత్ర బిపి నియంత్రణలో లేకపోతే తీవ్ర అనారోగ్య సమస్యలు కలుగుతాయి. గుండె జబ్బులు, పక్షవాతం కంటిచూపు (రెటినా) దెబ్బ తినడం, కిడ్నీ జబ్బులు, రక్తనాళ గమస్యలు. అందుకే బిపిని "సైలెంట్ కిల్లర్" అంటారు. బిపిని నియంత్రించుకోవాలంటే ఏం చేయాలి? ఉప్పుని చాలా తక్కువగా వాడాలి.(రోజుకి 2.5 గ్రాముకంటే తక్కువగా). ఉప్పుకి బదులుగా నిమ్మరసం, వెనిగర్ లాంటివి వాడుకోవాలి. "ఉప్పుని కంట్రోల్ చేసుకోవటమంటే బిపి కంట్రోల్ చేసుకోవడమే. బరువుని పెరగకుండా నియంత్రించుకోవాలి. శారీరక శ్రమ- ప్రతిరోజు 30-45 నిమిషాల వ్యాయామం లేదా నడక అలవాటు చేసుకోవాలి.పోగత్రాగడం పూర్తిగా మానేయాలి. అల్కహాల్ మందు ని వైద్య సలహ మేరకు నియంత్రించుకోవాలి. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి ధ్యానం యోగా వంటివి అభ్యసించాలి. ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి తాజా పళ్ళు త్రణధాన్యాలు కాయ కూరలు ఎక్కువగా మరియు నూనె పదార్థాలు, పాల ఉత్పత్తులు మాంసం తక్కువగా తీసుకోవాలి. బిపి మాత్రమే కాకుండా షుగర్ ని కొలెస్ట్రాల్ ని వాటికి సంబంధించిన పరీక్షలని వైద్య సలహామేరకు నిర్ణిత వ్యవధిలో చేయించుకుంటూ మందులు వాడాలి. ఒక భిందువు అంత నియంత్రణ సింధువంత నివారణతో సమానం" మన ఆరోగ్య సంఖ్యా శాస్త్రాన్ని ఎప్పటికపుడు తెలుసుకుంటా ఉండాలి. నడుము చుట్టుకొలత 95 సెంటి మీల కంటే తక్కువగా కొలెస్టరాలు ఎల్ డిఎల్ -100 కంటే టిజి -150 కంటే తక్కుంగా డయస్టాలిక్ బిపి 100 కంటే తక్కువగా షుగర్ 100 కంటే తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి. 2012, మే17 (రక్తపోటు దినం) సందర్భంగా ఈ సంవత్సరం ప్రపంచ రక్తపోటు సంస్థ ఇచ్చిన నినాదం. ఆరోగ్య వంతమైన జీవన విధానమే ఆరోగ్యం ఆరోగ్యవంతమైన మానసిక శారీరక దైవంచిన జీవన విధానాన్ని మనం అలవాటు చేసుకోవాలి అని డా. ఎ.వి గిరిసింహారావు జోనల్ మెడికల్ ఆఫీసర్. టిజి ఎస్ ఆర్ టి సి కరీంనగర్, షుగర్ వ్యాధి నిపుణులు వివరించారు.

# హస్తకళల ఆకృతులు ఉట్టిపడేలా లేపాక్షి ఆధునీకరణ

## చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా ఆత్యాధునిక షోరూమ్ ల రూపకల్పనకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ తో ఒప్పందం డిల్లీ, రాజమండ్రిలలో ఆధునీకరించనున్న షోరూమ్ ల డిజైన్లపై సంతృప్తి

విజయవాడ, మే 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): హస్తకళల ఆకృతులు ఉట్టిపడేలా లేపాక్షి విక్రయ కేంద్రాలను ఆధునీకరించనున్నట్టు చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్





పి సిసోడియా తెలిపారు. సాంప్రదాయకతకు పెద్దపీట వేస్తూనే ఆధునిక షోరూమ్ లకు రూపకల్పన చేస్తున్నామని. ఈ క్రమంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ తో ఒప్పందం చేసుకున్నామని వివరించారు. శుక్రవారం విజయవాడ లేపాక్షి కేంద్ర కార్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ప్రతినిధులతో కలిసి వివిధ షోరూమ్ ల నూతన డిజైన్లను పరిశీలించారు. ప్రత్యేకించి దేశ రాజధాని డిల్లీలో ఏర్పాటు చేస్తున్న నూతన షోరూమ్ డిజైన్లను పరిశీలించి పలు సూచనలు చేసారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, హస్తకళలు, చేనేత సౌరభాలు, తెలుగు దనం ఉట్టి పడేలా షోరూమ్ రూపుదిద్దుకోవాలన్నారు. మరోవైపు రాజమండ్రి ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేయనున్న షోరూమ్ డిజైన్లను కూడా సిసోడియా పరిశీలించారు. తిరుపతి షోరూమ్ నిర్మాణంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు.

### ప్రతి షోరూమ్ లాభాల బాటలో పయనించాలి

సంస్థ పరంగా చూసినప్పుడు లేపాక్షి సంక్ధ లాభాలలో





ఉన్నప్పటికీ, ప్రదర్శన శాలల వారిగా పరిశీలిస్తే కొన్ని చోట్ల నష్టాలు ఉన్నాయని సిసోడియా గుర్తించారు. ఈ నేపధ్యంలో ప్రత్యేకించి షోరూమ్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. షోరూమ్ ల వారిగా లాభ నష్టాలను పరిశీలించిన సిసోడియా, నష్టాలలో ఉన్న షోరూమ్ ల పనితీరును లోతుగా పరిశీలించి సూచనలు చేసారు. ఉత్పత్తుల పరంగా మార్పు లేనప్పుడు అమ్మకాల పరంగా ఎందుకు వెనకడుగు పడుతుందని ప్రశ్నించారు. షోరూమ్ ల ఆధునీకరణ, సీజన్ లవారి విక్రయాలు, ఇతర సమస్యలను సిసోడియా దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని అన్ని షోరూమ్ లు తప్పని సరిగా లాభాల బాటలో పయనించవలసిందేనని హెచ్చరించారు. తాను వ్యక్తిగతంగా రాష్ట్రంలోని అన్ని షోరూమ్ లను సందర్శిస్తానన్నారు.

### షోరూమ్ ను సందర్శించి కళాకృతుల పరిశీలన

తొలుత సిసోడియా లేపాక్షి కేంద్ర కార్యాలయం ఆవరణలో ఉన్న ప్రధాన ప్రదర్శన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి విభిన్న కళాకృతులను పరిశీలించారు. సంస్థ



ఎండి విశ్వ అయా కళాకృతులు దేశంలోని ఏ ప్రాంతంలో రూపుదిద్దుకున్నాయి, వాటిని రూపొందించిన కళాకారులు ఏవరు వంటి విషయాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న హస్త కళాకృతులు అన్నింటినీ లేపాక్షి షోరూమ్ లలో అందుబాటులో ఉంచాలన్నారు. మార్కెటింగ్ కు అందమైన ప్యాకింగ్ అవసరమని ఆ విషయంలో రాజీ పడవద్దని సూచించారు. సమావేశంలో రాష్ట్ర స్థాయిలోని లేపాక్షి విక్రయ శాలల మేనేజర్లు, కేంద్ర కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

# ఐఫోన్ కొన్న వైఎస్ జగన్

## సిగ్నల్ యాప్, ఫేస్ టైం యాప్ ల ద్వారా చాటింగ్, కాలింగ్ లిక్కర్ స్కాం విచారణ వ్యవహారాలపై కోసమే ఫోన్ నిందితుల విచారణ సందర్భంలో వెలుగు చూసిన ఆసక్తికర అంశాలు

అమరావతి,**(నేటి శుభోదయ):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు సంబంధించి ఆసక్తికర సమాచారం బయటకు వచ్చింది. 5 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గాని, ఎన్నికల్లో ఓటమి తరువాత గాని జగన్ మొబైల్ ఫోన్ వాడలేదు. తాను ఫోన్ వాడనని తనకు ఫోనే లేదని నెంబరు అసలే లేదని గతంలో చెప్పిన మాజీ సిఎం. నేడు సడన్ గా స్మార్ట్ ఫోన్ వాడకం మొదలుపెట్టారు. సాధారణంగా ఫోన్లకు, యాప్ లకు, గాడ్జెట్లకు దూరంగా ఉండే జగన్ తాజా పరిణామాల నేపథ్యంలో ఫోన్ కొన్నట్లు తెలుస్తోంది.

### లిక్కర్ కేసుతో

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై సిట్ దర్యాప్తు చేస్తోంది. రూ.3200 కోట్ల విలువైన ఈ స్కాంలో విచారణ కీలక దశకు చేరుకుంది. కింగ్ పిన్ లు అరెస్టు అవుతున్నారు. నాడు సిఎంవో లో పనిచేసిన ఉన్నత స్థాయి వ్యక్తులు కూడా అరెస్టు అయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. ఈ పరిణామాలు వైసీపీలో కొంత అలజడి సృష్టిస్తున్నాయి. ఈ అరెస్టులు ఎక్కడి వరకు వెళతాయి అనే విషయంలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. విచారణలో నిందితులు ఏం చెపుతున్నారు అనే అంశాలకు మీడియా, రాజకీయ వర్గాల్లో అత్యంత ప్రధాన్యం లభిస్తోంది. ఈ క్రమంలో మాజీ సిఎం జగన్ ఐఫోన్ కొనుగోలు చేసి సొంతంగా వాడకం మొదలు పెట్టారు. కేసు విషయంలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు చర్చించుకునేందుకు అప్ డేట్స్ తెలుసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయాలు చేసేందుకు జగన్ ఫోన్ వాడకం మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

### సిగ్నల్ యాప్ ఫేస్ టైం కాల్

ఐఫోన్ అంటేనే భద్రత అని అంతా చెపుతారు. అయితే మాజీ సిఎం ఈ ఫోన్ లో సిగ్నల్ యాప్ ను వాడుతున్నట్లు తెలిసింది. ఈ సిగ్నల్ యాప్ కు సమాజం లో అంత ప్రాచుర్యం లేదు. ఈ యాప్ ద్వారా జరిపే చాట్ నిర్థిష్ట సమయంలో డిలీట్ అవుతుంది. పూర్తిగా చెరిగిపోతుంది. ఈ యాప్ లో జరిపే చర్చ ఎంత సమయంలో చెరిగిపోవాలి అనేది కూడా యూజర్ నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ మెసేజ్ లు ట్రాక్ చేయడం అసాధ్యం. ఇది ఎక్కడా క్లౌడ్ లో కూడా సేవ్ అవ్వదు. దీంతో రక్షణ పరంగా ఇది మంచి యాప్ గా చెపుతారు. అందుకే జగన్ దీన్ని సహచరులు, కేసులో నిందితులు, వ్యక్తిగత సిబ్బంది, లాయర్లతో సంప్రదింపులకు వాడుతున్నట్లు భయటపడింది. మరోవైపు అవసరం అనుకుంటే ఫేస్ టైం యాప్ ద్వారా పరిమితంగా కాల్స్ లో మాట్లాడుతున్నట్లు కూడా విచారణ అధికారులు గుర్తించారు. ఈ కేసులో విచారణ సందర్భంగా జగన్ ఫోన్ వాడుతున్న విషయం, సిగ్నల్ యాప్, ఫేస్ టైం ద్వారా కమ్యునికేషన్ నడుపుతున్న విషయం బయటకు వచ్చింది. విచారణ అప్ డేట్స్ తెలుసుకుని అందుకు అనుగుణంగా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారనేది సమాచారం. అయితే కొసమెరుపు ఏంటంటే జగన్ వాడుతున్న ఫోన్ లో సిమ్ కార్డు జగన్ పేరుతో లేదని తమకు అత్యంత నమ్మకమైన వ్యక్తి ద్వారా తీసుకున్న సిమ్ కార్డును వాడుతున్నారని తెలిసింది. ఏది ఏమైనా లిక్కర్ కేస్ జగన్ ను కొత్త ఫోన్ కొని వాడేలా చేసింది.

## గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలి

### ఎం. పి. పి. గోగం సురేష్



గుడివాడ, మే 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా మండలంలోని సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పెదపారుపూడి ఎంపిపి గోగం సురేష్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం లో ఆయన పంచాతీరాజ్, నీటిపారుదల శాఖ, ఎన్. ఎ. ఈ. గి. ఎస్. సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోపర్రు లో ఫిల్టర్ బెడ్స్ కోసం మండల పరిషత్ నిధుల నుండి మంజూరైన పనిని వెంటనే చేపట్టి పూర్తి చెయ్యాలని అన్నారు. త్రాగునీటి సంబంధమైన ఇబ్బంది ఏర్పడితే వెంటనే ఎంపిడిఓ దృష్టి కి తేవాలన్నారు. అలాగే గ్రామ స్థాయిలో ఉద్యోగులు ప్రజాప్రతినిధులు సమన్వయము తో గ్రామ సమస్యలపై పనిచేయాలని అన్నారు. ఎంపిడిఓ సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన మంజూరు లపై అవగాహన కల్పించాలని అన్నారు. డిప్యూటీ ఎంపిడిఓ వంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం బీట్ ది హీట్ పేరుతో నిర్వహించి పెద్దఎత్తున ప్రజల్లో అవగాహన తేవాలన్నారు. ఈ కార్యక్రమం లో నీటిపారుదల శాఖ, ఎ. ఈ. షెహనాజ్, ఎ. ఈ. హౌసింగ్ ఫణి కుమార్, య్. పి. ఓ.సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## ఎర్ర నరోత్తం రెడ్డి జన్మదిన వేడుకలు



తలకొండపల్లి **(నేటి శుభోదయ):** తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామ బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పార్టీ కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి చీపునంతల గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి ఇప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉండే వ్యక్తిబీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్ర నరోత్తం రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలిపిన బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సి ఎల్.శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ వెంకటయ్య,పర్వతాలు యాదవ్,రాజేశ్వర్ రెడ్డి,గుమ్మడి రాజు,గోస్కె గిరి,చినుకుంట్ల రాజు,చెట్ల కాంతు,రామకృష్ణ,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు..

## రాష్ట్ర జై కాపు సేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ



మచిలీపట్నం, మే 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఆంధ్రప్రదేశ్ జై కాపు సేన రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడుగా లంకిశెట్టి బాలాజీ శుక్రవారం మంగళగిరిలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బసవ చినబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు నియామక ఉత్తర్వులను లంకిశెట్టి కి అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ కు తక్షణమే డైరెక్టర్లను నియమించాలని, పెండింగ్లో ఉన్న 2,000 కోట్ల రూపాయలను విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ ను కోరారు. కాపులకి ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తామన్న రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు హామీలను తక్షణమే అమలు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.కాపు పేదలను చదువుకోవడానికి విద్యా దీవెన అందజేయాలని ప్రతిభ కలిగిన విద్యార్థులకు విదేశీ విద్యకు రుణాలు ఏర్పాటు చేయాలని బాలాజీ కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మరియు నామినేషన్ పదవులలో కాపులకు జనాభా ప్రాతిపదికపై సీట్లు కేటాయించాలని బాలాజీ కోరారు.రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన కమిటీలు జిల్లాల వారీగా మీటింగ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా కాపుల ఐక్యతను మరింత పెంచే దిశగా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చిన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాపులు పునాదిరాళ్లు అని అన్నారు. అన్ని పదవులలో కాపులకు సమచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాలు చెందిన అధ్యక్షులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం లంకిశెట్టిని పలు జిల్లా కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

## 18న ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం



శ్రీహరికోట, మే 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఈ ఏడాది జనవరిలో 100 రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకున్న ఇస్రో తర్వాతి రాకెట్ లాంచ్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 18 (ఆదివారం)న శ్రీహరికోటలోని షార్ నుంచి పీఎస్ఎల్వీ-సి61ను ప్రయోగించనుండగా ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం కానుంది. దీని ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం (ఈఓఎస్) రిశాట్-18ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ఈ మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. నిరంతరాయంగా 22 గంటలపాటు కొనసాగిన తర్వాత ఆదివారం ఉదయం 5:59 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఇస్రో అధిపతి నారాయణన్ గురువారం షార్‌కు చేరుకున్నారు. అంతకుముందు ఆయన చెన్నైలో మాట్లాడుతూ దేశ భద్రత, ప్రజల అవసరాలే ప్రధాన లక్ష్యంగా ఇస్రో ప్రయోగాలు చేపడుతుందని, ఇతర దేశాలతో పోటీ పడదని పేర్కొన్నారు.

## మే 20న దేశవ్యాప్తంగా రవాణా రంగం బంద్ కు పిలుపు



విజయవాడ, మే 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): రవాణా రంగం పై కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్తంగా బంద్ కు ట్రాన్స్ పోర్ట్ యూనియన్లు పిలుపునిచ్చాయి. మోటారు వాహన చట్టంలో చేసిన మార్పులతో స్వయం ఉపాధి అవకాశాలు నశిస్తున్నాయని, రవాణా రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లోకి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో బంద్ ను సమర్థవంతంగా నిర్వహించి,రవాణా కార్మికుల హక్కులను రక్షించాల్సిన అవసరముందని ప్రజలను కోరాయి.

## పాఠశాలలు తెరిచేలోపు యూనిఫామ్ అందించాలి..

### కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఏపిఎం భగవంతు.





కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి యూనిఫామ్స్ అందించాలని మండల డిఆర్డిఏ ఏపీఎం భగవంతు అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట క్లస్టర్ లో మహిళా శక్తి కుట్టు శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు సంబందించిన దుస్తులను సందర్శించారు.ఇందులో భాగంగా యూనిఫామ్స్ తయారీని పరిశీలించారు.ఏపిఎం వెంట డి ఆర్ డి ఎ డి పి ఎం. నరసింహ, సీసీలు, వివో ఏలు ఉన్నారు...

# లోక్ సభ లో మచిలీపట్నం ఎం. పి.బాలశౌరి



మచిలీపట్నం, మే 16 (అజయ్ నారగాని - నేటి శుభోదయ): లోక్ సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ గా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మరోసారి ఎన్నికయ్యారు.ఈ కమిటీకి చైర్మన్‌గా ఎన్నికవడం ఆయనకు ఇది వరుసగా నాలుగోసారి. గత ప్రభుత్వంలోనూ నాలుగు సంవత్సరాల పాటు ఈ కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు ఎంపీ బాలశౌరి. చైర్మన్‌తో పాటు 15 మంది సభ్యులు ఉండే ఈ కమిటీలో కార్తిక్ చిదంబరం, మాజీ మంత్రి ఏ.రాజా, బెంగాల్ నుండి మొహిత్రి మొవ్వా, ఎన్‌కే ప్రేమచంద్, తెలంగాణ నుండి బీజేపీ తరపున రఘునందన రావు వంటి ప్రముఖులు ఉన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో లోక్‌సభ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న బాలశౌరి గతంలో లోక్‌సభ సబార్డినేట్ లెజిస్టేషన్ కమిటీ చైర్మన్‌గా తక్కువ సమయంలో ఎక్కువ సమావేశాలు నిర్వహించి రికార్డు నెలకొల్పారు.వల్లభనేని బాలశౌరి వైఎస్ శిష్యుడిగా కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి.. 2004లో తెనాలి లోక్‌సభ నియోజకవర్గం నుండి తొలిసారి ఎంపీ అయ్యారు. జగన్ మోహన్‌రెడ్డి తన అహంకారపూరిత ధోరణితో బాలశౌరి వంటి సమర్థుడైన నేతను వదులుకున్నారని చెప్పాలి. జగన్ వైఖరి, అభివృద్ధి నిరోధక మనస్తత్వం నచ్చక పవన్ కళ్యాణ్ వెంట నడవాలని నిర్ణయించుకున్నారు. బాలశౌరి. 2024 ఎన్నికలకు చాలా ముందే జనసేనలో చేరి జనసేన అధినేత ఆశీస్సులతో మచిలీపట్నం లోక్‌సభ నియోజకర్గంలో పోటీ చేసి.. 2 లక్షల 23 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యాడు. జనసేనలో క్రియాశీలకంగా పనిచేసిన బాలశౌరి ఉమ్మడి కృష్ణా జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేశారు. నిత్యం పవన్ వెన్నంటి నడుస్తున్న బాలశౌరి పార్లమెంటరీ వ్యవహారాలపై మంచి పట్టు ఉన్న నేతగా గుర్తింపు సంపాదించుకున్నారు. ఎంపీ ల్యాడ్స్‌తో పాటు తన నియోజకవర్గానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడంలో బాలశౌరిది అందె వేసిన చెయ్యిగా చెప్పాలి. తొలిసారి ఎంపీ అయిన దగ్గరి నుంచే ఢిల్లీ నుంచి తన నియోజకవర్గంలోని గల్లీ వరకు ప్రతీ సందర్భంలోనూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు.తెనాలి ఎంపీగా ఉన్న సమయంలో దివిసీమ పరిధిలోని దాదాపు 18 వేల ఎకరాలు చెరువులుగా ఉంటే.. సొంత నిధులు వెచ్చించి.. ఆయా చెరువులను పూడ్పించి.. వాటిని చదును చేయించి.. సాగు భూములుగా మార్చిన నాయకుడిగా ఎంపీ బాలశౌరి చిరస్థాయిగా నిలిచిపోయారు. తెనాలిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొన్ని కోట్ల రూపాయలు కేటాయించి ప్రతి ఇంటికీ తాగునీటిని అందజేశారు. రేపల్లె నుంచి హైదరాబాద్ కాచిగూడ వరకు డెల్టా ఫాస్ట్ ప్యాసింజర్ రైలును తీసుకొచ్చిన ఘనత ఎంపీ బాలశౌరిదే. కృష్ణాడెల్టా జీవధారగా పిలుచుకునే పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో ఎంపీ బాలశౌరి చాలా చురుగ్గా పాల్గొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఆపివేయాలని ఎంపీ బాలశౌరికి నక్సలైట్ల బెదిరింపులు వచ్చాయి. అయినా కూడా వాటిని లెక్కచేయకుండా ప్రాజెక్టును పూర్తి చేయించారు. ఇక ప్రాజెక్టు శంకుస్థాపన రోజు ప్రస్తుత పల్నాడు జిల్లా మోర్జంపాడు అనే గ్రామంలో ఉన్న ఎంపీ బాలశౌరి ఇంటిని నక్సలైట్లు డైనమైట్లు పెట్టి పేల్చివేసి ఇంటిని నేలమట్టం చేశారు. ఈ సంఘటన నాడు సంచలనంగా నిలిచింది. మచిలీపట్నం ఎంపీగా పోర్టు తీసుకురావటంలో ఆయన సక్సెస్ అయ్యారు. కేంద్రంలో రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలతో ఉన్న మంచి సంబంధాలతో సీఎస్ఆర్ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగారు. ఏ అంశం పైన అయినా స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తారాయన. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే మంగళగిరి ఎయిమ్స్ పాలకమండలి సభ్యుడిగా నియమితుడయ్యారు బాలశౌరి. తాజాగా బాలశౌరి నేతృత్వంలోని లోక్ సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ కాల పరిమితి ముగియగా%ॆ% ఆ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. 15 మంది సభ్యులున్న ఈ కమిటీకి తిరిగి బాలశౌరినే చైర్మన్‌గా నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. లోక్ సభలో ఆయా కార్యకలాపాలు, సభ్యులకున్న అధికారాలు, బాధ్యతలు సరిగ్గా అమలయ్యేలా చర్యలు చేపట్టడం, సభ విధివిధానాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.1953లో ఏర్పాటైన ఈ కమిటీ ప్రభుత్వం జారీ చేసే రూల్స్, సబ్‌రూల్స్, బై లాస్, రెగ్యులేషన్స్, బిల్లులను పరిశీలించి%ॆ% అవి రాజ్యాంగ పరిధిలోనే ఉన్నాయా లేదా అనే అంశంపై సభకు నివేదిక సమర్పిస్తుంది. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఉత్తర్వును పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ రద్దు చేయాలనిపించినా, సవరించాలని భావించినా ఈ కమిటీ అందుకు కారణాలను వివరిస్తూ సభకు నివేదిక సమర్పిస్తుంది. ఇంతటి గురుతర బాధ్యతలు ఉన్న ఈ కమిటీకి చైర్మన్‌గా తనను మరోసారి నియమించిన ఓం బిర్లాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో తనకు ఈ అవకాశం దక్కేలా చూసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ఎంపీ బాలశౌరి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం (17 మే)

### అధికరక్తపోటు అన్నిఅవయవాలకు చేటు
### ముందుగా గుర్తింపు, చికిత్సతో ప్రమాద నివారణ
### డాక్టర్ మురళి క్రిష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్



సాధనాల వీరేంద్ర **(నేటి శుభోదయ):** హైదరాబాద్, మే 16, 2025: ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం సందర్భంగా, సైలెంట్ కిల్లర్ గా పిలువబడే అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) పై ప్రపంచం దృష్టి సారిస్తున్న వేళ, "మీ రక్తపోటు తెలుసుకోండి - అదుపులో ఉంచండి" అంటూ కేర్ హాస్పిటల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 1.28 బిలియన్ల మందికి పైగా రక్తపోటుతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది నివారించదగిన సమస్య అయినా, హృదయ సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, మూత్రపిండాల వైఫల్యం, అకాల మరణాలకు ప్రధాన కారణంగా మారుతోంది. మన దేశంలోనే దాదాపు 22 కోట్ల మందికి పైగా హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నారు. ప్రతి ముగ్గురు పెద్దవారిలో ఒకరికి ఇది ఉన్నా, కేవలం 12% మందికే అది పూర్తిగా నియంత్రణలో ఉంది. దాదాపు 50% మందికి తమకు ఈ సమస్య ఉన్నదని తెలియదు కూడా. ఇది నిరంతర పరీక్షలు మరియు జీవనశైలిలో మార్పులు అవసరమని స్పష్టంగా సూచిస్తుంది. డాక్టర్ మురళి క్రిష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ మాట్లాడుతూ, "హైపర్‌టెన్షన్ మొదటి దశలో ఎలాంటి లక్షణాలు ఉండవు. అందుకే దీనిని మౌన హంతకుడు అంటారు. కానీ ఇది నియంత్రించకుండా వదిలితే శరీర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు, చూపు కోల్పోవడం, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. అయితే సరైన అవగాహనతో మరియు సమయానికి తగిన వైద్యం తీసుకుంటే ప్రాణాలను రక్షించవచ్చు" అని తెలిపారు.

### హైపర్‌టెన్షన్ అంటే ఏమిటి?

రక్తనాళాల్లో రక్తం వేగంగా ప్రవహించి, అధిక ఒత్తిడి పెరగడం వల్ల వచ్చే సమస్యే హై బీపీ. సాధారణంగా 140/90mmHg లేదా అంతకంటే ఎక్కువ బీపీ ఉన్నట్లయితే అది హైపర్‌టెన్షన్‌గా పరిగణిస్తారు.

140/90 mmHg తేలికపాటి హైపర్‌టెన్షన్

రీడింగ్ 140/90 నుండి 159/99 mmHg మధ్య ఉంటే స్టేజ్ 1 హైపర్‌టెన్షన్

రీడింగ్ 160/100mmHg కంటే ఎక్కువైతే స్టేజ్ 2 హైపర్‌టెన్షన్

180/110 mmHg కంటే ఎక్కువైతే, హైపర్‌టెన్సివ్ ఎర్జెన్సీ అంటారు - ఇది అత్యవసరంగా చికిత్స అవసరం చేసే స్థితి.

### హైపర్‌టెన్షన్‌ను రెండు రకాలుగా వర్గీకరిస్తారు

ప్రైమరీ హైపర్‌టెన్షన్: ఇది వయస్సు పెరగడం, జీవనశైలి అలవాట్లు (అనారోగ్యకరమైన ఆహారం, వ్యాయామం లోపం, ఒత్తిడి) వలన క్రమంగా అభివృద్ధి చెందుతుంది. సెకండరీ హైపర్‌టెన్షన్: ఇది మూత్రపిండాల వ్యాధులు, హార్మోన్ వ్యత్యాసాలు, కొన్ని మందుల వాడకం లేదా స్లీప్ అప్నియా వంటి ఆరోగ్య సమస్యల కారణంగా వస్తుంది. ప్రారంభ దశలో లక్షణాలు లేకపోయినా, తీవ్రమైన లేదా నియంత్రించని రక్తపోటు వల్ల తలనొప్పి, తలనిలువు తిరగడం, మబ్బుగా కనిపించడం, అలసట, ఛాతిలో నొప్పి, గుండె చప్పుళ్ళు అసమానంగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది వంటి సంకేతాలు కనబడవచ్చు. ఇవి గుర్తించి వైద్య సాయం తీసుకోవడం చాలా ముఖ్యం. "ఔషధాలతో పాటు గుండెకు మేలైన జీవనశైలిని అనుసరించటం కూడా ఎంతో అవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్యం 30 నిమిషాలు వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే ధ్యానం లేదా యోగా వంటివి రక్తపోటును నియంత్రించడంలో కీలకపాత్ర వహిస్తాయి," డాక్టర్ మురళి క్రిష్ణ అన్నారు.

### హైపర్‌టెన్షన్ నివారణకు సూచనలు::

రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి ధూమపానం, మద్యం వాడకాన్ని నివారించాలి ఆరోగ్యకరమైన బరువును నిలుపుకోవాలి ఆహారంలో పండ్లు, కూరగాయలు, పౌష్టిక ధాన్యాలు చేర్చాలి ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక చర్యలు చేయాలి మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం, యోగా వంటివి చేయాలి రెగ్యులర్ బీపీ చెకప్ చేయించుకోవాలి ప్రసిద్ధుల మృతితో హెచ్చరికగా మారిన హైపర్‌టెన్షన్ ఇటీవల భారతదేశంలో అనేక మంది ప్రముఖులు హఠాత్తుగా గుండెపోటుతో మరణించడంలో హైపర్‌టెన్షన్ కీలక పాత్ర పోషించిందని గుర్తించబడింది. సాధారణంగా ఆరోగ్యంగా కనిపించే వారు కూడా రక్తపోటు నియంత్రణలో లేకపోవడం వలన మరణించడం ద్వారా, యువత మరియు మధ్య వయస్సు వారిలో హృదయ సంబంధ సమస్యలు పెరుగుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం సందర్భంగా, 30 ఏళ్లకు పైబడి ఉన్న ప్రతి ఒక్కరూ తమ బీపీని పరీక్షించించుకోవాలని కేర్ హాస్పిటల్స్ కోరుతోంది. ముందస్తు గుర్తింపు ప్రాణాలను రక్షించగలదు. నిపుణుల పర్యవేక్షణతో హైపర్‌టెన్షన్‌ను సమర్థవంతంగా నియంత్రించవచ్చు, ఆరోగ్యంగా, దీర్ఘకాలం జీవించవచ్చు.

## పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అడిగితే లేవంటూ చేతులెత్తేస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధి

- ఇసుక కొల్లగొట్టి లక్షలు సంపాదిస్తున్న అదే పార్టీకి చెందిన యువ నేతలు
- రాక రాక అధికారం వచ్చింది, అందినంత దోచుకుందాం అనే విధంగా తయారయింది అధికారపార్టీ కి చెందిన కొందరు నేతల తీరు
- అర్థరాత్రి అక్రమ ఇసుక, గ్రావెల్ తోలకాలే లక్ష్యంగా కొనసాగుతున్న అధికార పార్టీ నేతల పని
- అధికార పార్టీ తీరుపై సర్వత్రా విమర్శల వర్షం
- అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా రెడ్డిపాలెం గోమ్మూరు ర్యాంపులు
- రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉందంటూ సీఎం ప్రసంగాలు
- అర్థరాత్రి అక్రమ ఇసుక తోలకాలు జరిపి లక్షల కొద్ది రాష్ట్ర బడ్జెట్ కు చెందాల్సిన డబ్బులు దోచుకుంటున్న అధికార పార్టీ నేతలు
- నిమ్మకి నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు స్థానిక నేతలు
- అక్రమ ఇసుక రవాణాలో బూర్గంపాడు మండలం కు చెందిన ఓ యువ నేత హవానే ఎక్కువ అంటూ మండల వ్యాప్తంగా విమర్శలు...?
- ప్రశ్నించే విలేకరులను, అధికారులను సైతం బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ సమాచారం
- ప్రతిరోజు రాత్రి 10 దాటిందో సుమారు 6 ట్రాక్టర్లతో సంజీవరెడ్డి పాలెం వెళ్లే దగ్గర ఓ భారీ కన్స్ట్రక్షన్కు అక్రమ ఇసుక తోలకాలు
- ఆ కన్స్ట్రక్షన్ కు సుమారు 1000 ట్రిప్పులు ఇసుక బేరం కుదుర్చుకున్న ఆ యువ నేత

ఖమ్మం, భద్రాచలం,**(నేటి శుభోదయ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గోమ్మూరు ఇసుక ర్యాంపు నుంచి అను నిత్యం పదుల సంఖ్యలో అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. ఈ అక్రమ ఇసుక రవాణాలో ముఖ్యపాత్ర బూర్గంపాడు మండలం కు చెందిన ఓ యువ నేత హవానే అట? ఈ అక్రమ ఇసుక రవాణా అధికారుల కను సన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ప్రతిరోజు 10 దాటిందో సుమారు 6 ట్రాక్టర్లతో సంజీవరెడ్డి పాలెం వెళ్లే దగ్గర ఓ బడా కన్స్ట్రక్షన్ కు ఈ అక్రమ ఇసుక తోలకాలు అనునిత్యం జరుగుతూనే ఉన్నాయి. మమ్మల్ని ఆపేది ఎవరు మా వెనుక బడా నాయకులు ఉన్నారు అని అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ ఒకవేళ అధికారులు పట్టుకున్న వెంటనే వదిలేస్తారని మా నాయకుడు ఫోన్ చేస్తే వెంటనే ఆ ట్రాక్టర్ వదిలి వెళ్లాల్సిందే అంటూ ప్రగల్భాలు పలుకుతున్నట్లు సమాచారం..? ఆ బడా కన్స్ట్రక్షన్ కు సుమారు 1000 ఇసుక ట్రిప్పులు బేరం కుదుర్చుకున్న ఆ యువ నేత. మండల అధికారుల్ని సైతం లెక్కచేయకుండా అక్రమ ఇసుక రవాణా కొనసాగిస్తున్నాడని పలువురు బహుఘాటంగానే చెప్పుకుంటున్నారు. ఓ పక్క తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమాలను కట్టడి చేయమని చెప్పి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మండల అధికారులు పెడచెవిన పెడుతూ అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తున్నారని అందుకే అనునిత్యం అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని పలువురు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులైనా చొరవ తీసుకొని ఈ అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్న బూర్గంపాడు మండలం స్థానిక ప్రజలు. ఈ అక్రమ ఇసుక తరలింపు లో నియోజకవర్గ శాసనసభ్యులకు చెందిన అనుచరులుగా చెలామణి అవుతున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తుంది. ఇందులో అందరికీ వాటాలు ఇస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీ దుర్గా భవాని మాత జాతర ఉత్సవాలకు విరాళాన్ని అందించిన వేల్పుగొండ రవికుమార్



మెదక్ జిల్లా: మే 16**(నేటి శుభోదయ):** శ్రీనాథ్ చారి...రేగోడ్ మండల కేంద్రంలోనీ సిందోళ్ గ్రామం లో శ్రీ దుర్గాభవాని మాతా జాతర ఉత్సవాల్లో భాగంగా సిందోల్ గ్రామానికి చెందిన యెల్పుగొండ రవికుమార్ 11000/- రూపాయలు విరాళంగా అందించడం జరిగింది. గ్రామంలో జరిగే జాతర భాగంగా శుక్రవారం బోనాలు కార్యక్రమం ఆదివారం దుర్గాభవాని జాతర ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో పాపిరెడ్డి , ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, నారాయణ,రాములు, పి రమేష్, జి రాజు, యు సంతు, జైపాల్, సిహెచ్ యాదయ్య, పవన్. ప్రశాంత జైరామ్ లు తదితరులు ఉన్నారు..

## అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వసుధ చేయూత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం, మే 16, (నేటి శుభోదయ): అనారోగ్యంతో బాధపడుతున్న భద్రాచలం కు చెందిన ఇరువురు మహిళలకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూతను అందించింది. అలవాల విజయ, ఎస్ మమత లకు వసుధ ఫౌండేషన్ రూ పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇరువురు తమకు ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించగా సానుకూలంగా స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. ఈ క్రమంలో విజయ, మమతలకు దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేదలకు విద్యా వైద్య అవసరాల కోసం వసుధ ఫౌండేషన్ అందిస్తున్న చేయూత ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో సైతం వసుధ సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# 28 సంవత్సరాల తరువాత ఒకే వేదిక పై కలుసుకున్న విద్యార్థులు

జ్ఞాపకాలను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





శాయంపేట,(నేటి శుభోదయ): హనుమకొండ జిల్లా శాయంపేట శాయంపేట మండలం కొప్పుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 -1997 పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మకూర్ మండలం లోని గుడెప్పాడ్ ఎన్ ఎస్ ఆర్ హెూటల్ లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని తమ గురువు అయిన రాజమల్లయ్య సార్ తో జ్యోతి ప్రజ్వల చేసి ఘనంగా నిర్వహించారు. 28సంవచ్చరాల తర్వాత తమ స్నేహితులు,చదువు చెప్పిన గురువులను





చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. స్నేహానికన్న మిన్న లోకాన లేదురా, కడదాక నీడలాగా నిను వీడిపోదురా, స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అంటూ పాడుతూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఒరేయ్ మామ ,ఏ రా బావా,అంటూ విచిత్రంగా పలకరిస్తూ సందడి చేస్తూ విద్యార్థినీ,విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులు మల్లారెడ్డి, శ్రీనివాసాచారి, ఉమామహేశ్వర్ , రాజ మల్లయ్య, మోహన్ రెడ్డి, సమ్మయ్య, మహిముద్దీన్, గ్రామ మాజీ సర్పంచ్ వంగాల నారాయణ రెడ్డి,అప్పటి విద్యా కమిటీ చైర్మన్ తడుక రాజయ్య, అప్పటి అటెండర్ సాంబయ్య ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ బృందం అంతా కలిసి రానున్న రోజుల్లో కొప్పుల గ్రామం లోని సాంబ శివ దేవాలయం పునర్నిర్మాణం అయ్యాక గుడి ప్రాంగణం లో 100 చెట్లను నాటుటకు విరాళం ఇస్తున్నట్టు అంతా ఏకమై మాజీ సర్పంచ్ వంగాల నారాయణరెడ్డికి తీర్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో చివరిగా విద్యార్థిని విద్యార్థులు తారతమ్యం లేకుండా ఆనాటి భావాలను గుర్తు చేసుకుంటూ డీజే స్టెప్పులతో కోలాటాలతో డ్యాన్స్ లు ,చిందులు వేస్తూ ఆనందంతో గంతులు వేశారు. ఈ కార్యక్రమంలో 97 -98 పూర్వ విద్యార్థిని విద్యార్థులు తమ గురువులు కలిసి కన్నులపండుగగా మరపురాని విధంగా వేడుక జరుపుకున్నారు.



# కిశోర వికాసం -వేసవి కార్యక్రమాలు



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి /పామూరు): కిశోర వికాసం వేసవి కార్యక్రమాలలో భాగంగా పామూరు పట్టణంలోని డివి పాలెం అంగన్వాడీ కేంద్రంలో 4 నుండి 18 సంవత్సరాల కిశోర బాలికలకు కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మరియు బాల్యవివాహాల పై, వ్యక్తిగత పరిశుభ్రత పై, నైతిక విలువలపై సెక్టార్ సూపర్వైజర్ గోళ్ళ పద్మజ అవగాహన కల్పించారు. ముఖ్యంగా శక్తి యాప్ పై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరగాళ్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు మాట్లాడుతూ వేసవి క్యాంపులు వలన ఎన్నో విషయాలపై అవగాహన కలిగిందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో చదివే బాలికలకన్నా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు పూర్తి అవగాహన కలిగి ఉన్నారని ఆమె అన్నారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పుట్టిన ప్రతి బిడ్డకు ఇరవై ఒక్క రోజులలోపు పేరు పెట్టి పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలని, అలాగే ఆధార్ నమోదు చేయించుకుని అంగన్వాడి కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ కె అనూష, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు కిషోర్ బాలికలు పాల్గొన్నారు



# జననేత ఎమ్మెల్యే యాదయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోత్కుపల్లి మైపాల్

గజమాలతో సత్కరించిన మైపాల్




శంకర్ పల్లి, మే 16(నేటి శుభోదయ): చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం చేవెళ్ల లో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్, షాబాద్, నవాబ్ పేట మండలాలతో పాటు మున్సిపల్ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేవెళ్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యాదయ్య ను గజామాల, శాలువాలతో కేక్ కట్ చేసి ఘనంగా సత్కరించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ లో రైళ్లు ఆపాలని సికింద్రాబాద్ రైల్వే డీజీఎంకు బిజెపి నాయకుల వినతి పత్రం



శంకర్‌పల్లి: మే16 (నేటి శుభోదయ ప్రతినిధి): శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ లో కోవిడ్ తర్వాత నుండి ఎక్స్ ప్రెస్ రైళ్లను ఆపడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు విద్యార్థులు, వ్యాపారస్తులు, చుట్టుపక్క గ్రామాల ప్రయాణికుల సౌకర్యార్థం, నాలుగు ఎక్స్ ప్రెస్, డెమో ట్రైన్ ల స్టాప్ ల కొరకు, స్టేషన్ లోని పలు సమస్యల గురించి చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇచ్చిన రిప్రేంసేంటేటివ్ లేటర్ ను, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే నిలయం కార్యాలయంలోని డిజిఎమ్ కి బిజెపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటి సభ్యులు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎల్ ప్రభాకర్ రేడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాములు గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్న, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్ యాదవ్, మాజీ ఎఎంసి చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిపి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ

: తహశీల్దార్ పున్నంచందర్

భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం

బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్





ఖమ్మం, బోనకల్,(నేటి శుభోదయ): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ ఏ. పున్నం చందర్ అన్నారు. మంగళవారం బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో తహశీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతు సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గోవిందాపురం(ఏ) గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 52 దరఖాస్తులను అధికారులు స్వీకరించి, రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ శర్మ, బోనకల్ మండల ఆర్ఐ మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఆర్మీ అధికారి రామకృష్ణ కు ఘన నివాళులు

ఆర్ పి వి సంస్థ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ





ఖమ్మం, (నేటి శుభోదయ): భారత దేశ రక్షణ కోసం దేశ సరిహద్దులో చూపిన తెగువ, పోరాటం ప్రతి ఆర్మీ జవానుకు ఆయన సేవలు ఆదర్శ ప్రాయమని ఆయన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. విశ్రాంత ఆర్మీ హవాల్దార్ హెడ్ క్లర్క్ గా వ్యవహరిస్తూ.. ఖమ్మంలోని ఆయన నివాసంలో అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా రామకృష్ణ పార్థివదేహానికి సయ్యద్ సాదిక్ అలి పుష్పాంజలి సమర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా సయ్యద్ సాదిక్ అలి మాట్లాడుతూ భారత దేశ రక్షణ కోసం ప్రత్యర్థి దేశాల సైనికులపై యుద్ధ ట్యాంకర్లతో, తుపాకులు చేతబట్టి వీరోచితంగా పోరాటాలు చేసి తుపాకీ తూటాలకు ఎదురొడ్డి భారత దేశం కోసం ప్రత్యర్థులను మట్టుబెట్టిన యుద్ధ వీరుడు, వీర జవాన్, హవాల్దార్ హెడ్ క్లర్క్ రామకృష్ణ అని ఆయన సేవలకు సలాం అంటూ ఆయన సేవలను ప్రశంసించారు. గత 30 యేండ్ల క్రితమే తన భాద్యతల నుంచి విశ్రాంత అధికారిగా వ్యవహరిస్తూ ఇటీవల అనారోగ్యంతో ఖమ్మంలోని తన నివాసంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారని అన్నారు. ఈనెల 14 వ తేదీన రామకృష్ణ సేవలను తమ రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రామకృష్ణ కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించుకోవడం జరిగిందని తెలిపారు.. చైనా, బంగ్లాదేశ్ , పాకిస్తాన్ దేశాలపై జరిగిన యుద్ధంలో యుద్ధవీరుడిగా అనేక అవార్డులు పొందిన భరతమాత ముద్దుబిడ్డ మన ఎలగందుల రామకృష్ణ అని, ఆయన అన్నారు. విశ్రాంత అధికారిగా ఉన్న నేపథ్యంలో సైనిక్ పాఠశాలలో ప్రిన్సిపల్ గా వ్యవహరించి భారత దేశ పౌరులలో దేశభక్తిని పెంపొందింప చేసి ఆర్మీలో చేరే విధంగా రామకృష్ణ ప్రేరణ మాటల్లో చెప్పలేనిదని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఆర్మీ నాయకులు అరుణ్ ఆర్.పి.వి.సంస్థ పాలేరు నియోజవర్గ ముఖ్య బాధ్యులు డాక్టర్ నజీరుద్దీన్, గౌస్, జర్నలిస్ట్ జానిపాషా తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం

అడ్డుకున్న స్థానికులు



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా పట్టణంలోని నెల్లూరు రోడ్డు నందు శ్రీ చైతన్య స్కూల్ వెనుక నిర్మిస్తున్నటువంటి సెల్ టవర్ నిర్మాణ పనులను స్థానిక ప్రజలు అడ్డుకొని నిలుపుదల చేయడం జరిగింది. పామూరు గ్రామపంచాయతీ అధికారులు నోటీస్ ఇచ్చి ఈ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం చేయరాదని ఆదేశాలు ఇచ్చినా కూడా లెక్కచేయకుండా రాత్రికి రాత్రి సెల్ టవర్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు స్థానికులు తెలిపారు. సుమారు 500 మీటర్ల దూరంలో సెల్ టవర్ ఉండాలనే నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణం చేపట్టడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెల్ టవర్ విషయం స్థానిక ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్యకు, ఎమ్మార్వో బివి రమణారావుకు, గ్రామ పంచాయతీ ఈవో, ఇన్చార్జి ఈఓపిఆర్డి జి వి అరవింద రెడ్డి లకు వినతి పత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ప్రజల ఆరోగ్యాలరీత్యా సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని, రాత్రికి రాత్రి నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు



# రాజ్యాంగ పరిరక్షణ వేదిక నేలకొండపల్లి మండల చెరువు మాదారం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మహబూబ్, హఫీజ్,నియామకం..

"నూతన కమిటీకి పలువురి శుభాకాంక్షలు..



ఖమ్మం మే 16.(నేటి శుభోదయ): ముస్లిం మైనార్టీల వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం నిర్మితమైన రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ ఫౌండర్,జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ సమక్షంలో నేలకొండపల్లి మండలం చెరువు మాధారం నూతన కమిటీ నియామకం జరిగింది... శుక్రవారం మస్జిద్ ఆవరణలో ఆర్ పీ వీ సంస్థ నూతన కమిటీ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులుగా మహబూబ్, హఫీజ్,గౌరవ సలహాదారులుగా నజీర్, ఉపాధ్యక్షులుగా హమీద్, సహాయ కార్యదర్శిగా అమీర్ పాషా, కోశాధికారిగా ........ నియమితులయ్యారని తెలిపారు.. ఈసీ సభ్యులుగా ఎస్కే రఫీ, హుస్సేన్, రజియుద్దీన్, నాగుల్ మీరా తదితరులను నియమించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు..శుభాకాంక్షలు తెలిపిన వారిలో ముస్లిం మైనార్టీ నాయకులు, పాలేరు నియోజక వర్గ బాధ్యులు డాక్టర్ నజీరుద్దిన్, నేలకొండపల్లి మండల అధ్యక్షులు షేక్ సుభాని, పూర్వ సదర్ లు తదితరులున్నారు..

# సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకం

ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

టి డబ్ల్యూ జె ఎఫ్ 3వ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరణ.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం, మే 16, ( నేటి శుభోదయ): సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకమని భద్రాచలం ఏఎస్పి విక్రమ్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం భద్రాచలం ఏఎస్పి కార్యాలయం లో ఆయన ప్రత్యేక ఛాంబర్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభల పోస్టర్లను యూనియన్ నాయకుల తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘవిద్రోహక చర్యలను పోలీసుల దృష్టికి తీసుకు వచ్చి శాంతియుత వాతావరణాన్ని కల్పించడంలో విలేకరుల పాత్ర కీలకంగా ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, స్థానికంగా నెలకొన్న సమస్యలను జర్నలిస్టులు పోలీసుల, ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమం లో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ కర్ర అనిల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ రెడ్డి, యూనియన్ నాయకులు సుధీర్, సాయి కౌశిక్, నవీన్, అనిల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాంగ పరిరక్షణ వేదిక 4వ డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా , షేక్ అక్బర్ , ఖమర్, గౌరవ సలహాదారులుగా (సదర్) యాసిన్ ల నియామకం..

"నూతన కమిటీకి పలువురి శుభాకాంక్షలు..



ఖమ్మం కార్పొరేషన్ లోని నాలుగో డివిజన్ పాండురంగాపురం లోని మస్జిద్ ఏ ఫర్హాన్ ఆవరణలో ఆర్ పి వి సంస్థ నూతన కమిటీ..

ఖమ్మం మే 16.::(నేటి శుభోదయ): ముస్లిం మైనార్టీల వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం నిర్మితమైన రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థ ఫౌండర్,, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ సమక్షంలో ఖమ్మం నగరంలోని నాలుగో డివిజన్ లో నూతన కమిటీ నియామకం జరిగింది. శుక్రవారం ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్ పాండురంగాపురంలో గల మస్జిద్ ఎ ఫర్హాన్ మస్జిద్ ఆవరణలో ఆర్ పీ వీ సంస్థ నూతన కమిటీ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులుగా మాజీ కౌన్సిలర్ షేక్ అక్బర్, ఖమర్, గౌరవ సలహాదారులుగా మస్జిద్ (సదర్) ప్రెసిడెంట్ లియాసిన్, మౌలానా అన్వర్ ఆసాధి,ఉపాధ్యక్షులుగా డాక్టర్. షేక్ నజీర్, జానిపాషా, మీరాజ్ భాయ్, సహాయ కార్యదర్శిగా షేక్ రఫీ, జాయింట్ సెక్రటరీగా రఫీ, కోశాధికారిగా ........ ఈసీ సభ్యులుగా జానీ (కార్ ఆక్స సరీస్ ఓనర్), ముజీబ్, షరీఫ్, సుభాని, జమీరుద్దీన్, సలీం, షఫీ, పాషా, మొయినుద్దీన్, బడేమియా తదితరులను నియమించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ముస్లిం మైనార్టీ నాయకులు, పూర్వ సదర్ లు తదితరులున్నారు..

# అతిగా మద్యం త్రాగి వాహనాలు నడిపిన కేసులలో 9 మందికి జరిమానా.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 16, (నేటి శుభోదయ): కొత్తగూడెం కోర్టులో 09 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు గురువారం తీర్పుచెప్పారు. కొత్తగూడెం వన్ టౌన్ ఎస్.ఐ జి. విజయ కథనం ప్రకారం వాహనాలు నడుపుతుండగా ఒక్కరిని (1) ఆపి బ్రెత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా అతను మద్యం తాగినట్టు రుజువుగా కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ ముందు అతను నేరం ఒప్పుకొనగా జరిమానా విధించారు. లక్ష్మీదేవిపల్లి ఎస్.హెచ్. ఓ.- జి. రమణారెడ్డి కథనం ప్రకారం ఇద్దరు (2) మద్యం త్రాగి వాహనంలో నడుచుండగా బ్రీతింగ్ అనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం త్రాగినట్లు రుజువు కాగా కోర్టులో ప్రవేశపెట్టగా అట్టి నేరం ఒప్పుకొనగా మేజిస్ట్రేట్ జరిమానా విధించగా, అట్టి జరిమానా చెల్లించారు. పాల్వంచ టౌన్ ఎస్ హెచ్ ఓ. ఐ. జీవనరాజ్ పర్యవేక్షణలో వాహన తనిఖీ చేయుచుండగా ఆరుగురు (6) వ్యక్తులు మద్యం త్రాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం తాగినట్లుగా రుజువు కాగా కోర్టులో ప్రవేశ పెట్టగా మెజిస్ట్రేట్ విచారించగా నేరం ఒప్పుకున్నారు.వెంటనే జరిమానాలు విధించగా అట్టి జర్మానాలు చెల్లించారు.

# పాలీసెట్ మరియు ఏపీఆర్జేసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు



యాడికి మే 16 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): రాష్ట్రస్థాయిలో జరిగినటువంటి పాలిసెట్ మరియు ఎపిఆర్జేసి ఫలితాలలో యాడికి లోని వాగ్దేవి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధించడం నిజంగా అభినందించదగ్గ విషయం అని కరస్పాండెంట్ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. పదో తరగతి ఫలితాలలో 594 మార్కులతో తాలూకా టాపర్‌గా నిలిచిన సోహిత్,ఎపిఆర్జేసి లో కూడా 150 మార్కులకు గాను 121 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 341 ర్యాంకును కైవసం చేసుకుని మండల టాపరుగా నిలిచాడు. అదేవిధంగా అరుణ్ కుమార్ కూడా బైపిసిలో 150 మార్కులకు గాను116 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో153 వ ర్యాంకుతో యాడికి మండల టాపర్ గా నిలిచాడు. అదేవిధంగా భవ్య 116 మార్కులతో 473 వ ర్యాంకును ,లిఖిత 116 మార్కులతో 474వ ర్యాంకును ,సాయిరంగడు 114 మార్కులతో 529 వ ర్యాంకును, ఇంతటి ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలకు గర్వకారణమయ్యారు.అదేవిధంగా పాలిసెట్ లో కూడా భవ్య 114 మార్కులతో రాష్ట్రస్థాయిలో 623 వ ర్యాంకుతో మండల టాపర్ గా నిలిచింది, అదేవిధంగా సాయి రంగడు 112 మార్కులతో 1068 వ ర్యాంకు, లిఖిత 110 మార్కులతో 1599 వ ర్యాంకులను, అరుణ్ కుమార్ 106 మార్కులతో 2690 వ ర్యాంకును సాధించారు. ఇంతటి చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులకు సహకరించినటువంటి ఉపాధ్యాయులను వారి తల్లిదండ్రులను కొనియాడారు.

## జర్నలిస్ట్ మహమ్మద్ గౌస్ కు ఆర్థిక సహాయం అందించిన

### టీ యూ డబ్ల్యూ జే హెచ్143 సంఘం జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య



మహబూబాబాద్,**(నేటి శుభోదయ):** సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ గౌస్ పాషా సతీమణి ఇటీవల మృతి చెందడంతో తోటి విలేఖరులు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూ డబ్ల్యూ జే హెచ్ 143) సంఘం బాధ్యులు మానవతా దృక్పథంతో గౌస్ పాషా కూ మనో ధైర్యాన్ని అందించి, మద్దినేని గుట్టయ్య , గాడిపెల్లి శేఖర్, నల్లకుంట్ల కరుణాకర్ , నీరుటి లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు , పద్మం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, తేజవత్ శ్రీను , గంధసిరి వెంకన్న , నవీన్ కుమార్ , పల్లె శ్రీనివాస్ , తప్పెట్ల రాజు , గుంటి శ్రీధర్, ఉమ్మగాని మధు , మద్దెల శ్రీను , ఇండ్ల మహేష్ సహచర మిత్రులంతా ఆర్థిక సహాయం రూ 10, 500 లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టీ యూ డబ్ల్యూ జే హెచ్143 సంఘం జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య మాట్లాడుతూ మన కుటుంబ సభ్యులైనా తోటి జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆ వ్యక్తి కి మనమందరం అండగా ఉన్నాం అనే మనో ధైర్యాన్ని ఆచరణ ద్వారా చూపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భూఖ్యా మోహన్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు లావుడ్యా మనోహర్ చౌహన్, సీనియర్ పాత్రికేయులు దేవేందర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యుత్ ఘాతంతో పాడి పశువు మృతి



**మంథనిరూరల్, మే-16 (నేటిశుభోదయ దినపత్రిక): మంథనివిద్యుత్ ఘాతంతో పాడిపశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం మంథని మండలం నాగెపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ యొక్క ఆవు ఎస్ ఎస్ 29 ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ కు తగిలి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందింది. పాడి ఆవు విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ వారు స్పందించి నష్టపరిహారం అందించాలని రైతు వేడుకున్నారు.**

### వైరా నాయి బ్రాహ్మణ పట్టణ అధ్యక్షునిగా కుదురుపాక వెంకటేశ్వర్లు



వైరా, **(నేటి శుభోదయ):** వైరాలో శుక్రవారం జరిగిన నాయి బ్రాహ్మణ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. అధ్యక్షుడిగా కుదురుపాక వెంకటేశ్వర్లు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 103 ఓట్లు పోలుగా, కుదురుపాక వెంకటేశ్వర్లు 52 ఓట్లు, దేవరకొండ శ్రీనివాసరావుకు 40, నంద్యాల పుల్లయ్యకు 11 ఓట్లు లభించాయి .ఈ ఎన్నికలను అందరూ కలిసి ప్రశాంతంగా నిర్వహించు కున్నారు. 12 ఓట్ల మెజార్టీతో కుదురుపాక వెంకటేశ్వర్లు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన రాష్ట్ర ప్రభుత్వం

### అందాల పోటీల్లో పాల్గొనే మహిళల కాళ్లు కడిగించి పరువు తీసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

### ప్రగతిశీల మహిళా సంఘం ( పి.ఓ.డబ్ల్యు) ఖండన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 16 (నేటి శుభోదయ): తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం దెబ్బ తీసిందని,అందాల పోటీల్లో పాల్గొనే మహిళల కాళ్లు తెలంగాణ మహిళాలతో కడిగించి ప్రభుత్వం తెలంగాణ పరువు తీసిందని ప్రగతిశీల మహిళా సంఘం ( పి.ఓ.డబ్ల్యు)జిల్లా నాయకురాలు,ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు పి. రమ,సహాయ కార్యదర్శి ఆర్. పుష్పలత,సిరికొండ మండల అధ్యక్ష,కార్యదర్శులు ఇ. జమున,బి.లావణ్య లు శుక్రవారం నాడు సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని,మహిళల ఆత్మగౌరవం పెంపొందిస్తామని ఇలా మహిళాల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడం సిగ్గుచేటు అన్నారు.మహిళలని హార్దికంగా అభివృద్ధి చేయడానికి అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సహిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలు వ్యతిరేకిస్తున్న అందాల పోటీలు నిర్వహించడం శోచనీయమన్నారు.ప్రభుత్వం వద్ద డబ్బులు లేవంటూనే మహిళలందరూ వ్యతిరేకించిన అందాల పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి మహిళలను అరెస్ట్ చేసి మరి నిర్వహించడం సిగ్గుచేటు అని అన్నారు. తెలంగాణ మహిళలు అంటే పోరాటానికి,పౌరుషానికి మరో పేరు అని అలాంటి మహిళల ఆత్మ అభిమానం దెబ్బతీసేలా, ఆత్మగౌరవమును కించపరిచేలా అందాల పోటీలా లో పాల్గొనే మహిళల కాళ్లను తెలంగాణ మహిళాల చేత కడిగించడం తెలంగాణ మహిళలను అవమానపర్చడం అని అన్నారు.అందాల పోటీల్లో పాల్గొనేవారు ప్రభుత్వంకి అతిథులు కావచ్చు కానీ ఇక్కడి పేద మహిళలతో కాల్లు కడిగించడం సరి అయిన పద్ధతి కాదు అన్నారు. తెలంగాణ మహిళలను కించపరిచిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానంగా ముఖ్యమంత్రి తెలంగాణ మహిళలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# చివరి గింజ వరకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు

### – రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

### హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా పకడ్బందీ చర్యలు

### ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డుల జారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి





ఖమ్మం,**(నేటి శుభోదయ):** యాసంగి సీజన్ లో తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల




శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మన దగ్గర రికార్డ్ స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లో రైతులకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు. భారీ స్థాయిలో కొనుగోలు జరుగుతున్నప్పటికీ మీడియాలో సరిగ్గా కవర్ కావడం లేదని అన్నారు. పత్రికలలో వచ్చే నెగటీవ్ వార్తలపై స్పందించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించాలని అన్నారు. రాబోయే 15 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్ లు,



టార్పాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలని అన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. 2025, జనవరి 26 తర్వాత మన రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, మీసేవ కేంద్రాలు, ప్రజాపాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ధాన్యం పెండింగ్ లో ఉన్నదని, కొనుగోలు సజావుగా పూర్తి చేయాలని, మిల్లర్ల వద్ద తరుగు తీయకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రవాణా కాంట్రాక్టర్ లతో చర్చించి నిర్దేశించిన మేర వాహనాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించాలని, రైస్ మిల్లుల వద్ద తరుగు లేకుండా చూడాలని అన్నారు. గన్ని బ్యాగులు సమస్య రాకుండా చూసుకోవాలని, రవాణా సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కలెక్టర్లు ప్రణాళిక బద్దంగా యాసంగి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్ గా కలెక్టర్లు తనిఖీ చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రతి రోజు జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ పురోగతిపై మీడియాకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కరించి ఆ సమాచారం కూడా రైతులకు మీడియా ద్వారా తెలియ జేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల 70 వేల 477 మంది రైతుల నుంచి 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 వేల 42 కోట్లు మద్దతు ధర క్రింద చెల్లించామని అన్నారు. గతం కంటే అధికంగా ఈ యాసంగి సీజన్ లో మనం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే 15 నాటికి 2022-23 రబీ సీజన్ లో 25.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 2023-24 రబీ సీజన్ లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 2024-25 రబీలో 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు.



ప్రతి రోజు అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మే నెలాఖరు నాటికి పకడ్బందిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఆర్.టి.ఓ , పోలీస్ అధికారులు సమన్వయంతో ఖాళీగా ఉన్న లారీలను పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలుకు కేటాయించాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు



పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. గత ఆరు నెలల కాలంలో రేషన్ తీసుకోక పోవడం, ఇతర రాష్ట్రాలకు చెందిన డూప్లికేట్ బెనిఫిషరీ, చనిపోయిన వారి పేర్లు ఉండటం వంటి వివిధ కారణాల వల్ల భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 96 వేల 240 రేషన్ కార్డుల పరిధిలోని లక్షా 62 వేల 777 మంది లబ్ధిదారులు అనుమానాస్పదంగా ఉన్నారని, జిల్లాల వారీగా సంబంధిత జాబితా అందించామని, వీటిపై విచారణ చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇదేం గోల




## బీఆర్ఎస్ సెల్ఫ్ డిఫెన్స్‌లో పడిందా..? ఎందుకలా జరుగుతోంది?

హైదరాబాద్,**(నేటి శుభోదయ):** తెలంగాణ ఉద్యమ సమయంలోను, ఆ తర్వాత అధికారంలో ఉన్న పదేళ్ళు తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది బీఆర్ఎస్. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత డీలా పడ్డాయి పార్టీ శ్రేణులు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో పాటు తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచు కోలేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. చాలామంది నాయకులు ఒక్కరొక్కరుగా పార్టీని వదిలేసి వెళ్లారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తల్లో అలాంటి వలసలు ఉక్కిరిబిక్కిరి చేసినా ఈ మధ్య కాలంలో ఆ ప్రవాహం దాదాపుగా ఆగిపోయిందనే చెప్పాలి. దీంతో కాస్త ఊపిరి పీల్చుకున్న గులాబీ అధిష్టానం ఇక పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టి మళ్ళీ ఊపు తీసుకురావాలని అనుకుంది. అందుకు వరంగల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ సభను వేదికగా చేసు కోవాలనుకున్నారట పార్టీ పెద్దలు. సభతో ఊపు వస్తుందని, అదే ఊపును కొనసాగించి కేడర్‌ను రీ ఛార్జ్ చేయాలని అనుకున్నా వాస్తవంలో ఆ పరిస్థితి కనపడటం లేదన్న చర్చ తాజాగా మొదలైంది పార్టీ వర్గాల్లో. బహిరంగ సభ తర్వాత సభ్యత్వాల నమోదు, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు ఏర్పాటు, తర్వాత కేటీఆర్ జిల్లాల పర్యటన ఇలా పూర్తి స్థాయిలో యాక్టివిటీని పెంచాలనుకున్నట్టు తెలిసింది. కానీ ప్లీనరీ ముగిసి 15 రోజులు కావస్తున్నా అలాంటి వాతావరణం ఏదీ కనిపించడం లేదంటున్నారు. కనీసం ప్రాథమిక కసరత్తు కూడా జరక్కపోవడం ఏంటన్న అనుమానాలు వస్తున్నాయట పార్టీ శ్రేణులకు. అందుకు కొత్తగా చుట్టు ముడుతున్న సమస్యలే కారణం అంటున్నారు. పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలనుకునేలోపే బీఆర్ఎస్‌కు సోషల్ మీడియా రూపంలో సమస్యలు చుట్టుముడుతున్నాయట. ఆ పోస్టింగ్స్‌కు సమాధానం చెప్పుకోవడంతోనే సరిపోతోందని అంటున్నారు. తనను కావాలనే టార్గెట్ చేస్తున్నారని, ఆరు నెలలు జైల్లో ఉండటానికి కారకులు ఎవరో తెలుసునని, వాళ్ళు సొంత పార్టీ వాళ్ళు కావచ్చు, బయటి వాళ్ళు కావచ్చు అంటూ సంచలన ప్రకటన చేశారు ఎమ్మెల్సీ కవిత. ఆ విషయంలో కొన్నాళ్ళు పార్టీ పరమైన చర్చ, హడావిడి నడిచాయి. ఆ తర్వాత మరో సీనియర్ లీడర్ హరీష్‌రావు ఎపిసోడ్ తెర మీదికి వచ్చింది. హరీష్ పార్టీ పెట్టబోతున్నారని కొందరు, లేదు కాంగ్రెస్‌లోనో, బీజేపీలోనో చేరతారని మరికొందరు సోషల్ మీడియాలో చర్చ పెట్టి ఎవరికి తోచిన రాతలు వాళ్ళు రాసేసుకున్నారు. ఆ వ్యవహారం మరీ శృతి మించేసరికి చివరికి హరీష్‌రావే రంగంలోకి దిగి తాను కేసీఆర్‌కి నమ్మిన బంటునని, ఆయన మాట జవదాటబోనని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇలా వరుసబెట్టి వస్తున్న వివాదాలు, వాటికి సంబంధించిన వివరణలు, చర్చలతోనే సమయం సరిపోతోంది తప్ప పార్టీ కార్యక్రమాల మీద దృష్టి పెట్టే అవకాశం గులాబీ పెద్దలకు రావడం లేదన్న చర్చ జరుగుతోంది రాజకీయ వర్గాల్లో. అటు సోషల్ మీడియా రాతలకు పార్టీ పరంగా కౌంటర్స్ వేస్తున్నా వాటి తాలూకు డిస్ట్రబెన్స్ అయితే ఖచ్చితంగా నాయకత్వంలో ఉంటోందన్న అభిప్రాయం గులాబీ వర్గాల్లో పెరుగుతోంది. పార్టీ కీలక నాయకులే తమ గురించి తాము చెప్పుకోవాల్సి రావడం ఒకవైపు బీజేపీ, కాంగ్రెస్‌లో విలీనం అవుతుందన్న ప్రచారం మరోవైపు కలగలిసి ఎక్కడ లేని గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని, ఆ దెబ్బకు కేడర్ కూడా అయోమయంలో పడుతోందని చెప్పుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రజతోత్సవ బహిరంగ సభ తర్వాత ఫుల్‌గా రీ ఛార్జ్ మోడ్ ఆన్ అవుతుందని అనుకున్నా ఆ ఒక్కటీ జరగడం లేదంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి వస్తామని చెబుతున్న అధినాయకత్వం గేమ్ ప్లాన్ మార్చి స్పీడ్ అయితే తప్ప ఉపయోగం ఉండబోదని, ఆ దిశగా అడుగులేయాలన్న చర్చ జరుగుతోంది పార్టీ వర్గాల్లో.

## టిడిపి పార్టీ మండల, గ్రామ కమిటీల నియామకం



ఏన్కూరు,**(నేటి శుభోదయ):** ఏన్కూరు మండల కేంద్రంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన టిడిపి పార్టీ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు మండల గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కమిటీకి తెలుగుదేశం జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన జరిగింది. మండల కమిటీలో మండల అధ్యక్షుడిగా జాస్తి జనార్ధన్, మండల ఉపాధ్యక్షులుగా బర్రెపాటి శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కన్వీనర్ రామనాథం మాట్లాడుతూ... టిడిపి పార్టీని గ్రామ ,మండల స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త తో పాటు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. మనమందరం ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి ఉండి పార్టీని బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. టిడిపి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్లూరి అప్పారావు, నియోజకవర్గం పార్టీఇన్చార్జి చెరుకూరి చలపతి, ఆరెం వరలక్ష్మి, ఆరెం రామయ్య, పార్టీ సీనియర్‌నాయకులు తోట రాధాకృష్ణ,కొనకంచి రామకృష్ణ,ఎల్లంపల్లి వేణు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న అభాగ్యునికి నాలుగు లక్షల రూపాయల ఎల్ఓసి అందజేత

### బాధిత కుటుంబానికి అండగా వుంటా....

### నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 16 (నేటి శుభోదయ): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామ వాస్తవ్యులు మేదరి భూమేశ్వర్ కు వెన్నుపూస సమస్య తో అనారోగ్యానికి గురైనందున,అతని పరిస్థితి అతి తీవ్రంగా ఉండడంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరడం జరిగింది.వారికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున వారి కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి ని కలిశారు.చికిత్స కోసం డబ్బులు లేనందున వారికి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సకు అవసరమయ్యే సీఎం రిలీఫ్ ఫండ్ నుండి డబ్బులు ఇప్పించడానికి నాలుగు లక్షల రూపాయల ఎల్ వో సి లేఖను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.బాధిత కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళల బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.



DR. R. BHOOPATHI REDDY (M.S. Ortho)
Member of Legislative Assembly
18-Nizamabad Rural A/c., (T.S.)

CMRF T. No.: 5604 | TLOC | 2025

Lr No: Dr.RBR/MLA /NZB (Rural)/ 104 /2025 Dated: 15-05-2025

To
Sri. Anumula Revanth Reddy garu,
Hon"ble Chief Minister,
Government of Telangana,
Hyderabad.

Most Respected Sir,

This is to submit that, Sri. Medari Bhoomeshwar S/o. Medari Sayanna R/o H.No: 6-47/3 Gannaram Village, Indalwai Mandal, Nizamabad District is suffering from L4 L5 PIVD he is admitted in Nims Punjagutta, Hyderabad . He requires a prolonged treatment withEndoscopic Discectomy and its related procedures. The Hospital authorities have given, an estimation of Rs.400000/-( Rupees Four Lakh(s) Only )for the treatment.

The Patient belongs to a very poor family and genuinely BPL. Therefore it is requested to kindly grant the LOC, for the required amount to this Patient and do the needful. The necessary Original and Photostats documents are herewith enclosed for your kind perusal .

Worm regards,

Yours Sincerely
(Dr. R. Bhoopathi Reddy)

Encl:
1 Application in Original.
2 Hospital Estimation.
3 Ration Card / Income Certificate.
4 Aadhar Card

# ఖమ్మం లో సుడిగాలి పర్యటన చేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

### ఖమ్మం నందు పలు కార్యక్రమాలకు, పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మం, నేటి శుభోదయ ( మాధవరావు యెగినాటి, నేటి శుభోదయ రాష్ట్ర కోఆర్డినేటర్ ) ::: తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం ఖమ్మం నందు పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి వాస్తవ్యులు మొగ్రిమేకల రామసంగం కుమారుడు మోహన్ కృష్ణ వెడ్స్ గౌతమి వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. 8వ డివిజన్ గోపాలపురం బిఆర్ఎస్ నాయకులు లాల్ సాహెబ్, కొర్ర లోకేష్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ చింతల ప్రసాద్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీనివాస్ నగర్ చిత్తలూరి నర్సయ్య ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 29వ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు ఎర్రా అప్పారావు భార్య కృష్ణవేణి ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జే సి కృష్ణ,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ కూరాకుల వలరాజు,మోతారపు శ్రావణి సుధాకర్,పసుమర్తి రామ్మోహన్,బిక్కసాని జస్వంత్, దనాల శ్రీకాంత్,డోన్వాన్ రవి,తోట వీరభద్రం,పాలడుగు పాపారావు,పత్తిపాక రమేష్,దడాల రఘు,దండగల రాంబాబు,సిరిపురపు సుదర్శన్,గొల్లపుడి రాంప్రసాద్, మిట్టపల్లి రవి, ఎస్ టి సెల్ అధ్యక్షులు సురేష్,ఖయుమ్,పిన్ని కోటేశ్వరరావు,అశోక్,వీరేందర్, మోహన్,తిరుపతి రావు,మల్లేశం, పణి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.







# వైశాఖ మాసంలో వచ్చిన సంకష్టహర చతుర్థి

### విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు



మంథని, మే-16 (నేటిశుభోదయ దినపత్రిక): వైశాఖ మాసం శుక్లపక్షం లో శుక్రవారం రోజున వచ్చిన సంకష్ట చతుర్థి ఎంతో ప్రసిద్ధిగాంచినది. సరస్వతి నదిలో వచ్చే పుష్కరాల సందర్భంగా సంకష్టహర చతుర్థి దీక్ష తీసుకునేవారు ఈ రోజున చతుర్థి ఉపవాస దీక్ష స్వీకరిస్తారు. మానవులు దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించడానికి విఘ్నేశ్వరుని అనుగ్రహం ఎంతో ప్రధానమైనది. మానవులకు ఏవైనా ఇబ్బందులు, కష్టాలు, సమస్యలు ఉంటే ఈ సంకష్టహర చతుర్థి రోజున ఉపవాసం ఉంటే ఆ సమస్యలన్నీ తొలగిపోవడానికి ఇది శుభదినం. ఈ వ్రతాన్ని కృష్ణపక్షంలో ఉండే చవితి రోజున మొదలు పెట్టాలి. సంధ్యా సమయానికి చవితి తిథి ఉంటుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి సంకష్టహర చతుర్థి. ఈ రోజున వినాయకునికి ఇష్టమైన ఉండ్రాళ్ళు నైవేద్యంగా పెట్టి గరికతో సంకష్టహర వినాయకా అని స్మరిస్తూ పూజించాలి. ఈ విధంగా 21 నెల పాటు ఈ వ్రతాన్ని చేస్తే సంకటాలన్నీ కూడా తొలగిపోతాయని శాస్త్రం చెబుతోంది. సంకష్ట హర చతుర్థి పర్వదినమును పురస్కరించుకొని శుక్రవారం భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. సంకటాలు తొలగించే సంకటహర చతుర్థి దీక్షతో భక్తులు పునీతులు అవుతున్నారు. సంకటహర చతుర్థి దీక్ష చేపట్టిన భక్తులతో శ్రీ విఘ్నేశ్వర స్వామి భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. ప్రతి నెలలో ఒకసారి వచ్చే సంకటహర చతుర్థి పర్వదినం రోజున మంథని పట్టణంలోని శ్రీ మహాగణపతి దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి 10.06 గంటలకు చంద్రోదయం అనంతరం చతుర్థి దీక్ష చేపట్టిన భక్తులు భోజనం చేస్తారు. ప్రాచీన కాలంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహా గణపతి మందిర పట్టణంలోని తమ్మిచెరువు కట్ట లో కొలువుతీరి ఉన్నారు. ఈ శ్రీ మహాగణపతి దేవాలయం అనాదిగా ఎంతో విశిష్టత సంతరించుకుంది. వైశాఖ మాసం వచ్చిన సంకట చతుర్థి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మహా గణపతిని దర్శించుకున్నారు. సంకటహర చతుర్థి పర్వదినం రోజున శ్రీ విఘ్నేశ్వర స్వామి కి 121 మోదకాలు సమర్పించడం అలాగే దూర్వాలు సమర్పించడం ఎంతో శ్రేయస్కరం అని భక్తుల విశ్వాసం. ప్రతినిత్యం ముఖ్యంగా ప్రతి మంగళవారం ఎందరో భక్తులు ఆలయంలో మహా గణపతిని దర్శించుకుని వెళ్తుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విఘ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అనేక రకాల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని ఆలయ పూజారి పల్లి రాము భక్తులతో పూజలు చేయించారు.

# అక్రమంగా గోవులను రవాణా చేస్తున్న వారిని అడ్డుకోండి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 16 (నేటి శుభోదయ): సంవత్సర కాలం నుండి గోవుల అక్రమ రవాణా ఆగడం లేదు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్,సూర్యా నగర్,పద్మా నగర్,సీతారాం నగర్ కాలనీల నుండి గోవులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి దొంగతనం చేస్తున్నారని ఇట్టి విషయమై తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటివరకు రెండవ టౌన్, మూడవ,ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్లలో పలుమార్లు ఫిర్యాదులు చేసిన కానీ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని శివాజీ నగర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.15వ తేదీ ఆకుల పాపయ్య రోడ్డు చందానగర్ వద్ద మూడు ఆవులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి దొంగలించడానికి ప్రయత్నించారని అక్కడ ఉన్న కాలనీవాసులు గుర్తించి పట్టుకోవడానికి ప్రయత్నించారని కానీ దుండగులు కాలనీవాసులపై రాళ్లతో దాడి చేసి తప్పించుకొని పారిపోయారు అని అన్నారు.కావున వారి పైన తగిన చర్యలు తీసుకోవాల్సిందని శివాజీ నగర్ రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో శివాజీ నగర్ రైతులు మంతెన సంపత్ అయిటి శ్రీ వర్ధన్ ఔదగిరి హరీష్ పూదరి సునీల్ చాకలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని/ కాళేశ్వరం, మే -16 (నేటిశుభోదయ దినపత్రిక): సరస్వతి పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాలను, సేవలను సమీక్షించేందుకు మంత్రి శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించారు. ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, భక్తులకు సరఫరా చేసే తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుందని అధికారు లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.స్వచ్ఛత, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, శాసన సభ్యులు మక్కన్ సింగ్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, డిఆర్డీఓ నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాళ్లు ఏర్పాటు చేసిన వారితో ఫోటటోలు దిగి అభినందించారు.



# దేశభక్తి నినాదాలతో దద్దరిల్లిన వింజమూరు..!

### అమరులైన వీర జవాన్లకు జోహార్.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్..

### ప్రతి భారతీయుడు పుట్టిన నాటి నుండి గిట్టేంత వరకు దేశభక్తి కలిగి ఉండాలి..!

### భారత్ సత్తాను ప్రపంచానికి చాటిన భారత సైన్యం..,!

### భారతదేశానిది రాజనీతి, పాకిస్తాన్ ది ఉగ్రవాదం..!

### అమరులైన భరతమాత బిడ్డలకు ఘన నివాళులర్పిస్తూ.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం పై తిరంగా ర్యాలీ..!

### వింజమూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీ సూపర్ సక్సెస్..!



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) వింజమూరు/ఉదయగిరి) : దేశభక్తి నినాదాలతో వింజమూరు దద్దరిల్లింది. పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అమరులైన భరతమాత బిడ్డలకు మరియు ఆపరేషన్ సింధూర్ లో వీర మరణం పొందిన జవాన్లకు జోహార్లు అర్పిస్తూ.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం పై నిర్వహించిన తిరంగా ర్యాలీ వింజమూరులో సూపర్ సక్సెస్ అయింది. శుక్రవారం సాయంత్రం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో, కూటమి ప్రభుత్వం, నాయకుల సారధ్యంలో దేశభక్తి కలిగిన పౌరులతో, స్థానిక బంగ్లా సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు, 100 మీటర్ల జాతీయ జెండాతో, త్రివర్ణ పథకాలను చేత భూని , భరతమాత నినాదాలను, జాతీయ గేయాలను పలుకుతూ క్రమశిక్షణగా జరిగిన తిరంగా ర్యాలీ, భరతమాత బిడ్డల ఐక్యతను సాటింది. అనంతరం పాత బస్టాండ్ లో నిర్వహించిన సభలో మాజీ జవాన్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జవాన్లు వారి అనుభవాలను పౌరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, భారత్ సత్తాను భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలకు,భారత సైన్యం చాటి చెప్పిందని తెలియజేశారు. ప్రతి పౌరుడు పుట్టినప్పటి నుండి గిట్టేంతవరకు దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. పాకిస్తాన్ అంటే ఉగ్రవాదులతో నిండిపోయిన దేశంగా ప్రపంచానికి తెలుసునన్నారు. అనేక సందర్భాలలో వారిని ఎదుర్కొన్న, వారిలో మార్పు రావడం లేదన్నారు. మన ఔన్నత్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ కుట్ర చేస్తూ అనేక పర్యాయాలు భారతదేశ పై దాడి చేసిందన్నారు. అటువంటి సందర్భాలలో అమాయక పౌరులు అమరులైనారు అన్నారు. పహల్గాం దాడిలో భరతమాత బిడ్డలు 27 మంది వీరమరణం పొందారున్నారు. ఆపరేషన్ సింధూర్ లో 17 మంది జవాన్లు అమరులైనారు అన్నారు. ఇటువంటి సందర్భాలలో మనమందరం కలిసికట్టుగా దేశానికి మద్దతు పలకాలని తెలిపారు. అవసరమైతే ప్రతి ఒక్కరం సైనికుడిగా భారతదేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అమరులైన భరతమాత బిడ్డలకు, వీర మరణం పొందిన జవాన్లకు ఘన నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సింధూర ఆపరేషన్ గురించి దేశభక్తి గురించి, పాకిస్తాన్ ఉగ్రవాదుల తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి,మాజీ పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, వింజమూరు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, గువ్వల కృష్ణారెడ్డి, చింతల శ్రీను, గణపం సుదర్శన్ రెడ్డి, కోడూరు నాగిరెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, చల్లా శ్రీనివాసులు, వసంతరావు, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, వింజమూరు సర్పంచ్ నల్లగొండ సృజన, యల్లాల రఘురామిరెడ్డి, పాములపాటి మాల్యాద్రి, కె.శ్రీనివాస నాయుడు, డాక్టర్ కే మాశిలామణి, ఉదయగిరి జనసేన కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి,బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కదిరి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులు పులిచర్ల వెంకటనారాయణ, మండల అధ్యక్షులు దేగ మధు యాదవ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర , మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, పూసాల వెంగప నాయుడు, తుమ్మల కిరణ్ కుమార్ నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర , జనసేన వింజమూరు మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, కడియాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యురాలు వనిపెంట హైమావతి, యాకసిరి భవాని, ఉదయగిరి మండల కన్వీనర్ సురేంద్ర రెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్ రసూల్ జలదంకి జనసేన నాయకులు రామ్ చైతన్య, కమతం శ్రీనివాసులు, ఇమ్రాన్, మద్దూరు గోపాల్ రెడ్డి,ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి,సిడిపిఓ పద్మజా కుమారి, కలిగిరి సిఐ వెంకటనారాయణ, ఎనిమిది మండలాల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూఅధికారులు పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, తెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.











# ప్రజాస్వామ్య పోరాటంతోనే మళ్లీ వెలుగులు

### 16 నెలలైనా రొంపికుంటకు 16పైసల పని చేయలే

### మానిఫెస్టో చైర్మన్‌గా ఒక్క పథకంలో మార్పు తీసుకురాలే

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, మే-16 (నేటి శుభోదయ దినపత్రిక): ప్రజాస్వామ్య పోరాటంతోనే మంథని నియోజవకర్గానికి మళ్లీ వెలుగులు రావాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. గురువారం కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రజాస్వామ్య పోరాటానికి శ్రీకారం చుట్టారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, ఆలయం లో పూజలు నిర్వహించి ,కేక్ కట్ చేసిన అనంతరం ప్రజాస్వామ్య పోరాట లోగో ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజాస్వామ్య పోరాటానికి రొంపికుంట గ్రామం నుంచే శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అయితే 2009లో తాను నియోజకవర్గ ప్రజలకు తెలియకపోయినా ఆనాడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే 52వేల ఓట్లు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో చీకటి పాలనను అంతం చేయడానికి 2007లో తాను అడుగులు వేశానని, ఆనాడు అనేక నిర్బంధాలు, కష్టలు ఎదురైనా అనేక మంది తన అడుగులో అడుగులు వేస్తూ ముందుకు వచ్చారన్నారు. అయితే నియోజకవర్గం గురించి పూర్తిగా తెలియదో అప్పటి వరకు ప్రజాస్వామ్యం ముందుకు సాగదని ఆయన అన్నారు. రొంపికుంట గ్రామం ఒకప్పుడు మండల హెడ్ క్వార్టర్‌గా ఉండేదని, కరీంనగర్, పెద్దపల్లి రైల్వే స్టేషన్, నేషనల్ హైవేకు అతి సమీపంలోనే ఉందని, ఇక్కడ ఎంతో మంది చదువుకుని చైతన్యవంతులు ఉన్నారని, ఇక్కడి నుంచే చైతన్యం మొదలు కావాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించకపోతే చీకటి పాలనను అంతం చేయలేమన్నారు. 40ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లు వేసి అవకాశం ఇస్తే ఏం చేశారని ఆలోచన చేయాలన్నారు. మన ఓటుతో ఆ కుటుంబానికి మేలు జరుగుతుందే తప్ప మనకు ఏమీ జరుగడం లేదన్నారు. ఇంత సమీపంలోనే ఉన్న రొంపికుంట గ్రామానికే మేలు జరుగకపోతే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, అగ్రవర్ణాల్లోని పేదలకు ఏ విధంగా మేలు జరుగుతుందని ఆలోచన చేయాలన్నారు. ఓటు వేసే ముందు ఆలోచన చేయాలని, ఆలోచించకుండా ఓట్లు వేస్తే ప్రమాదమని ముందే చెప్పినా ఫలితం దక్కలేదన్నారు. కేవలం ఓట్లు వస్తే నోట్ల కట్టలతో వచ్చి గెలిచి మళ్లీ నోట్లు సంపాదించుకునే ఆలోచనలోనే ఉన్నారే కానీ ఇక్కడ ప్రజలకు మేలు చేయాలని చూడటం లేదని, 16నెలలు గడిచినా రొంపికుంటలో 16పైసల పని జరుగలేదని ఆయన అన్నారు. అంతేకాకుండా రొంపికుంట గ్రామంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఏ ఒక్కరికైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్దంగా ప్రజల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన తనలాంటి వాళ్లను ఎలా అణిచివేయాలనే చూస్తున్నారని ఆయన గుర్తు చేశారు. 2009 నుంచి 2023వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మైనస్ ఇచ్చి ఆ కుటుంబానికి మద్దతు తెలిపిన రొంపికుంట గ్రామంలో మొదలైన ప్రజాస్వామ్య పోరాటం అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆనాడు ఎన్నికల సమయంలో మంథని ఎమ్మెల్యే తానే మానిఫెస్టో కమిటి చైర్మన్ అని అన్ని హామీలు అమలు చేస్తామని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కాపు సామాజిక వర్గం నుంచి తాను ఎదగానని, ఆ కాపుదనపోళ్ల కాడికి పోయి వారిని మభ్యపెట్టాడని ఆయన గుర్తు చేశారు. మానిఫెస్టోలో చెప్పిన పథకాలను అమలు చేయాలని తాము డిమాండ్ చేస్తూ ప్రశ్నిస్తే తమపై అక్రమ కేసులు పెట్టారని, మహాముత్తారం, రామగిరి, మంథని, కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయని, మరికొందరు నాయకులపై రౌడీషీట్లు ఓపెన్ చేశారన్నారు.తాను ఏం చేశానని కేసులు పెట్టారని పోలీసులను ప్రశ్నించారు. పదేళ్ల కాలంలో ఎవరిపైనా తాము కేసులు నమోదు చేయలేదని, ఎవరు ధర్నా చేసినా ఆందోళనలు చేసినా కేసులు పెట్టించలేదన్నారు.కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆనాడు పోలీసులు పని చేస్తలేరని, కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రచారం చేసి బదనాం చేశారన్నారు. కానీ ఈనాడు నియోజకవర్గంలో పోలీస్‌స్టేషన్‌లు పని చేయడం లేదని, గోదావరిఖని ఏసీపీ కార్యాలయం నుంచే నడుస్తున్నాయన్నారు. ఏసీపీ ఆఫీస్‌లో నోట్ల సంచులు ముడితేనే పోస్టింగ్‌లు ఇస్తున్నారని, మాజీ ఎమ్మెల్యేపై కేసులు పెట్టేందుకే ఇక్కడ పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారని ఆయన వివరించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే అక్రమ కేసులు పెడితే ఎలా అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు పద్దతి మార్చుకోకపోతే పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలని బోర్డులు పెట్టాల్సి వస్తుందని, ఆ పరిస్థితిని తీసుకురానిచ్చుకోవద్దన్నారు. మానిఫెస్టో కమిటి చైర్మన్‌గా, ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా ఉండే మంథని ఎమ్మెల్యే ఏ ఒక్క పథకంలో మార్పు తీసుకురాలేదని, ఆనాడు చెప్పినవన్నీ అధికారం కోసం ఆడిన అబద్దాలేన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో మినహ ఏ ఆస్పత్రిలోనైనా ఎవరికైనా ఎల్ఓసీ ఇప్పించారా అని ఆయన ప్రశ్నించారు. తండ్రి ఆశయాల సాదన అంటూ పదే పదే చెప్తున్న మంథని ఎమ్మెల్యే తన తండ్రి పేరు ఏర్పాటు చేసిన శ్రీపాద ట్రస్టు ద్వారా పేదలకు ఎందుకు సేవలు చేయడం లేదన్నారు. కాటారంలో ఓ ఎస్సీ బిడ్డ మెడిసిన్ సీట్‌కు ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నానని మొరపెట్టుకుంటుంటే ట్రస్టు ద్వారా సాయం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. తనకు ఈనాడు 72వేల మంది ప్రజల ఆశీర్వాదం ఉందని, 40వేల మంది కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుటుంబం ఉందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంథని ఎమ్మెల్యే ఊకదంపుడు మాటలకు భయపడేది లేదన్నారు. తండ్రి తర్వాత తమ్ముడు, కొడుకు ఇలా వారసులవ్వడం కాదని,ఈ మట్టిలో పుట్టిన బిడ్డను ఎమ్మెల్యే చేయాలన్నదే ఈ ప్రజాస్వామ్య పోరాటమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ విభాగాలకు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.








# పెద్ద గుండాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పులిచెర్ల, మే 16,(నేటి శుభోదయ) : చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం కొత్తపేట - భీమవరం రహదారిలో వెలసిన శ్రీ పెద్ద గుండాలమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేసి మంగళ హారతి గావించి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పరిసర గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ఖమ్మం లో కుక్కలతో బెదిరింపులకు పాల్పడుతున్న అప్పు దారులు

### అడుగు అడుగున మోసమే అయైన చర్యలు శూన్యం



ఖమ్మం,(నేటి శుభోదయ): ఖమ్మం జిల్లాలో వింత పోకడలు విపరీతంగా శృతి మించిన సందర్భాలు చోటు చేసుకున్నాయి. ఖమ్మం నగరంలో తమ అవసరాలకు ఇతరుల వద్ద రుణం తీసుకోవడం జరుగుతుందని తెలుస్తోంది. తీరా తమ అప్పు కోసం వారి ఇంటికి వెళ్ళితే కుక్కలతో బెదిరింపులకు పాల్పడటం షరా మామూలే మరి. ఇలాంటి సంఘటనలు ఖమ్మం లో అనేక చోట్ల చోటు చేసుకున్నాయి. ఇది ఇలా ఉండగా అప్పు కాకుండా స్థలాల కోనుగోలు, అమ్మకం, ఆక్రమణ విషయంలో కూడా ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటివల తమ అప్పు కోసం ఓ వ్యక్తి బాకీ ఉన్న వారి ఇంటికి వెళ్లి తమ అప్పు ఇవ్వమని అడిగితే తక్షణమే కుక్క ను మీదికి పంపిన సందర్భం చోటు చేసుకుంది. ఇటివల ఖమ్మం నగరంలో గల ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సంఘటన చోటు చేసుకుంది. గాయాల పాలైన బాధితులు ఫిర్యాదు చేస్తే పరువూ పోయె పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పోలీస్ అధికారులపై ఉంది మరి.

# ప్రైవేట్ ఫైనాన్స్ పై కేసు నమోదు

### మంథని ఎస్ఐ డి. రమేష్



మంథని, మే -16 (నేటిశుభోదయ దినపత్రిక): శ్రీ బాలాజీ అసోసియేట్స్ చైర్మన్ దోమల రమేష్ ఫైనాన్స్ బ్రాంచీలను పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిలో ఓపెన్ చేసి ఉద్యోగులను నియమించు కొని వారి ద్వారా కష్టమర్లకు లోన్స్ ఇప్పించుట గురించి లాగిన్ అమౌంటు రూ.5,100 లోన్ ఇప్పించినందుకు గాను ప్రాసెసింగ్ ఫీజు లక్షకు 3300 గాను ముందుగానే కస్టమర్స్ నుండి వసూలు చేసి అట్టి బ్రాంచీలలో పెద్దపల్లి గోదావరిఖని బ్రాంచీలను ఎత్తివేసి, మంథనిలో కస్టమర్ల లోన్ అమౌంట్ ఇవ్వకుండా మరియు ఉద్యోగులకు గత 2,3 నెలల నుండి జీతాలు ఇవ్వకుండా కస్టమర్లను మోసం చేసి డబ్బులు వసూలు చేసిన సదరు వ్యక్తిపై మంథని పోలీస్ స్టేషన్లో దరఖాస్తుఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడమైనది. కావున మండలంలోని ప్రజలు ఇలాంటి వ్యక్తులను నమ్మి ముందుగానే డబ్బులు చెల్లించి మోసపోవద్దని మంథని ఎస్ ఐ డి. రమేష్ తెలియజేశారు.

# సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారానికి హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ధర్నా

### ప్రభుత్వం మారుపేర్ల సమస్యను పరిష్కరించి కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### సాదినేని వెంకటేశ్వరరావు ఐ ఎఫ్ టి యు జాతీయ ఉపాధ్యక్షులు



(నేటి శుభోదయ) పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: మే- 16: సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం మారుపేరు బాధితులు హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కు మారుపేర్ల బాధిత సంఘం నాయకులు శ్రావణ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా నుద్దేశించి ఐ ఎఫ్ టీ యు జాతీయ ఉపాధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలు గత 30 సంవత్సరాలుగా సర్వీస్ పూర్తి చేసి అనారోగ్య కారణాల వలన కార్పొరేట్



మెడికల్ బోర్డు వారిచే మెడికల్ ఇన్వాలిడెట్ ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారుపేర్ల పై ఉద్యోగం చేసిన వారిని రెండు పేర్లు ఉన్నాయని కారణంతో దరఖాస్తు చేసుకున్న డిపెండెంట్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకుండా గత 15 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సకాలంలో సింగరేణి ఉద్యోగం రాక ఎలాంటి ఉపాధి మార్గం లేక కార్మికుల పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని వారి కుటుంబాల పోషణకు భారంగా మారిందన్నారు. గతంలో మారుపేరుల సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు ఈనాటికీ మారుపేరుల సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం మారుపేర్ల సమస్యను పరిష్కరించి విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు విమల, ఐ ఎఫ్ టీ యూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, జి ఎల్ బి కే ఎస్ ( ఐ ఎఫ్ టి యు ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్, మారుపేర్ల బాధిత సంఘం నాయకులు ఓం ప్రకాష్, తిరుమల శ్రీనివాస్, రామిల్ల సందీప్, పల్లె సంతోష్, బాబు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీ కేవలం 50 రూపాయలు మాత్రమే పడుతుంది

### వ్యకాస జిల్లా కార్యదర్శి బూడిద గణేష్



మంథని/పెద్దపల్లి, మే-16 (నేటిశుభోదయ దినపత్రిక): మంథని మండలం దుబ్బ పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ కూలీలు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు పనిచేసిన రోజు కూలి కేవలం 50 రూపాయలు మాత్రమే పడుతుందని కూలీలు అసహనం వ్యక్తం చేశారని అన్నారు ఇది చాలా అన్యాయమని అన్నారు బిజెపి ప్రభుత్వం కూలీలను నట్టేట ముంచుతుందని విమర్శించారు వేసవికాలంలో ఎంతో కొంత ఆర్థికంగా ఊరట నిస్తుందని ఆశించి ఉపాధి పనికి వస్తే కూలి గిట్టుబాటు కాకపోతే నిరుపేద కూలీలు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. కూలీల అవస్థలకు మోడీ ప్రభుత్వ విధానాలే కారణమని నిలదీశారు సంబంధిత అధికారులు స్పందించి ప్రతి కూలికి కూలి పడే విధంగా చర్యలు తీసుకోవాలని బకాయి వేతనాలు విడుదల చేయాలని పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 20న ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కొరకు జిల్లా మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

# వరి కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి

### ఇప్పటివరకు 7.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

### వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్,తుమ్మల సమీక్ష



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 16 (నేటి శుభోదయ): జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా సాఫీగా సాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ లతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల స్థితిగతుల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రులకు వివరించారు. యాసంగిలో జిల్లాలో 4.91 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేయగా,సుమారు12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని అన్నారు. దీనికి అనుగుణంగా ఈ సీజన్లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని 700 పైచిలుకు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 7.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. మే చివరి వారం నాటికి లక్ష్యానికి మించి మరో 35 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. 700 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటికి 460 కేంద్రాలలో ధాన్యం సేకరణ నూటికి నూరు శాతం పూర్తయ్యిందని,ప్రస్తుతం 260 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం విలువ రూ.1839 కోట్లు కాగా, రూ.1548 కోట్ల బిల్లు మొత్తాలను రైతుల ఖాతాలలో జమ చేశామని అన్నారు. 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన టాబ్ ఎంట్రీలు పూర్తయ్యాయని వివరించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని,2.13 కోట్ల గన్నీ బ్యాగులు వచ్చాయని తెలిపారు. ప్యాడీ క్లీనర్లు, టార్పలిన్లు,తూకం యంత్రాలు సరిపడా ఉన్నాయని,ధాన్యం తరలింపునకు సంబంధించి లారీల కొరత తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని,అన్ని కేంద్రాలలో సరిపడా సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండేలా,మిల్లుల వద్ద వెంటదివెంట ధాన్యం దిగుమతి చేసుకునేలా పక్కాగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈసారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ,రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా,129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని తెలిపారు. 2022-23 యాసంగిలో 25 .35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగగా, 2023 - 24 లో 32 .93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. ఈ ఏడాది యాసంగికి సంబంధించి ఇప్పటికే 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లారీలు,హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు,సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని హితవు పలికారు. కాగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలుపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,డీఆర్డీఓ సాయాగౌడ్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి, డీఎస్ఓ అరవింద్ రెడ్డి,సివిల్ సప్లైస్ డీ.ఎం.శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్,మార్కెటింగ్ శాఖ ఏ.డీ.గంగూబాయి తదితరులు పాల్గొన్నారు.

# దీన స్థితిలో నిరుపేద కుటుంబం

### అనారోగ్యంతో మంచం పట్టిన భర్త

### కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న భార్య

### రాగి జావా అమ్ముతూ తల్లికి ఆసరాగా నిలుస్తున్న బీటెక్ చదివే కూతురు

### న్యూస్ పేపర్ వేస్తున్న టెన్త్ చదివిన కొడుకు

### అండగా నిలిచిన శ్రీ సీతారామ సేవా సమితి సంస్థ

### 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ

### రూ.2,500 ఆర్థిక సహాయం అందజేత



(నేటి శుభోదయ)పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: మే -16: నిరుపేద కుటుంబాన్ని దేవుడు పగబట్టినట్టు ఉన్నాడు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు.. ఇంకోవైపు అనారోగ్య సమస్యలతో కుటుంబం పూట గడవని స్థితిలో తల్లడిల్లుతోంది. వివరాలు పెడితే... గోదావరిఖని మార్కండే కాలనికీ చెందిన దుర్గం రాముకు రేణుక, బీటెక్ చదివే కూతురు ఆశ్రీత, టెన్త్ చదివిన కొడుకు వంశీకృష్ణ ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిచేసిన రాముకు రెండేళ్ల క్రితం పక్షవాతం తో పాటు కిడ్నీ సంబంధిత సమస్యలు రావడంతో మంచానికి పరిమితమయ్యాడు. దీంతో కుటుంబం నడవడం కష్టం కావడంతో భార్య ప్రైవేట్ ఆస్పత్రిలో స్వీపర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. తల్లికి తోడుగా ఉండేందుకు బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కూతురు ఆశ్రీత, ఉదయం సాయంత్రం రోడ్లపై రాగి జావా విక్రయిస్తోంది. అలాగే టెన్త్ పూర్తి చేసిన కొడుకు వంశీకృష్ణ కూడా ఉదయం న్యూస్ పేపర్ వేస్తూ తల్లికి తోడుగా ఉంటున్నాడు. ఒకవైపు రాముకు ప్రతినెల వైద్యం అందించడానికి డబ్బులు సమకూర్చడానికి ఇబ్బంది పడుతూనే, ఇంకో దిక్కు కూతురు, కొడుకు చదువులకు డబ్బులు లేక ఆ తల్లి తల్లడిల్లుతోంది. విషయం తెలిసిన ఎన్టిపిసి లోని శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు స్పందించారు. శుక్రవారం నిరుపేద కుటుంబాన్ని శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు నేరుగా కలుసుకొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. 50 కిలోల బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులతో పాటు రూ.2,500 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాన్నీ ఆదుకునేందుకు మానవతా హృదయాలు ముందుకు రావాలని కోరారు. పిల్లల చదువు బాధ్యతలు స్వీకరించడంతోపాటు కుటుంబం పోషణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడానికి పలువురు స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచంద సంస్థల ఐక్య వేదిక తరుపున ఫైట్ ఫర్ బెస్ట్ సొసైటీ ప్రతినిధులు మద్దెల దినేష్, ప్రతినిధులు కంది సుజాత, జనగాం రాజేశ్వరి, లెనిన్, గౌస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి నియంత్రించడానికి ప్రజలు సహకరించాలి

### జిల్లా ఉప వైద్య అధికారి తుకారాం రాథోడ్




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చులక విజయకుమార్: మే 16 (నేటి శుభోదయ): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవంను శుక్రవారం స్థానిక సీతారాం నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం నుండి జిల్లా మలేరియా అధికారి,జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం నగర్ కాలనీ వీదుల్లో దోమల నివారణ పై మనందరి పంతం డెంగీ అంతం,చిన్న ప్రాణులు పెద్ద ప్రమాదం,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి,నీటి నిల్వలను తొలగించండి, దోమతెరలను వాడండి, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి,అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తిరిగి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని



అక్కడ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం నినాదంగా పరిసరాలను పరిశీలించండి, శుభ్రపరచండి,మూతలు పెట్టడం ద్వారా డెంగిని నివారించుదాం అని ఇవ్వడం జరిగిందన్నారు. దానికోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి ప్రతిరోజు వెళ్లిన సందర్భంలో ఆశాలు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటి వద్ద పరిసరాలను పరిశీలిస్తూ పరిసరాలను పరిశుభ్రపరుచుకోనే విధంగాఅవగాహన కలిగిస్తూ నీటి నిల్వలను తొలగిస్తూ మూతలు పెట్టడం లాంటి అలవాట్లను ప్రతి గృహంలో అవగాహన కలిగించాలన్నారు. డెంగ్యూ వ్యాధి ఈడీస్ ఇజిప్ట్ అనే దోమ కుట్టడం వలన వస్తుందని దీనిని టైగర్ దోమ అని కూడా అంటారని ఇది పగటిపూట కుడుతుందని అన్నారు. మూడు దోమల ద్వారా ఐదు రకాల వ్యాధులు వ్యాపిస్తాయన్నారు వీటిలో డెంగీ అత్యంత ప్రమాదకరమైందని డెంగీ లక్షణాలు ఉన్నట్లయితే మీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తగిన వైద్య పరీక్షలు చేసుకుని చికిత్స పొందాలని తెలియజేశారు. డెంగ్యూ వ్యాధిని ఎలీషా పరీక్ష ద్వారా నిర్ధారణ చేయవచ్చు అన్నారు. డెంగ్యూ వ్యాధి చికిత్స పట్ల ప్రజల్లో మూఢనమ్మకాలు ఉన్నాయని వాటిని తొలగించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. దోమలు పుట్టకుండా దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాల న్నారు. ప్రతి ఇంటి వద్ద పరిసరాలను పరిశీలిస్తూ,నీటి నిల్వలను తొలగిస్తూ,ప్లాస్టిక్ ని నివారిస్తూ, అనవసరమైన ఖాళీ డబ్బాలు,ప్లాస్టిక్ కవర్లు,పాత టైర్ లలో,కొబ్బరి చిప్పలు, గ్లాసులు ఏవి కూడా ఇంటి వద్ద పరిసరాల్లో ఉండకుండా ప్రతి శుక్రవారం తొలగించాలని నీటి నిల్వలని పారపోస్తూ, కడిగి, ఎండబెట్టి మరలా వాటిని వాడుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేనీ విధిగా పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి పట్టణంలో వివిధ శాఖల సమన్వయంతో అందరినీ భాగస్వామ్యం చేస్తూ ప్రజలందరినీ దోమల నివారణలో భాగస్వామ్యం చేసేలా అవగాహన కలిగించాలన్నారు. దోమల నివారణ,కీటక జనిత వ్యాధుల నివారణ వైద్యశాఖ ఒకరే కాకుండా ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే కీటక జనిత వ్యాధులను డెంగీ లాంటి వ్యాధిని నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నవ్య,మాలపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సహిస్తాహిర్దోష్,ఏ ఎం ఓ సలీం,జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు,సబ్ యూనిట్ అధికారి గోవర్ధన్,హెచ్ ఇ ఓ లు నటరాజ్,రవిచందర్, పర్యవేక్షణ అధికారులు సుశీల శ్యామల, ఆరోగ్య కార్యకర్తలు మధుసూదన్,స్వామి,శశిరేఖ, సుశీల,కవిత, సంగీత, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టం కొందరికే చుట్టమా?

తిరువూరు, **(నేటి శుభోదయ):** దేశంలో ప్రతి ఒక్క పౌరుడికి భారత రాజ్యాంగం వేయి అక్షౌహిణులై చుట్టూ పహారా కాస్తున్నది. ఎవరు చెప్పారు చట్టాలు కొందరికే చుట్టాలని? భారతీయ శిక్షాస్మృతిలోని అనేక సెక్షన్లు ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నాయి,మన భద్రతకు భరోసా ఇస్తున్నాయి. మన ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నాయి. మనం చేయాల్సిందల్లా ఒక్కటే.. ప్రశ్నించడం,నిలదీయడం, పోరాడటం! రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్నప్పుడే మనకు ఆత్మబలం వస్తుంది. న్యాయ శాస్త్రాన్ని ఆపోశన పట్టినప్పుడే ప్రతి ఒక్కరికి నిగ్గదీసే తెగువ అబ్బుతుంది. ఈ విషయాలన్నీ వాస్తవాలైన నిజ జీవితంలో మాత్రం కొంతమంది అధికారుల ధన దాహం ముందు పేపర్లపై రాతలు గానే మిగులుతున్నాయి. అది ఎంతలా అంటే ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడి మరణం పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత కూడా హత్య? లేక ఆత్మహత్య? అని తేల్చలేక మిస్టరీగా ఉంచిన పోలీస్ బాస్ వ్యవహార శైలి అంత.. తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా కల్లూరు మండలం తెలగారం మర్లపాడు గ్రామానికి చెందిన మృతుడి తల్లి మడిపల్లి కృష్ణమ్మ తెలిపిన వివరాల ప్రకారం నలుగురు ఆడపిల్లల తర్వాత జన్మించిన తన కుమారుడు మడిపల్లి వెంకటేష్(22) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు లోని పొట్టకూటి కోసం ఓ ఆర్థోపెడిక్ ప్రైవేట్ ఆసుపత్రిలో రెండు సంవత్సరాల నుంచి ఆపరేషన్ థియేటర్లో హెల్పర్ గా పనిచేస్తున్నాడని తెలిపింది. గత నెలలో ఒక పేషెంట్ విషయంలో ఆసుపత్రి వైద్యుడికి తన కుమారుడికి మధ్య గొడవ జరిగిందని ఆ గొడవలు తన కుమారుడు పై చేయి చేసుకోవటమే కాకుండా భూమ్మీద లేకుండా చేస్తానని బెదిరించడమే కాకుండా మరి ఏ ఆసుపత్రిలో వర్క్ చేసుకోనీకుండా అడ్డుకున్నాడని తెలిపింది. ఊహించని విధంగా మార్చి నెల 29వ తేదీ అర్ధరాత్రి తన కుమారుడు తిరువూరులోని ఫ్రెండ్ రూములో ఉరివేసుకొని మరణించినట్లు 30వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సమాచారం అందగా వెంటనే బయలుదేరి వెళ్ళామని,తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసు వారిని తమ బంధువులు వేడుకుంటున్న వినకుండా తాము వెళ్లేసరికి స్థానిక పోలీస్ బాస్ హడావుడిగా శవాన్ని మార్చురికి తరలించి వేశాడని తెలిపింది. మార్చురీలో ఉన్న తన కుమారుడి శవాన్ని పరిశీలించగా తల,శరీర భాగాలు దెబ్బలతో కమిలి పోయి ఉండటానికి గమనించి పోలీస్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోకుండా తమపైనే దురుసుగా ప్రవర్తించారని ఆమె తన గోడును వినిపించింది. తన కుమారుడి మృతి వెనక ఆర్థిక అంగ బలం ఉన్న ఒక వైద్యుడి పాత్ర ఉండటం వలనే పోలీస్ బాస్ తన సొంతంగా కథని అల్లుకొని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాడని ఆమె ఆరోపించింది. పోస్టుమార్టం రిపోర్టులో దెబ్బలు ఉన్నాయని వచ్చిన,మరణించిన రూములో రక్తపు మరకలతో ఉన్న వస్తువులు దొరికిన ఆ రక్షకబటుడు మాత్రం తన కుమారుడి మృతి వెనుక ఉన్న అనుమానితులకు రక్షణగా మారాడని ఆమె తన బాధను అక్షిత మీడియా ముందు వివరించింది. తన కుమారుడిది హత్యే జరిగిందని నిరూపించడానికి అనేక ఆధారాలు ఉన్న కనీస ప్రయత్నం కూడా చేయకుండా తిరిగి తమపైనే దాడికి ప్రయత్నిస్తూ అత్యుత్సాహం చూపించడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావట్లేదని మృతుడి తల్లి తన ఆవేదనను తెలియపరిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు,తన కుమారుడి మరణం వెనుక ఉన్న మిస్టరీని చేదించి తనకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అధికారులను వేడుకుంటుంది.

## పాక్‌కి షాక్ ఇవ్వనున్న భారత్.. సింధు నదులపై కాలువలు, ప్రాజెక్టులకు శ్రీకారం..



**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ "సింధు జలాల ఒప్పందాన్ని" నిలిపేసింది. 26 మందిని బలి తీసుకున్న ఈ ఉగ్ర ఘటనకు పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాదులు పాల్పడినట్లు తేలింది. పాకిస్తాన్ దేశంలో 80 శాతం మంది ప్రజలకు ఈ సింధు నది, దాని ఉపనదుల జలాలే జీవనాధారం. ప్రస్తుతం, ఈ ఒప్పందాన్ని నిలిపేయవద్దని పాకిస్తాన్ భారత్‌ని కోరుతోంది. ఇదిలా ఉంటే, భారత్ మాత్రం పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చినంత కాలం ఈ ఒప్పందం నిలిచే ఉంటుందని స్పష్టం చేసింది. తాజాగా, సింధు నది జలాల విషయంలో భారత్ దాయాదికి మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, సింధు జలాలను సమర్థవంతంగా వాడుకోవాలని భారత్ భావిస్తోంది. పాకిస్తాన్ పంటలకు నీటిని అందించే ప్రధాన నది నుంచి నీటిని మళ్లించే ప్రణాళికల్ని భారత్ పరిశీలిస్తోంది. భారత్ గుండా పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు వెళ్లే చీనాబ్ పై ఉన్న రణబీర్ కాలువ పొడవును 120 కి.మీకి రెట్టింపు చేయాలని చూస్తోంది. ఈ ఒప్పందంపై సంతకం చేయడానికి ముందే అంటే, 1960కి ముందే ఈ కాలువ నిర్మించబడింది. భారత్ చీనాబ్ నది నుంచి పరిమిత మొత్తంలో నీటిని తీసుకోవడానికి అనుమతి ఉంది. కాలువ విస్తరణకు సంవత్సరాలు పట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది సెకన్‌కి 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఇది 40 క్యూబిక్ మీటర్లుగా ఉంది. రణబీర్ కాలువ విస్తరించడంపై ప్రభుత్వం చర్చిస్తున్నట్లు ప్రస్తుతానికి నివేదించబడలేదు. కాలువను విస్తరించడంతో పాటు, ఆ దేశానికి కేటాయించిన సింధు, చీనాబ్, జీలం నుంచి నీటిని మెరుగ్గా వాడుకునేందుకు భారత్ సిద్ధమైంది. ఈ నీటిని ఉత్తర భారత రాష్ట్రాలతకు తరలించే అవకాశాన్ని భారత్ పరిశీలిస్తోందని రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. కొత్తగా ఈ ఐదు రిజర్వాయర్ ప్రాజెక్టుల్ని భారత్ గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం నదులపై ఉన్నట్లు తెలిపింది. ఇటీవల, ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ఉద్దేశిస్తూ, "నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు" అని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నంత కాలం ఒప్పందాన్ని భారత్ నిలిపి ఉంచుతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందాన్ని నిలిపేయడం చట్టవిరుద్ధమని వాదిస్తూ, భారత్‌కి లేఖ రాశారు. అయితే, ప్రస్తుతం సింధు నది వ్యవస్థ నుంచి భారత్ గణనీయమైన మొత్తంలో నీటిని నిలిపేయడం లేదా మళ్లించడం కోసం ఆనకట్టలు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశానికి సంవత్సరాలు పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, పాకిస్తాన్‌కి వెళ్లే కొద్ది మొత్తాన్ని అడ్డుకున్నా కూడా ఆ దేశంలోని వ్యవసాయం అస్తవ్యస్తం అవుతుందని చెబుతున్నారు.

## వంశీ ఆరోగ్యం అసలు బాగోలేదు: భార్య పంకజశ్రీ




ఏలూరు జిల్లా: తన భర్త ఆరోగ్యం అసలు బాగోలేదని వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీ అన్నారు. కిటోన్ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని తెలిపారు. బరువు కూడా తగ్గిపోయారని.. వంశీ ఆరోగ్యంపై తమకు తీవ్ర ఆందోళనగా ఉందని తెలిపారు. లాయర్ చిరంజీవి మాట్లాడుతూ.. వంశీపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని.. పాత కేసులను తిరగదోడి కావాలనే ఇబ్బందిపెడుతున్నారన్నారు. పిటీ వారెంట్ దాఖలులో నిబంధనలు ఫాలో కాలేదని చిరంజీవి అన్నారు వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టు.. 14 రోజుల రిమాండ్‌ను విధించింది. హనుమాన్ జంక్షన్ పోలీసుల పీటీ వారెంట్‌తో వంశీకి రిమాండ్ విధించింది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై అక్రమ కేసులతో అధికార కూటమి ప్రభుత్వం వేధింపుల పరంపరను కొనసాగిస్తోంది. ఇప్పటికే ఆయనపై పలు అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయటంతో గత 90 రోజులకుపైగా వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇప్పటి వరకు ఆయనను అరెస్ట్ చేసిన కేసుల్లో న్యాయస్థానం వరుసగా బెయిల్ మంజూరు చేయటంతో తాజాగా హనుమాన్‌జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో గురువారం పీటీ వారంట్ దాఖలు చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో వంశీపై నమోదైన పాత కేసును ఇప్పుడు తెర మీదకు తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే వల్లభనేని వంశీ శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు కొండ సురేఖ.. థ్యాంక్స్ చెప్పిన కెటిఆర్



హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండ సురేఖ వివాదంలో చిక్కుకున్నారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అరవిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె డబ్బులు తీసుకోకుండా మంత్రులు ఏ పని చేయరూ అంటు వ్యాఖ్యానించారు. 'మా దగ్గరకు చాలా ఫైల్స్ వస్తుంటాయి. చాలా మంది మంత్రులు డబ్బులు తీసుకొనే ఫైల్స్ క్లియర్ చేస్తుంటారు. కానీ, నేను అలా చేయను. సమాజ సేవే చేస్తుంటాను. నాకు నయా పైస అక్కర్లేదు. స్కూల్ డెవలంప్‌మెంట్ చేయమన్నాను' అని సురేఖ అన్నారు. దీంతో ఇది చాలా వివాదాస్పదమైంది. దీనిపై ఆమె తాజాగా వివరణ ఇచ్చారు. బిఆర్ఎస్‌లో ఉండే మంత్రుల గురించి తాను మాట్లాడానని.. అలా తప్పుడు ప్రచారం చేయడం తప్పు అని ఆమె పేర్కొన్నారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకొనే వారని అన్నారు. అయితే కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కెటిఆర్ థ్యాంక్స్ చెప్పారు. మొత్తానికి కొండ సురేఖ నిజాలు బయట పెట్టారని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కమీషన్ సర్కార్ నడుపుతోందని కెటిఆర్ పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సింధూర్' ద్వారా నయా భారత్ అంటే ఏంటో తెలిసింది



భుజ్: గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఆయన తొలిసారిగా అక్కడకు వెళ్లారు. అక్కడ ఆర్మీ, వాయుసేన, బీఎస్ఎఫ్ సిబ్బందితో రాజ్‌నాథ్ ముచ్చటించారు. ఈ పర్యటనలో రాజ్‌నాథ్‌తో పాటు ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎ.పి. సింగ్ ఉన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వాయుసేన ప్రధానపాత్ర వహించిందని ఆయన అన్నారు. ఎయిర్‌ఫోర్స్ ఎంతో ధైర్యం పరాక్రమం ప్రదర్శించిందని కొనియాడారు. కేవలం 23 నిమిషాల్లోనే ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వం ఉగ్రవాదులకు నూతన సందేశం ఇచ్చిందని తెలిపారు. భారత వాయుసేన స్థావరాలను పాక్ డ్రోన్లు ఏమీ చేయలేకపోయాయని.. బ్రహ్మోస్ క్షిపణి సత్తాకు పాక్ తలవంచక తప్పలేదని అన్నారు. "మన అత్యాధునిక ఆయుధాలు అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్లాయి. ఆపరేషన్ సింధూర్‌తో మన సత్తా ప్రపంచమంతా చూసింది. పాకిస్థాన్‌కు ఆర్థికసాయం చేస్తే ఉగ్రవాదులకు చేసినట్లే. పాక్‌కు ఆర్థికసాయంపై ఐఎంఎఫ్ పునరాలోచించుకోవాలి. ఉగ్రవాదులకు పాక్ సాయం చేస్తూ ప్రపంచానికి ముప్పు కలిగిస్తోంది. శాంతికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని ఆపరేషన్ సింధూర్ ద్వారా నిరూపించాం. పాక్‌లోని ఏ ప్రాంతపైనైనా దాడి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉంది. ఆపరేషన్ సింధూర్ ద్వారా 'నయా భారత్' అంటే ఏంటని ప్రపంచానికి తెలిసింది" అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

# 'సుప్రీం'కు న్యాయ మీమాంస



శాసనసభలు ఆమోదించి పంపే బిల్లులపై రాష్ట్రపతి లేదా గవర్నర్లు నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్ణ యాన్ని ప్రకటించాలనీ, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టుగా భావించవచ్చని గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి కోర్టు మెట్లెక్కింది. ఈ తీర్పుపై కేంద్రప్రభుత్వం తాజాగా రాష్ట్రపతి ద్వారా సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరింది. నిజానికి, ఆ తీర్పు ఇటీవల రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ దానిపై విరుచుకు పడ్డారు. 'ఈమధ్య ఒక తీర్పు ఏకంగా రాష్ట్రపతికే ఆదేశాలు జారీచేసింది. జడ్జీలే సూపర్ పార్లమెంటుగా వ్యవహరిస్తు న్నారు. ప్రజాస్వామ్య శక్తులే లక్ష్యంగా దాడి జరుగుతోంది' అంటూ విమర్శించారు. కీలకాంశాలపై రాజ్యాంగ న్యాయస్థానాలు వెలువరించే అసాధారణ తీర్పులు ఒక్కోసారి అసాధారణ పరిణా మాలకు దారి తీస్తాయి. తమ శాసనసభ ఆమోదించి పంపిన బిల్లుల్ని గవర్నర్ ఆర్.ఎన్. రవి ఎటూ తేల్చకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యంలో జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ఇద్దరు న్యాయ మూర్తుల ధర్మాసనం ఈ సంచలన తీర్పు వెలువరించింది. అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లులు నెలల తరబడి, ఏళ్ల తరబడి గవర్నర్ల వద్ద పెండింగ్‌లో వుండిపోవటం తమిళనాడు సమస్య మాత్రమే కాదు... విపక్షాల ఏలుబడిలో వున్న కొన్ని ఇతర ప్రభుత్వాల పరిస్థితి సైతం ఇలాగేవుంది. భిన్న సందర్భాల్లో సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేస్తూనే వచ్చింది. విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడివున్న అంశాల్లో వివరణ కోరడానికీ లేదా సందేహ నివృత్తికీ, రాష్ట్రాలమధ్య తలెత్తే వివాదాల్లో అభిప్రాయం కోరడానికీ 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' రూపంలో కేంద్రప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం ముందు వ్యాజ్యం దాఖలు చేస్తుంది. రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద వున్న ఈ అధికారాన్ని అరుదైన సందర్భాల్లో మాత్రమే కేంద్రం వినియోగించుకుంటుంది. ఈ తీర్పుద్వారా సుప్రీంకోర్టు తన అధికార పరిధిని దాటిందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ నివేదనలో 14 ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులు తమ పరిశీలన కొచ్చినప్పుడు రాష్ట్రపతి లేదా గవర్నర్లు ఏం చేయాలో రాజ్యాంగంలోని 200, 201 అధికరణలు నిర్దేశిస్తున్నాయి. వాటిననుసరించి బిల్లుల్ని ఆమోదించే లేదా తోసిపుచ్చే అధికారం వుంటుంది. 200 అధికరణ ప్రకారం బిల్లు గవర్నర్ పరిశీలనకొచ్చినప్పుడు 'సాధ్యమైనంత త్వరగా' దానిపై అభిప్రా యాన్ని ప్రకటించాలంటున్నది. దాన్ని నిరాకరించాక తిరిగి అదే రూపంలో రెండోసారి బిల్లు వచ్చిన ప్పుడు గవర్నర్ తన ఆమోదాన్ని పెండింగ్‌లో వుంచరాదని చెబుతోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినపక్షంలో ఏం చేయాలో 201 అధికరణ సూచిస్తోంది. ఆమో దానికి లేదా తిరస్కారానికీ అందులో నిర్దిష్టమైన వ్యవధిని సూచించటం లేదన్నది 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్' ప్రస్తావిస్తోంది. అలాంటప్పుడు గవర్నర్లయినా, రాష్ట్రపతైనా మూణ్ణెల్లలోగా బిల్లులపై తమ నిర్ణయం ప్రకటించాలని, లేనట్టయితే వాటిని ఆమోదించినట్టే భావించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తుందని ప్రశ్నిస్తోంది. పైగా ఇలాంటి ఆదేశాలు రాజ్యాంగ ధర్మాసనం ఇవ్వాలి తప్ప ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఇవ్వొచ్చునా అనే సందేహాన్నీ వ్యక్తం చేసింది. మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని ఒక దార్శనిక పత్రంగా రూపొందించారు తప్ప మనల్ని మనం ఎలా పరిపాలించుకోవాలో... దేన్ని ఏవిధంగా ఆచరించాలో సూచించే నిబంధనల పత్రంగా తయారుచేయలేదు. కనుకనే ఆచరణలో ఎదురయ్యే సమస్యల్ని దృష్టిలో వుంచుకుని దానికి భాష్యం చెప్పుకోవటం, సవరించుకోవటం తప్పటం లేదు. మన కార్యనిర్వాహక వ్యవస్థ ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో రాజ్యాంగానికి వందకుపైగా సవరణలు తీసుకురావాల్సి వచ్చిందంటేనే ఆసంగతి తెలుస్తోంది. ఇక సర్వోన్నత న్యాయస్థానం భిన్న సందర్భాల్లో వెలువరించిన తీర్పుల ద్వారా వివిధ అధికరణల విస్తృతిని పెంచింది. వీటన్నిటికీ రాజ్యాంగస్ఫూర్తే గీటురాయి. మన దేశంలో పటి ష్ఠమైన సహకార సమాఖ్య వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం ఆశించింది. కేంద్ర ప్రతినిధులుగా రాష్ట్రాల్లో గవర్నర్లు ఏం చేయాలో, రాష్ట్రపతి ఎలా వ్యవహరించాలో రాజ్యాంగంలోని అధికరణలు చెబుతున్నాయి. తమ ఆచరణ దేశంలో సహకార సమాఖ్య వ్యవస్థ పరిఢవిల్లాలని చెప్పే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటున్నదో లేదో పరిశీలించుకోవాల్సిన అవసరం గవర్నర్లకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ఒక చర్యకు ఉపక్రమించినప్పుడు దాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటం ఏ రకంగా సబబవుతుంది?ఇందువల్ల కేవలం ఒక రాజకీయపక్షం ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని పనిచేయకుండా నిరోధించటం మాత్రమే కాదు... ప్రజలిచ్చిన రాజకీయ అధికారాన్ని గుర్తించ నిరాకరించటం కూడా! ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రాజ్యాంగ పరిధిని దాటి, మందబలంతో దేశ భద్రతకు ముప్పు కలిగించే నిర్ణయాలు తీసుకుంటే వాటిని ఆపడాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ప్రజాహితం, వారి సంక్షేమం, భద్రత కోరి చేసే బిల్లుల్ని కూడా పెండింగ్‌లో వుంచటం ఏం సబబు? గవర్నర్లు తమవద్దకొచ్చే బిల్లుల్ని అకార ణంగా పెండింగ్‌లో వుంచటం సారాంశంలో రాజకీయ సమస్య. కనీసం దీన్ని గవర్నర్లవరకూ పరి మితం చేసి రాష్ట్రపతి ప్రమేయాన్ని నివారించి వుంటే బాగుండేది. కానీ రాష్ట్రపతి దగ్గర సైతం బిల్లులు పెండింగ్‌లో పడటం వల్ల సమస్య మరింత జటిలమైంది. తాజా నివేదనను పరిశీలించబోయే రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయంలో ఏం చెబుతుందో వేచిచూడాలి.

# ట్రోలర్లపై చర్యలేవి?




విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రితో పాటు ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఆన్‌లైన్ దాడులు మన దేశ డిజిటల్ వాతావరణంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి నిదర్శనం. స్వాతి చతుర్వేది తన పుస్తకం 'ఐ యామ్ ఏ ట్రోల్' (నేనొక అంతర్జాల పోకిరిని)లో "భారతదేశంలో సోషల్ మీడియా మితవాద ట్రోలర్స్‌తో నిండిపోయింది. వారు ఆన్‌లైన్‌లో మత విద్వేషాన్ని రెచ్చగొడతారు, జర్నలిస్టులను, ప్రతిపక్ష రాజకీయ నాయకులను దుర్భాషలాడతారు, లైంగికంగా వేధిస్తారు.' అని పేర్కొన్నారు. ఈ విషపూరిత సంస్కృతి గతంలో ప్రముఖులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేది. ఇప్పుడు వారి కుటుంబ సభ్యులను, అలాగే జాతీయ విషాద ఘటనల్లో బాధితుల కుటుంబాలను కూడా వదిలిపెట్టకపోవడం గమనార్హం. విదేశాంగ కార్యదర్శిగా ఉన్న విక్రమ్ మిస్రి పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య కాల్పుల పర్వం ప్రారంభమైనప్పటి నుండి జరిగిన మీడియా సమావేశాల్లో మరో ఇద్దరు సైనికాధికారులతో కలిసి భారత ప్రభుత్వ వాణిని వినిపించేవారు. ఈ క్రమంలో భాగంగానే కాల్పుల విరమణ గురించి ప్రకటనను భారత ప్రభుత్వం తరపున ఆయన చేశారు. దీంతో ట్రోలర్స్ ఆయన్ను, ఆయన కుమార్తెను లక్ష్యంగా చేసుకున్నారు. రాయలేని భాషల్లో సోషల్ మీడియాలో దూషించారు. మిస్రి కుమార్తె వ్యక్తిగత వివరాలు బయటపెట్టడంతోపాటు, ఆమె దేశభక్తిని ప్రశ్నించారు. ఈ దాడితో వారు తమ సోషల్ మీడియా ఖాతాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ వేధింపులు అధికారుల కుటుంబాలకూ పరిమితం కాదు. ఉగ్రవాద దాడుల బాధిత కుటుంబాలు, ఇతర బాధితుల కుటుంబాలు కూడా ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులకు గురయ్యాయి. పహల్గాం ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన లెఫ్టినెంట్ వినరు నర్వాల్ భార్య హిమాంషి నర్వాల్ కూడా ట్రోల్స్ బారిన పడ్డారు. ఈ సంఘటనలో కాశ్మీరీలను, ముస్లింలను లక్ష్యంగా చేసుకోవద్దని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరడమే ఆమె చేసిన నేరం! ఉగ్రవాదుల కాల్పుల్లో తండ్రిని కోల్పోయిన ఒక యువతి కాశ్మీర్‌లో తనకు ఇద్దరు సోదరులు లభించారంటూ చేసిన వ్యాఖ్యలు కూడా ట్రోలింగ్‌కు గురయ్యాయి. సమాజం నుండి మద్దతు, సానుభూతి లభించాల్సిన సమయంలో వీరంతా నిందలకు, వేధింపులకు గురికావడం బాధాకరం. గాయకుడు సోనూ నిగమ్, బాలీవుడ్ నటుటు భూమి పెడ్నేకర్, ఆలియా భట్ తదితరులు కూడా తదితరులు కూడా ఇటీవల ట్రోలింగ్ బారిన పడ్డారు. అధికార పార్టీకి చెందిన మంత్రులపైనో, నాయకులపైనో సోషల్ మీడియాలో విమర్శలు పెట్టీ పెట్టగానే రకకరాల కేసులతో చెలరేగిపోయే ప్రభుత్వ యంత్రాంగం ఈ అన్ని సందర్భాల్లోనూ మౌనం వహించడం, నామమాత్రంగా కూడా స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ కుమార్తె గతంలో రోహింగ్యా శరణార్థుల కోసం పనిచేయడమే మితవాద ట్రోలర్స్ ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. ఈ కారణంగానే అత్యున్నత స్థాయి అధికారైనప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. అత్యున్నత స్థాయి వ్యక్తులకే ఈ పరిస్థితి తప్పనప్పుడు సామాన్యుల సంగతేమిటన్న ప్రశ్నకు జవాబు లభించడం కష్టం. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024లో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 66,854 సైబర్ వేధింపుల కేసులు నమోదయ్యాయి. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక కేసు నమోదైనట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా ఈ తరహా కేసులు భారీగా పెరిగే అవకాశముందని అంచనా! 'ట్రోలర్స్ యాదృచ్ఛిక వ్యక్తులు కారు. వీరిలో చాలామంది వ్యవస్థీకత డిజిటల్ ఆర్మీలో భాగంగా ఉంటారు.

వారి ఆన్‌లైన్ దాడులకు ప్రోత్సాహం, కొందరికి బహుమతులు కూడా లభిస్తాయి," అని చతుర్వేది రాశారు. "ట్రోలింగ్ అనేది ఉద్దేశపూర్వకమైన, వ్యవస్థీకత చర్య. మౌనంగా ఉండేలా చేయడం, బెదిరించడం, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం' వీరి లక్ష్యమని సుదీర్ఘ పరిశోధన తరువాత ఆమె నిర్ధారించారు. ఈ తరహా వైఖరి పౌర హక్కులకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని కలుగ చేస్తుంది. వాటిని రక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కఠినచర్యలు తీసుకోవాలి. బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలి.

# ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి




తూర్పున ఉదయించే కాంతి రేఖలు మనకు ప్రతీ రోజూ నవశకానికి స్వాగతం పలుకుతుంది. తూర్పు దిక్కున అరుణారుణ కాంతులు మెల్లగా వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి రమణీయమైన దృశ్యం మాత్రమే కాదుబీ మానవజాతి అనంతమైన ప్రగతి పథానికి అది శుభసూచకం. కాంతి కేవలం ఒక భౌతిక దృగ్విషయం మాత్రమే కాదు. ఇది నూతన ఆలోచనలకు, ఊహలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరినిచ్చే ఒక అక్షయ శక్తి. కాంతి, ఈ విశ్వంలోని ప్రాథమిక శక్తి, కేవలం మన కంటికి గోచరించే ప్రకాశం కాదు. ఇది శాస్త్ర, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, సమాచార, పర్యావరణ రంగాలలో ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, పేదరికం, అసమానత్వం, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి పెను సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కాంతి ఆధారిత సాంకేతికతలు ఒక దిక్సూచిలా, ఒక ఆశాకిరణంలా పని చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి ప్రాముఖ్యతను మరింత లోతుగా గుర్తుచేస్తుంది. 2025వ సంవత్సరం థీమ్ అయిన 'కాంతి, ఆవిష్కరణ, సమాజం' అనేది ఈ ప్రాముఖ్యతను మరింతగా విశదీకరిస్తుంది. కాంతి బహుముఖ ప్రజ్ఞను మన ముందుంచుతుంది. ఈ థీమ్ శాస్త్రీయ పరిశోధనల పురోగతి, సాంకేతిక ఆవిష్కరణల విశిష్టత, సమాజ సమగ్ర శ్రేయస్సును పెంపొందించడంలో కాంతి ఆధారిత సాంకేతికతల అనితరసాధ్యమైన పాత్రను నొక్కి చెబుతుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన ప్రజలను %-% శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కాంతి శాస్త్రం, సాంకేతికత యునెస్కో లక్ష్యాలైన శాంతి, సమానత్వం, విద్యను ఎలా సాధించగలదో తెలిపే విభిన్న కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనమని స్ఫూర్తినిస్తుంది, ప్రోత్సహిస్తుంది. కేవలం ఒక శతాబ్దం క్రితం ఊహించలేని లేజర్ల ఆవిష్కరణ నుండి నేటి అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు అద్భుతమైన విజయాలకు, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సంవత్సరంతో కూడా అనుసంధానించబడి ఉండటం, ఈ అంశం సమకాలీన ప్రాముఖ్యతను మరింతగా చాటుతోంది. నేడు మానవ సమాజం అనేక సంక్లిష్టమైన, అంతర్లీన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రపరిణామాలు, ఆరోగ్య సంరక్షణలో అంతరాలు అసమానతలు, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడంలో ఉన్న అవరోధాలు కొన్ని ముఖ్యమైనవి. ఈ క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా స్థిరంగా అధిగమించడానికి కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఒక శక్తివంతమైన సాధనంగా, ఒక ఆశాజనకమైన మార్గంగా ఆవిర్భవిస్తున్నాయి. శక్తిని మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేయడానికి వినియోగించడానికి నూతన, పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు నిరంతరం అభివృద్ధి చేయబడుతున్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి ప్రాథమిక రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతల అనువర్తనాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ రంగంలో 'అగ్రి-ఫోటోనిక్స్' ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం, నీటి వినియోగాన్ని హేతుబద్ధీకరించడం, హానికరమైన తెగుళ్ళను పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు కచ్చితమైన లేజర్ ఆధారిత చికిత్సా విధానాలు వ్యాధులను మరింత ముందుగా మరింత కచ్చితంగా గుర్తించడానికి సమర్థవంతంగా నయం చేయడానికి సహాయపడుతున్నాయి. ఇది రోగుల వేగవంతమైన పునరుద్ధరణకు దోహదం చేస్తోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, కాంతి వేగంతో అపారమైన సమాచారాన్ని క్షణాల్లో చేరవేసే ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యారంగంలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనా పద్ధతులను మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా తద్వారా మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి. ఈ స్ఫూర్తిదాయకమైన అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి అపారమైన శక్తిని దాని ఆధారిత సాంకేతికతల విశిష్టమైన ప్రాముఖ్యతను మనమందరం గుర్తెరుగుదాం. ముఖ్యమైన ఆవిష్కరణలు కేవలం ఉన్నత స్థాయి శాస్త్రీయ ప్రయోగశాలలకు లేదా ప్రత్యేక పరిశోధనా సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. వాటి విస్తృత ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్య సంరక్షణ స్థిరమైన అభివృద్ధి వంటి కీలక రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, మనం మరింత సమతా పూర్వకమైన, అభివృద్ధి చెందిన మానవీయ విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించగలము. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు విధాన రూపకర్తలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కలిసి పనిచేసి, కాంతిని మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకునే మార్గాలను అన్వేషిద్దాం. తద్వారా, మనం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలము. కాంతిని ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, సమాజానికి వెలుగు దివ్వెగా నిలుపుదాం. ఈ కాంతి ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, ప్రయత్నాలు భాగస్వామ్యం అమూల్యమైనవి. కలిసి సాగుదాం, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.

# 'హరీష్ పై కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమో..'



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందంటూ ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని స్పష్టం చేసిన రామచంద్రనాయక్.. ఎప్పుడూ లేని విధంగా హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడమే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. 'పార్టీ ప్లీనరీ సమయంలో హరీష్ రావు కు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనకు అంత సీను లేదని చెప్పారు. రెండు గంటలకు పైగా హరీష్ రావుతో చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లలేదు.హరీష్ రావు ఇంట్లో గతంలో పంక్షన్ జరిగినా కేటీఆర్, ఆయన కుటుంబం దూరంగా ఉంటూ వచ్చింది. ఇప్పుడు సడన్‌గా హరీష్ రావు పైన కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమ వచ్చిందో చెప్పాలి. హరీష్ రావు కొత్త పార్టీ పెడుతున్నాడని ప్రచారం జరుగుతోంది. కల్వకుంట్ల కవిత ఇప్పటికే పార్టీ కి వ్యతిరేకంగా బహిరంగంగా విమర్శలు చేస్తున్నాడు. తన మీద దుష్ప్రచారం జరుగుతోందని, దాని వెనుక ఎవరున్నారో తనకు తెలుసునని కవిత అంటోంది. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబ సభ్యుల మధ్య ఆధిపత్యపోరు జరుగుతోంది. రాజకీయ ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటున్నారు. హరీష్ రావు తో చర్చల మతలబు ఏమిటో ప్రజలకు కేటీఆర్ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు హరీష్‌తో భేటీ అయ్యారు. ఇటీవల అస్వస్థతకు గురైన హరీష్ రావు తండ్రి ఆరోగ్య వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కోకాపేట హరీష్‌రావు నివాసంలో సమావేశమైన ఇరువురు నేతలు.. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. హరీష్ రావు పార్టీ మారతారన్న ప్రచారంపై సైబర్ సెల్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాను పార్టీ లైన్ దాటనని ఇటీవల హరీష్‌రావు ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని హరీష్‌రావు మరోసారి స్పష్టం చేశారు. కేటీఆర్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన కానీ.. పని చేస్తానని హరీష్‌రావు తెలిపారు. వరంగల్ సభ తర్వాత పార్టీలో హరీష్‌రావు ప్రాముఖ్యత తగ్గిందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం మండిపడుతోంది. దీంతో నేరుగా హరీష్ రావుతో మాట్లాడి సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కేటీఆర్ సమావేశమైనట్లు సమాచారం.

# 'సీఎంకు, డిప్యూటీ సీఎంకు మధ్య విభేధాలు'



హైదరాబాద్: రాష్ట్రం దివాలా తీసిందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి వర్గం అసంతృప్తిగా ఉందన్నారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. శుక్రవారం మీడియాతో చిట్ చాట్ లో భాగంగా మాట్లాడుతూ..' సీఎం రేవంత్ కు, డిప్యూటీ సీఎంకు మధ్య విభేధాలు ఉన్నాయి. అందుకే సీఎం కామెంట్స్ ను మంత్రులు ఎవరూ సమర్థించలేదు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్ రెండుగా చీలిపోయింది. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు బాధపడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణను సీఎం రేవంత్ అడ్డుకుంటున్నారు. కొత్తగా వచ్చేవారు సైతం వ్యతిరేకంగా ఉంటారని సీఎం రేవంత్ భావన. అందుకే గందరగోళ నివేదికలు హైకమాండ్ కి పంపి అడ్డుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎక్కడ బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సి వస్తుందోనని జగన్నాటకం ఆడుతున్నారు. రేవంత్ లోపాలు, తప్పిదాలు అన్ని హైకమాండ్ దగ్గర ఉన్నాయి. లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే సీఎంను మార్చాలని హైకమాండ్ ఎదురుచూస్తోంది' అని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'

## విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సీటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని పుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# గూగుల్ కొత్త ఫీచర్.. కొట్టేసిన ఫోన్ పనిచేయదు!



ఫోన్ల చోరీకి చెక్ పెట్టేందుకు గూగుల్ కొత్త ఫీచర్‌ను తీసుకురాబోతోంది. చోరీకి గురైన ఫోన్లను దాదాపు నిరుపయోగంగా మార్చే లక్ష్యంతో గూగుల్ ఆండ్రాయిడ్ 16తో ముఖ్యమైన యాంటీ-థెఫ్ట్ ఫీచర్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ అప్‌డేట్‌లో మెరుగైన భద్రతా సాధనాలు ఉంటాయి. ఇవి "ఓనర్ అనుమతి లేకుండా రీసెట్ చేసిన ఫోన్‌లు పనిచేయకుండా అవుతాయి" అని ఆండ్రాయిడ్ పరికరాల సమాచారాన్ని తెలిపే 'ఆండ్రాయిడ్ పోలీస్' అనే వెబ్‌సైట్ నివేదిక తెలిపింది. గూగుల్ ఇటీవల 'ది ఆండ్రాయిడ్ షో: ఐ/ఓ ఎడిషన్' సందర్భంగా ఈ కొత్త ఫీచర్‌ను ఆవిష్కరించింది. ఇది ప్రాథమికంగా ఫ్యాక్టరీ రీసెట్ ప్రొటెక్షన్ (ఎఫ్ఆర్‌పీ) ను పెంచుతుంది. ఇది చోరీకి గురైన ఫోన్లను నిరుపయోగంగా చేయడానికి రూపొందించిన భద్రతా ఫీచర్. గూగుల్ ఆండ్రాయిడ్ 15 లో ఎఫ్ఆర్‌పీకి అనేక మెరుగుదలలు చేసింది. తదుపరి ఆండ్రాయిడ్ అప్డేట్ దీనిని మరింత బలోపేతం చేస్తుంది. ఈ కొత్త ఫీచర్ గురించి గూగుల్ అధికారికంగా ఏమీ చెప్పనప్పటికీ, గూగుల్ ప్రణాళికలను తెలియజేసే ఒక స్క్రీన్ షాట్ ను ఆండ్రాయిడ్ పోలీస్ పబ్లిష్ చేసింది. ఈ స్క్రీన్ షాట్ ఫోన్ స్క్రీన్ పై ఫ్యాక్టరీ రీసెట్ వార్నింగ్ ఫ్లాషింగ్ ను చూపిస్తోంది. ఫోన్‌ను దొంగిలించినవారు ఒకవేళ సెటప్ విజార్డ్ ను చేయకపోతే రీసెట్ చేయకుండా ముందుకెళ్లలేరు. అంటే యూజర్ ఫోన్‌ను రీసెట్ చేసి మునుపటి లాక్ స్క్రీన్ లాక్ లేదా గూగుల్ ఖాతా క్రెడెన్షియల్స్‌ను నమోదు చేసే వరకు ఫోన్ పనిచేయదు. ఆండ్రాయిడ్ పోలీస్ ప్రకారం.. కొత్త ఫీచర్ ఈ సంవత్సరం చివరలో విడుదలయ్యే అవకాశం ఉంది.

# ముక్తిదాయకం.. పుష్కర స్నానం





సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభరాశిలో ఉన్నప్పుడు సింధునదికి, మీనరాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి పుష్కరాలు చెప్పబడ్డాయి. పుష్కరం అనగా జలస్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోకకళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి. పూర్వం తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట-మూర్తులతో ఒకటైన జల స్వరూపంతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరం పొంది, పరమేశ్వరుని సాయుజ్యం పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతం చేయుటకై శివుని వరంతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలంలో ఉంచుకొని సృష్టికార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆ పుష్కరుని సన్నిధిని శక్తివంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించుచున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ -గంగా) అను సూత్రానుసారం పుష్కరాలు నిర్వహిస్తారు. ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్య, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది. అలాగే ప్రయాగరాజ్‌లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉన్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. మొత్తం మీద, సరస్వతీ నదీ పుష్కరాలు ఒక పవిత్రమైన సందర్భం. ఇది నదీమాతకు కృతజ్ఞతలు తెలుపుకునే సమయం, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్ర స్నానాలకు ప్రాధాన్యతనిచ్చే సమయం. కాళేశ్వరం వంటి క్షేత్రాలలో ఈ పుష్కరాలను నిర్వహించడం ఆ ప్రాంతానికి మరింత పవిత్రతను చేకూరుస్తుంది. భక్తులు ఈ సమయంలో పాల్గొని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సరస్వతీ నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు. అది జ్ఞానానికి, వివేకానికి, పవిత్రతకు చిహ్నం. ఈ పుష్కరాల సమయంలో ఆ నదిలో స్నానం చేయడం ద్వారా భక్తులు తమ ఆంతరంగిక శుద్ధిని పొందుతారని విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తారు. సరస్వతీ నదీ పుష్కరాలు ముక్తిని ప్రసాదించే ఒక గొప్ప అవకాశం.

కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. 'మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యౌ మునీనాంహి బుధైః స్మృతా' దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిధున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి,

# ట్రంప్ ఎవరికీ అర్థంకారు



అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు. ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విడ్డూరంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్- పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్- ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని

# 'కుట్రతోనే లిక్కర్ స్కామ్ అంటూ అక్రమ కేసు'



ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కింది. కూటమి పాలనలో అవినీతి, దోపిడీ తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. రాజకీయ కక్ష సాధింపులకే మొత్తం సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా తప్పించుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు, ఏటా 4 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేల భృతి, ఆడబిడ్డ నిధి కింది ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. కానీ, ఏడాది గడుస్తున్నా వాటిలో ఏదీ అమలు చేయడం లేదు. మరోవైపు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా అంతులేని అవినీతి. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా కేవలం 99 పైసలకే దాదాపు 3 వేల కోట్ల విలువైన భూముల అప్పగింత. ఇంకా కాకినాడలో బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ.. 'సీజ్ ది షిప్' అని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నానా హంగామా చేశారు. ఒక్క బియ్యం గింజ కూడా అక్రమంగా రవాణా చేయడానికి వీలులేదని అన్నారు. కానీ ఒక్క దానిపైనా చర్యలు లేవు. పోలీసుల జులుంతో ప్రభుత్వాన్ని నడిపించాలని చూస్తున్నారు. అందుకే ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తున్నారు.

కాకినాడ: తమ ప్రభుత్వ హయాంలో పూర్తి పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తూ,వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో పని చేస్తోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల్లో నిజంగా తప్పు జరిగి ఉంటే, నిష్పాక్షికంగా జరిపే ఎలాంటి విచారణనైనా స్వాగతిస్తామని ఆయన వెల్లడించారు. కానీ రాజకీయ దురుద్దేశాలతో తప్పుడు విచారణల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండ గడతామని కాకినాడలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు.

### బొత్స ఇంకా ఏం మాట్లాడారంటే..

కూటమి ప్రభుత్వం దారుణ వ్యవహారం

కూటమి ఏడాది పాలనలో పార్టీల హనీమూన్ ముగిసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో కూటమి

### తెచ్చిన అప్పులు దేనికి ఖర్చు చేశారు?

ఏడాది పాలనలోనే ఏకంగా రూ.1.59 లక్షల కోట్లు అప్పులు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతలా ఏడాదిలో అప్పులు చేయలేదు. ఇంత అప్పులు తెచ్చి ఏ ప్రజా సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు చేశారు? మా హయాంలో అప్పులు చేసినా, వివిధ పథకాల కింద రూ.2.73 లక్షల కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. మరి కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు దేనికి వినియోగించారో చెప్పాలి. సంపద సృష్టిస్తాను. అది తనకు బాగా తెలుసు అని ప్రచారం చేసిన చంద్రబాబు, మరి ఇన్ని అప్పులు, ఇంత తక్కువ సమయంలో ఎందుకు చేశారు? అప్పు చేయడం. ప్రచార ఆర్భాటాలకు ఖర్చు చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొంత అప్పు చేసినా, ఆ ఖర్చులకు ఒక అర్థం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, తీర ప్రాంతాల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, భోగాపురం ఎయిర్‌పోర్ట్.. ఇలా ఉత్పాదకతకు దోహదం చేసే వాటికి ఖర్చు చేశాం. మాట ఇస్తే, దాన్ని తప్పకుండా నెరవేర్చాలనేది జగన్‌గారి విధానం. అందుకే ఎన్నికల ముందు, టీడీపీ కూటమి మాదిరిగా, అడ్డగోలు హామీలు ఇవ్వలేదు.

### పార్టీ కార్యాచరణ. నిర్ణయాలు

వైఎస్సార్‌సీపీ అయిదు జిల్లాల ముఖ్య నేతలతో ఈరోజు (శుక్రవారం) సమావేశం నిర్వహించాం. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో సంస్థాగతంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీల ఏర్పాటు, ప్రతి జిల్లాలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై నిర్ణయం తీసుకున్నాం. అలాగే గోదావరి జిల్లాల్లో ధాన్యం సేకరణపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో పాటు, తీర ప్రాంతాల్లోని ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నిర్ణయించడం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో పొగాకు రైతులు మద్దతు ధర లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ పొగాకు రైతులు ఇదే సమస్యలపై ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పొగాకు రైతులను కలిసి నేరుగా వారితో మాట్లాడనున్నారు. తదుపరి పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ పరంగా కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పొగాకు మద్దతు ధర లభించని సందర్భంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆ మొద్దునిద్ర నుంచి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు రైతుల పక్షాన పోరాడతామని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు.

# భారత్ ఎఫెక్ట్...
# సెలెబీ షేరుకు చుక్కలు కనబడ్డాయి!




- భారత ప్రభుత్వ నిర్ణయంతో టర్కీ సెలెబీ సంస్థకు తీవ్ర నష్టం
- ఇస్తాంబుల్‌లో 10% పతనమైన కంపెనీ షేరు ధర
- సెలెబీ సెక్యూరిటీ క్లియరెన్స్‌లను రద్దు చేసిన కేంద్రం
- అదానీ, ఢిల్లీ ఎయిర్‌పోర్టులు ఒప్పందాలు రద్దు చేసుకున్న వైనం
- టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో సంబంధాల్లేవన్న సెలెబీ
- ‘ఆపరేషన్ సింధూర్’ వేళ పాక్‌కు టర్కీ మద్దతే కారణం!



పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ కు బాహాటంగా టర్కీ మద్దతిస్తుండడం తెలిసిందే. దాంతో, భారత్ లో వాణిజ్యపరంగా టర్కీకి ఎదురుగాలి వీస్తోంది. టర్కీ సంస్థలతో భారత్ సంస్థలు, వర్సిటీలు సంబంధాలు తెంచుకుంటున్నాయి. ఈ విధంగా భారత్ ఎఫెక్ట్ కు గురైన వాటిలో సెలెబీ సంస్థ కూడా ఒకటి. ఇది భారత్ విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందిస్తుంది. భారత ప్రభుత్వం తీసుకున్న ఓ కీలక నిర్ణయం టర్కీకి చెందిన సెలెబీ ఏవియేషన్ హోల్డింగ్ సంస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ దెబ్బకు ఇస్తాంబుల్ స్టాక్ మార్కెట్‌లో మే 16న కంపెనీ షేరు ఏకంగా 10 శాతం కుప్పకూలింది. గత నాలుగు వాణిజ్య దినాల్లోనే ఈ సంస్థ షేరు విలువ దాదాపు 30 శాతం ఆవిరైందని సమాచారం. భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో సేవలను సెలెబీ అనుబంధ సంస్థ అందిస్తూ వచ్చింది.

### సెక్యూరిటీ క్లియరెన్స్‌ల రద్దు వెనుక కారణాలు

‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో తుర్కియే ప్రభుత్వం పాకిస్థాన్‌కు బాహాటంగా మద్దతు పలకడమే కాకుండా, తమ సైనికులను కూడా పంపించిందని వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సెలెబీ సంస్థకు జారీ చేసిన సెక్యూరిటీ క్లియరెన్స్‌లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు ఒక్కసారిగా ప్రశ్నార్థకంగా మారాయి.

### ఒప్పందాలు రద్దు చేసుకుంటున్న విమానాశ్రయ సంస్థలు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెలువడిన వెంటనే, అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ లిమిటెడ్ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాలను రద్దు చేసుకుంది. దీంతో ముంబయి, అహ్మదాబాద్ విమానాశ్రయాల నుంచి సెలెబీ వైదొలగాల్సి వచ్చింది. ఈ విషయాన్ని రెండు విమానాశ్రయాల ప్రతినిధి ఒక ప్రకటనలో ధృవీకరించారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్ ప్రస్తుతం ముంబయి, అహ్మదాబాద్‌తో పాటు మంగళూరు, గువహాటి, జైపూర్, లఖ్‌నవూ, తిరువనంతపురం విమానాశ్రయాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

అదానీ బాటలోనే, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌కూడా సెలెబీతో తమ ఒప్పందాన్ని ముగించుకుంది. సెలెబీ స్థానంలో ఇకపై ఏఐఎస్ఏటీఎస్, బర్డ్‌గ్రూప్‌లతో కలిసి పనిచేయనున్నట్లు %ణ×ూా% ప్రకటించింది.

### “మాది టర్కీ కంపెనీ కాదు, ఎర్డోగాన్‌తో సంబంధాల్లేవు”

ఈ పరిణామాలపై సెలెబీ సంస్థ తాజాగా ఒక వివరణ విడుదల చేసింది. తమ సంస్థ పూర్తిగా టర్కీకి చెందిన కంపెనీ కాదని, అలాగే టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేసింది. “టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ కుమార్తె సుమెయ్యి మా కంపెనీని నియంత్రిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. మా మాతృసంస్థలో ఆ పేరుతో ఎవరికీ ఎలాంటి హక్కులు గానీ, వాటాలు గానీ లేవు. మా కంపెనీ యాజమాన్య హక్కులన్నీ పూర్తిగా సెలెబీయోగ్లు కుటుంబానికే పరిమితం. వారికి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు,” అని కంపెనీ తమ ప్రకటనలో పేర్కొంది. అయినప్పటికీ, భారత ప్రభుత్వ చర్యలతో కంపెనీ తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోంది.

# ‘గిల్ వద్దు.. టీమిండియా కెప్టెన్‌గా అతడే బెటర్’




ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియాకు కొత్త టెస్టు కెప్టెన్ ఎంపిక చేసే పనిలో బీసీసీఐ సెలక్షన్ కమిటీ పడింది. రోహిత్ శర్మ అనూహ్యంగా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. పలు నివేదికల ప్రకారం టెస్టు కెప్టెన్సీ రేసులో స్టార్ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అతడితో పాటు పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా పేరు కూడా విన్పిస్తోంది. కానీ గిల్ తో పోలిస్తే బుమ్రాకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి. గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించకూడదని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అనుభవం లేని గిల్ వైపు బీసీసీఐ సెలక్షన్ కమిటీ మొగ్గు చూపుతుండడం క్రికెట్ వర్గాల్లో అసంతృప్తికి దారితీసినట్లు తెలుస్తోంది. చాలా మంది మాజీలు భారత టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు గిల్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ఇదే విషయంపై భారత మాజీ ఓపెనర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా కొత్త టెస్టు కెప్టెన్‌గా బుమ్రా ఉండాలని, శుబ్‌మన్ గిల్‌ను అతడి డిప్యూటీగా ఎంపిక చేయాలని జాఫర్ అభిప్రాయపడ్డాడు. “భారత టెస్టు కెప్టెన్సీ రేసులో జస్ప్రీత్ బుమ్రా ముందంజలో ఉంటాడని భావిస్తున్నాను. ఒకవేళ తనంతట తానుగా కెప్టెన్సీ ఆఫర్ తిరస్కరిస్తే తప్ప సెలక్టర్లు మరో ఆప్షన్‌ను పరిశీలించరు. అతడిని కెప్టెన్‌గా చేసి గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయాలి. బ ం ( వ ా క ్ ం విశ్రాంతి అవసరమైనప్పుడల్లా గిల్ జట్టును నడిపిస్తున్నాడు. దీంతో గిల్‌కు పూర్తి స్థాయి కెప్టెన్‌గా ఎదిగేందుకు తగినంత సమయం లభిస్తోంది” అని జాఫర్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. కాగా గిల్‌కు కెప్టెన్‌గా అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా అనుభవం లేదు. జింబాబ్వే సిరీస్‌లో భారత జట్టు సారథిగా గిల్ వ్యవహరించాడు. ఆ తర్వాత ఎప్పుడూ భారత జట్టును నడిపించలేదు. ఐపీఎల్ మాత్రం కెప్టెన్‌గా అతడికి అనుభవం ఉంది. గుజరాత్ టైటాన్స్ సారథిగా గిల్ కొనసాగుతున్నాడు. ఇక? ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టును మే 23న బీసీసీఐ ప్రకటించే అవకాశముంది.

# ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లు ఆడాల్సిన మ్యాచ్‌లు ఇవే..!





భారత్, పాక్ మధ్య యుద్ధం కారణంగా వారం రోజులు వాయిదా పడిన ఐపీఎల్ 2025 రేపటి నుండి (మే 17) పునఃప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో (రీస్టార్ట్‌లో) కేకేఆర్, ఆర్సీబీ బెంగళూరు వేదికగా తలపడనున్నాయి. రీవైజ్డ్ షెడ్యూల్ ప్రకారం జూన్ 3న జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ ముస్తుంది. మే 27 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. మే 29 (క్వాలిఫయర్ 1), మే 30 (ఎలిమినేటర్), జూన్ 1 (క్వాలిఫయర్ 2) తేదీల్లో ప్లే ఆఫ్స్ జరుగుతాయి. ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు ముందు మరో 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రస్తుతం ప్లే ఆఫ్స్ రేసులో అధికారంగా ఏడు జట్లు ఉండగా.. చెన్నై, రాజస్థాన్, ఎస్ఆర్‌హెచ్ నిష్క్రమించాయి. ప్లే ఆఫ్స్ రేసులో పేరుకు ఏడు జట్లు ఉన్నప్పటికీ ప్రధానమైన పోటీ మాత్రం ఐదు జట్ల మధ్యే ఉంది. వీటిలోనూ రెండు బెర్త్‌లను ప్రస్తుతం టేబుల్ టాపర్లుగా ఉన్న గుజరాత్, ఆర్సీబీ (11 మ్యాచ్‌ల్లో తలో 8 విజయాలతో 16 పాయింట్లు) దాదాపు ఖరారు చేసుకున్నాయి. ఈ రెండు జట్లు మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండటంతో వారి ప్లే ఆఫ్స్ అవకాశాలు నల్లేరుపై నడకే అని చెప్పాలి. గుజరాత్, ఆర్సీబీ మూడింటిలో తలో మ్యాచ్ గెలిచినా కనీసం మూడు, నాలుగు స్థానాల్లోనైనా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇక మిగిలింది రెండు బెర్త్‌లు. ఈ రెండు బెర్త్‌ల కోసం మూడు జట్ల మధ్య పోటీ ఉంది. రేసులో పంజాబ్ కింగ్స్‌కు (11 మ్యాచ్‌ల్లో 15 పాయింట్లు) అవకాశాలు ఎక్కువగా ఉండగా.. ఢిల్లీ, ముంబైకి ఆతర్వాతి అవకాశాలు ఉంటాయి. ఇంకా చెప్పాలంటే ముంబైతో పోలిస్తే ఢిల్లీకే కాస్త ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీ 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో 13 పాయింట్లు కలిగి ఉండగా.. ముంబై 12 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో 14 పాయింట్లు ఖాతాలో కలిగి ఉంది. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఐదు జట్లలో ముంబై మినహా మిగతా నాలుగు జట్లు ఇంకా తలో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

ప్లే ఆఫ్స్ రేసులో ప్రధానంగా ఉన్న జట్లు ఆడాల్సి మ్యాచ్‌లు ఇవే..

గుజరాత్..
మే 18న ఢిల్లీతో (రాత్రి, ఢిల్లీ)
మే 22న లక్నోతో (అహ్మదాబాద్)
మే 25న సీఎస్‌కేతో (మధ్యాహ్నం, అహ్మదాబాద్)

ఆర్సీబీ
మే 17న కేకేఆర్‌తో (బెంగళూరు)
మే 23- సన్‌రైజర్స్‌తో (బెంగళూరు)
మే 27- లక్నోతో (లక్నో)

పంజాబ్
మే 18న రాజస్థాన్‌తో (మధ్యాహ్నం, జైపూర్)
మే 24న ఢిల్లీతో (జైపూర్)
మే 26న ముంబై ఇండియన్స్‌తో (జైపూర్)

ముంబై ఇండియన్స్
మే 21న ఢిల్లీతో (ముంబై)
మే 26న పంజాబ్‌తో (జైపూర్)

ఢిల్లీజి
మే 18న గుజరాత్‌తో (రాత్రి, ఢిల్లీ)
మే 21న ముంబై ఇండియన్స్‌తో (ముంబై)
మే 24న పంజాబ్‌తో (జైపూర్)

# ఆఫీస్‌కు రండి.. సీఈవో ఆర్డర్..
# ఉద్యోగులు ఏం చేశారో తెలుసా?

రిమోట్ వర్క్.. అదేనండి వర్క్ ఫ్రమ్ హోమ్. చాలా మంది ఉద్యోగులకు ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. ఓపక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే మరో వైపు ఉద్యోగాన్ని చూసుకుంటున్న వారికి ఈ విధానం చాలా అనువుగా ఉంటోంది. అయితే కోవిడ్-19 మహమ్మారి విజృంభణ సందర్భంగా అమలులోకి వచ్చిన ఈ రిమోట్ వర్క్ విధానం నెమ్మదిగా తొలగిపోతోంది. చాలా కంపెనీలు ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు పిలుస్తున్నాయి. సౌకర్యవంతమైన ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడినవారు ఆఫీసులకు తిరిగివెళ్లడానికి ఇష్టపడటం లేదు. చాలా కంపెనీలు ఉద్యోగులను బలవంతంగానైనా ఆఫీసులకు రప్పిస్తున్నాయి. ఇలాగే ఉద్యోగులను ఆఫీసులకు రావాలని ఆదేశించడం ఓ ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీలో ఎలా బెడిసికొట్టిందో.. ఉద్యోగులు ఏం చేశారో చెబుతూ ఆ కంపెనీలో పనిచేసే వ్యక్తి రెడ్డిట్‌లో షేర్ చేసిన స్టోరీ ఆసక్తికరంగా మారంది.




ఆఫీస్‌కు రాకపోతే ఏం చేస్తారు?

కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేసిన కంపెనీ.. ఆ సమయంలో చాలా మందిని రిమోట్ వర్క్ విధానంలోనే నియమించుకుంది. కానీ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అందరూ క్రమంగా ఆఫీసులకు రావాలని యాజమాన్యం ఆదేశించింది. అసలు సమస్య ఏంటంటే.. దాదాపు చాలా మంది రిమోట్ వర్క్ విధానంలోనే ఉద్యోగాల్లో చేరారు. కొంత మంది తమ ప్రాంతాలకు మకాం మార్చారు. ఇప్పుడు వీళ్లకు ఎటువంటి ఆర్థిక సహకారం అందించకుండా ఏడాదిలోగా ఆఫీసులకు వచ్చేయాలని కంపెనీ చెబుతోంది.

దీంతో ఉ?ద్యోగులు గందరగోళంలో పడిపోయారు. ఈక్రమంలో కంపెనీ వైడ్ టౌన్ హాల్ సమావేశంలో ఆఫీస?కు రావడానికి అయిష్టంగా ఉన్నవారికి మినహాయింపులేమైనా ఉంటాయా అని ఓ ఉద్యోగి నేరుగా సీఈవోనే అడిగేశారు. దానికి సీఈవో స్పందిస్తూ “మీరు ఇంటి నుండి పని చేయాలనుకుంటే, వేరే చోట ఉద్యోగం చూసుకోండి” అంటూ బదులిచ్చారు. దీంతో అవాక్కైన ఉద్యోగులు ఆన్‌లైన్ కాల్స్‌లోకి రావడం మానేశారు. చాలా మంది వెంటనే రాజీనామా చేశారు. ఎక్కువ మంది వెళ్లిపోవడంతో కంపెనీకి షాక్ తగిలింది. క్యూసీ ఉ?ద్యోగులతోనే యాప్ డెవలప్‌మెంట్ చేయించాల్సి వచ్చింది.

# టీసీఎస్ ఘనత: వరల్డ్ టాప్ 50 బ్రాండ్లలో..




ప్రముఖ్ ఐటీ దిగ్గజం ‘టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్’ కాంటర్ బ్రాండ్‌జెడ్ మోస్ట్ వాల్యూయబుల్ గ్లోబల్ బ్రాండ్స్ 2025 నివేదికలో.. ప్రపంచవ్యాప్తంగా 100 అత్యంత విలువైన బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. న్యూయార్క్‌లో కాంటార్ నిర్వహించిన స్పెషల్ 20వ ఎడిషన్ వేడుకలో.. టీసీఎస్ బ్రాండ్ వాల్యూ 57.3 బిలియన్ డాలర్లకు (రూ. 4.89 లక్షల కోట్లు) చేరుకుంది. ఇది గత ఏడాదికంటే 28 శాతం ఎక్కువని తెలుస్తోంది. మొమెంటమ్ ఐటీఎస్ఎంఏ నిర్వహించిన స్వతంత్ర బ్రాండ్ ఆడిట్లో ప్రపంచవ్యాప్తంగా 95 శాతం మంది బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు టీసీఎస్ బ్రాండ్‌ను గుర్తించారని తేలింది. పరిశ్రమ రంగాలలో ప్రపంచంలోని ప్రముఖ బ్రాండ్‌లను కలిగి ఉన్న జాబితాలో.. టిసిఎస్ ప్రపంచవ్యాప్తంగా 45వ స్థానంలో ఉంది. ఇది కంపెనీ వేగవంతమైన వృద్ధిని సూచిస్తుంది. బ్రాండ్ విలువ, ఈక్విటీలో ఈ పెరుగుదల కంపెనీ నిరంతర బ్రాండ్ నిర్మాణ ప్రయత్నాలను హైలైట్ చేస్తుంది. ఈ సందర్భంగా కాంటర్ బ్రాండ్‌జెడ్ హెడ్ మార్టిన్ గెరిరియా అధిపతి మాట్లాడుతూ.. సరైన పెట్టుబడి, వ్యూహాత్మక దృష్టితో.. బ్రాండ్లు తమ యజమానులకు మంచి వృద్ధిని అందించగలవు. టీసీఎస్ ఈ ఏడాది చూపిన పనితీరు, ఏఐ సామర్థ్యాలను విస్తృతంగా వినియోగించుకోవడం వంటికి దీని వృద్ధికి దోహదపడ్డాయి. టీసీఎస్ చేపడుతున్న కార్యక్రమాలే సంస్థ బలమైన గుర్తింపుకు కారణమైందని ఆయన అన్నారు. ప్రపంచ టాప్ 50 బ్రాండ్లలో టీసీఎస్ ఒకటిగా చేరిన సందర్భంగా కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ ‘అభినవ్ కుమార్’ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా కాంటార్ బ్రాండ్‌జెడ్ ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్‌లను గుర్తించింది. పరిశ్రమలో మాకు ఉన్న బ్రాండ్ నాయకత్వంతో పాటు.. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ బ్రాండ్‌లలో టిసిఎస్ బ్రాండ్‌కు ఈ గుర్తింపు లభించడం చాలా సంతోషంగా ఉంది. సంస్థ వృద్ధికి దోహదపడిన నా సహోద్యోగులందరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

# ‘హరిహర వీరమల్లు’ రిలీజ్ డేట్ వచ్చేసింది!




పవన్ ఫ్యాన్స్ బీ రెడీ...

పవన్ కళ్యాణ్ ‘హరిహర వీరమల్లు’ విడుదల తేదీ ఖరారు

జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

శరవేగంగా జరుగుతున్న పోస్ట్ ప్రొడక్షన్ పనులు

త్వరలో మూడో సింగిల్, అధికారిక ట్రైలర్ విడుదల

ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం, భారీ తారాగణం

తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘హరిహర వీరమల్లు’ విడుదల తేదీ ఖరారైంది. ఈ భారీ బడ్జెట్ సినిమాను జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం నేడు అధికారికంగా ప్రకటించింది. పవన్ కళ్యాణ్ ఈ చిత్రంలో వీరమల్లు అనే యోధుడి పాత్రలో కనిపించనున్నారు. పవన్ నుంచి చాలాకాలం తర్వాత ఓ సినిమా వస్తుండడంతో, హరిహర వీరమల్లు సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం ‘హరిహర వీరమల్లు’ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైనింగ్, డబ్బింగ్ వంటి కీలక పనులను చిత్ర యూనిట్ వేగంగా పూర్తి చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని, సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. ఈ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, త్వరలోనే సినిమా మూడో సింగిల్‌తో పాటు అధికారిక ట్రైలర్‌ను కూడా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగి, విడుదల నాటికి ఆకాశాన్నంటడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఆలస్యమైనప్పటికీ, దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ ఈ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టి, సినిమాను అనుకున్న విధంగా తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందిస్తున్న సంగీతం, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, తోట తరణి ప్రొడక్షన్ డిజైన్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్‌తో పాటు బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి పాత్రలో ప్రతినాయకుడిగా నటిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా కనిపించనుంది. సీనియర్ నటులు సత్యరాజ్, జిష్షు సేన్‌గుప్తా వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తూ సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎ.ఎం. రత్నం సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ‘హరిహర వీరమల్లు’ చిత్రం, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడానికి సిద్ధమవుతోంది.

## Cinema

## రామాయణంలో ఛాన్స్ కొట్టేసిన కాజల్?



రామాయణం ఆధారంగా మన దేశంలో చాలా సినిమాలు ఇదివరకే తీశారు. తీస్తూనే ఉన్నారు. కొన్నాళ్ల క్రితం ప్రభాస్ ‘ఆదిపురుష్’ ఇలానే తీశారు. కానీ గ్రాఫిక్స్, పాత్రల తీరుతెన్నులు దారుణంగా ఉండేసరికి విపరీతమైన విమర్శలు వచ్చాయి. కట్ చేస్తే ఇ?ప్పుడు ‘రామాయణ్’ పేరుతో హిందీలో మళ్లీ సినిమా తీస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమాలో ‘యానిమల్’ ఫేమ్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా, సాయిపల్లవి సీత పాత్ర చేస్తోంది. ‘కేజీఎఫ్’ యష్ రావణుడిగా నటిస్తున్నాడు. మిగిలిన పాత్రల కోసం పలు పేర్లు వినిపిస్తున్నప్పటికీ ఎవరిని ఫైనల్ చేశారనేది ఇంకా బయటపెట్టలేదు. ప్రస్తుతానికైతే మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్ ని తీసుకున్నారనే రూమర్స్ వినిపిస్తున్నాయి. రావణుడి భార్య పేరు మండోదరి. రామాయణ్ మూవీలో ఈమె పాత్రకు చాలా తక్కువ ప్రాధాన్యం ఉండొచ్చు. మరి కాజల్ నిజంగా ఒప్పుకొందా? లేదంటే ఇవి రూమర్స్ మాత్రమేనా అనేది మరికొన్ని రోజుల్లో క్లారిటీ రావొచ్చు. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయబోతున్నారు. 2026 దీపావళికి తొలి భాగం, 2027లో రెండో భాగం రిలీజ్ చేయబోతున్నారు. మరి ఈ మూవీతో దర్శకనిర్మాతలు ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో చూడాలి?




## 40ప్లస్ క్లబ్‌లో అనసూయ.. ఇదే గ్లామర్‌తో ఇంకెన్నాళ్లు?



దాదాపు ఓ పన్నెండేళ్ల క్రితం టీవీ చానెల్‌లో న్యూస్ ప్రెజెంటర్‌గా తన ప్రస్తానం ప్రారంభమైనప్పుడు తానే కాదు ఎవరూ ఊహించి ఉండరు.. ఇంతగా, ఇన్ని విధాలుగా అనసూయ తెలుగు వారికి దగ్గరవుతుందని. కేవలం పుష్కర కాలంలో పుష్కలమైన అవకాశాలు అందుకుంటూ అంతకంతకూ ఎదుగుతూ వచ్చిన అనసూయ...స్టార్ యాంకర్ నుంచి సిల్వర్ స్క్రీన్ స్టార్ దాకా దూసుకుపోయింది. తెలుగులో చిన్నితెర మీద యాంకర్, ప్రోగ్రామ్ హోస్ట్‌గా చేసిన ఎవరూ సాధించలేకపోయిన క్రేజ్‌ను ఆమె స్వంతం చేసుకుంది. ఓ వైపు యాంకర్‌గా పలు టీవీ షోస్‌లో కనిపిస్తూనే, మరోవైపు వెండితెర మీద కూడా తనదైన ముద్ర వేస్తోంది. క్షణం, రంగస్థలం, పుష్ప లాంటి చిత్రాల్లోని ఆమె పాత్రలు సినీరంగంలో ఆమె అవకాశాలను విస్తృతం చేశాయి. ప్రస్తుతం అనసూయ చిన్నితెర మీద కావచ్చు, వెండితెర మీద కావచ్చు, పబ్లిక్ ఈవెంట్స్ లో కావచ్చు... ఫుల్ క్రే జ్ ఉన్న సెలబ్రిటీ అనడంలో అతిశయోక్తి లేదు అయితే ప్రస్తుతం సెలబ్రిటీల ఇమేజ్, పాప్యులారిటీని సరైన రీతిలో అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. గతంలో ఒక నటి/నటుడు, యాంకర్ ఎవరైనా సరే తమ ప్రతిభ ద్వారా మాత్రమే అత్యున్నత స్థానాన్ని సాధించారని చెప్పేందుకు అవకాశం ఉండేది. అయితే ఈ సోషల్ మీడియా యుగంలో ఇన్‌స్టాలు, రీల్స్...వగైరాలు వెల్లువెత్తుతూ సినీ విమర్శకుల్ని సైతం సెలబ్రిటీల స్థాయిపై విశ్లేషణలకు వీలు లేకుండా చేస్తూన్నాయి. మరోవైపు అనసూయ సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీ. ఆమెను ప్రస్తుతం ఈ స్థాయిలో ఉంచిన వాటిలో ఆమె గ్లామర్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తోందనేది నిర్వివాదం. ఆ విషయం ఆమె కూడా గుర్తించింది కాబట్టే సినిమాల్లో కాకున్నా, సోషల్ మీడియాలో గ్లామరస్ పోస్టులు, వీడియోల ద్వారా మెరిపిస్తూ ఉంటుంది. తన దుస్తులు, వస్త్రధారణ విషయంలో వచ్చే విమర్శలకు ఘాటుగా బదులిస్తూ ప్రతి విమర్శలు చేస్తూ వివాదాలతో కూడా నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. వీటన్నింటి నడుమ... ఆమె దురదృష్టమో అదృష్టమో కానీ.. ఎన్ని వైవిధ్యభరిత చిత్రాల్లో నటించినా, అనసూయ అనగానే ఓ అందమైన అమ్మాయి అనే భావనే సినీ అభిమానుల్లో స్థిరపడిపోయింది. ఏదేమైనా దాదాపు పాతికేళ్లు పైబడిన వయసులో ‘షో’ బిజినెస్‌లోకి ఆరంగేట్రం చేసిన అనసూయ నిన్నటి(మే 15)తో ఫార్టీ ప్లస్ వయస్కుల క్లబ్‌లోకి చేరుతోంది. ఎంత జాగ్రత్తగా కాపాడుకున్నా ఈ గ్లామర్ ఇకపై ఎంతకాలం నిలుస్తుందో తెలీదు. కాబట్టి ఇకపై నటనలో కూడా తనేంటో నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటిదాకా ఎంచుకున్నట్టే వైవిధ్యభరిత పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తూ.. గ్లామర్ డోస్‌ను తగ్గిస్తూ... అందమైన మహిళ అనే అభిప్రాయాన్ని మరిపిస్తూ.. అభినయ ప్రావీణ్యమున్న నటిగా కూడా ప్రేక్షకుల్లో బలమైన ముద్ర వేయగలిగితే మరికొన్ని దశాబ్ధాల పాటు ఆమెకు తిరుగు ఉండకపోవచ్చు.



## వార్-2 సర్ ప్రైజ్...




హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య ఆసక్తికర సంభాషణ

ఎన్టీఆర్ పుట్టినరోజున ‘వార్ 2’ సర్‌ప్రైజ్ ప్రకటించిన బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్

ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్న జూనియర్ ఎన్టీఆర్

‘కబీర్‌ను వేటాడి బహుమతిస్తా’ అంటూ తారక్ ట్వీట్

మే 20న టీజర్ రావొచ్చని ఫ్యాన్స్ అంచనా

ఆగస్టు 14న ‘వార్ 2’ సినిమా విడుదల



యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఓ అదిరిపోయే సర్‌ప్రైజ్‌తో రాబోతున్నట్లు బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ప్రకటించారు. దీనిపై ఎన్టీఆర్ కూడా అంతే ఆసక్తికరంగా స్పందించారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ ‘వార్ 2’ సినిమా నుంచి ఈ కానుక ఉండబోతోందని తెలుస్తోంది. ఈ వార్తతో ఇరువురి అభిమానుల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

హృతిక్ ప్రకటన, ఎన్టీఆర్ స్పందన

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ ఈ పాన్ ఇండియా సినిమాను నిర్మిస్తోంది. కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో, మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఓ ప్రత్యేక కానుకను విడుదల చేయనున్నట్లు హృతిక్ రోషన్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. అదేంటో ఊహించగలవా? అని ఎన్టీఆర్ ను టీజ్ చేశారు.

హృతిక్ చేసిన ఈ ప్రకటనపై ఎన్టీఆర్ వెంటనే స్పందించారు. సర్‌ప్రైజ్ కోసం తాను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, “కబీర్ (వార్ సినిమాలో హృతిక్ పాత్ర పేరు).. నిన్ను వేటాడి, నీకు నేనే ఓ ప్రత్యేక బహుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా” అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు స్టార్ల మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

టీజర్‌పైనే అభిమానుల ఆశలు

ప్రస్తుతం ‘వార్ 2’ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్టీఆర్ పుట్టినరోజున చిత్ర యూనిట్ నుంచి టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ గట్టిగా ప్రచారం జరుగుతోంది. ‘వార్’ మొదటి భాగం ఎంతటి సంచలన విజయం సాధించిందో తెలిసిందే. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ కలిసి నటించిన ఆ స్పై థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న ‘వార్ 2’పై అంచనాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఓ ‘రా’ ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే ప్రకటించిన ప్రకారం, ‘వార్ 2’ సినిమాను ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. మరి మే 20న ఎన్టీఆర్ అభిమానులకు ఎలాంటి ట్రీట్ దక్కుతుందో చూడాలి.

## మంచు విష్ణు ‘కన్నప్ప కామిక్ బుక్ ఫైనల్ చాప్టర్ కాన్సెప్ట్ వీడియో విడుదల

జూన్ 27న ‘కన్నప్ప’ ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్

ఇప్పటికే జోరుగా ప్రమోషనల్ కార్యక్రమాలు







కన్నప్ప కథ అందరికీ తెలియాలనే ఉద్దేశంతో కామిక్ బుక్స్ రూపంలోకి తీసుకొచ్చిన మేకర్స్

కామిక్ సిరీస్‌లోని మొదటి రెండు ఎపిసోడ్‌లకు మంచి స్పందన

ఇప్పుడు మూడో అధ్యాయం విడుదల

డైనమిక్ స్టార్ మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ ‘కన్నప్ప’ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కాబోతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రమోషనల్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. టీజర్‌లు, పాటలు సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇప్పటికే యూఎస్‌లో విష్ణు స్టార్ట్ చేసిన కన్నప్ప ప్రమోషనల్ టూర్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక, కన్నప్ప కథ అందరికీ తెలియాలనే ఉద్దేశంతో చిత్ర బృందం కామిక్ బుక్స్ రూపంలోకి తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. కామిక్ సిరీస్‌లోని మొదటి రెండు ఎపిసోడ్‌లకు మంచి స్పందన లభించింది. ఇప్పుడు మూడో అధ్యాయాన్ని విడుదల చేశారు. ఈ చివరి ఎపిసోడ్ తిన్నడు భావోద్వేగ, ఆధ్యాత్మిక పరివర్తనను సూచిస్తుంది. అతను ఒకప్పుడు దైవత్వం ఆలోచనను తిరస్కరిస్తాడు.. కానీ చివరికి శివుని భక్తుడిగా మారుతాడు. కన్నప్పగా మారడానికి అతని అద్భుతమైన ప్రయాణాన్ని ఈ మూడో అధ్యాయం వివరిస్తుంది. భక్తి, ప్రేమ, త్యాగం, విధితో నిండిన ఈ కథ అందరినీ ఆకట్టుకుంటుంది. ఏఐ ద్వారా క్రియేట్ చేసిన ఈ విజువల్స్, వీడియో అందరినీ అబ్బుర పరిచేలా ఉంది. ఇంతకు మించి అనేలా సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయని టీం చెబుతోంది. విజువల్ ఎఫెక్ట్స్‌లో జాప్యం వల్లే ఈ మూవీని జూన్ 27కి వ్యూహాత్మకంగా మార్చారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ ఎపిక్ మూవీలో రెబల్ స్టార్ ప్రభాస్ గెస్ట్ రోల్ లో కనిపించనున్నారు. మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషించారు.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620